# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




**నేడు శ్రీకాకుళం జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన**

నరసన్నపేటలో 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'

- వివరాలు 6 లో..







## రాయలసీమ నుంచే


# 5వ జనరేషన్ ఫైటర్ జెట్లు

- ఆత్మనిర్భర్ లక్ష్యంలో ఆమ్కా ప్రాజెక్టు ముందడుగు
- 36 రోజుల్లో జెట్ స్పీడ్‌లో ప్రాజెక్టుకు అనుమతులు
- ప్రధాని మోదీ ఇచ్చిన పాదుపు ఉద్యమానికి ఏపీ సారథ్యం
- త్వరలో బంగారం ఉత్పత్తికి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్
- కేంద్ర మంత్రి రాజ్ నాథ్‌సింగ్‌తో కలిసి అమ్కా ప్రాజెక్టుకు సీఎం శంకుస్థాపన
- ఏపీ అంటే అడ్వాన్స్డ్ ప్రదేశ్: రక్షణ మంత్రి రాజ్‌నాథ్

2

పుట్టపర్తిలో భారీ పెట్టుబడితో అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ (ఆమ్కా) ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగింది. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం చంద్రబాబు నాయుడు సంయుక్తంగా శిలాఫలకం ఆవిష్కరించారు. ఆమ్కాతోపాటు భారత్ డైనమిక్స్, కల్యాణీ స్ట్రాటజిక్ సిస్టమ్స్, డ్రోన్ సిటీ సహా పలు రక్షణ రంగ ప్రాజెక్టులకూ ఏకకాలంలో శంకుస్థాపన జరిగింది. శ్రీహరికోట అంతరిక్ష శక్తి, నాగాయలంక క్షిపణి శక్తి, పుట్టపర్తి రక్షణ శక్తి, విశాఖ నౌకాదళ శక్తితో దేశానికే రక్షణ కవచంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు.

## పోలవరంపై చిత్తశుద్ధి ఉంది... నిర్వాసితులపై అభిమానమూ ఉంది



- నిర్వాసితుల కోసమే పోలవరం జిల్లా
- 23నెలల్లో రూ.2,250 కోట్లు పరిహారం చెల్లించాం
- పోలవరం నిర్వాసితులతో భేటీలో సీఎం చంద్రబాబు
- సమస్యల పరిష్కారంపై నమ్మకం వచ్చింది: నిర్వాసితులు

9



4

హైబ్రిడ్ మోడ్‌లో

## మహానాడు!

- టీడీపీ సెంట్రల్ ఆఫీస్‌లో 27, 28 తేదీల్లో నిర్వహణ
- 'ఆయిల్ క్రైసిస్', పాదుపు చర్యల్లో భాగంగా నిర్ణయం
- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా వెల్లడి

## చరిత్రను మార్చబోతున్న ఏఎంసీఏ

- భారతదేశ రక్షణరంగ కొత్త శక్తి కేంద్రంగా పుట్టపర్తి
- నాడు కియా కార్లు.. నేడు ఫైటర్ జెట్లు.. సీఎం చలవే
- 23నెలల్లో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్' ప్రపంచానికి చూపించాం
- అభివృద్ధిలో ఉమ్మడి అనంత నెం.1 కావడం ఖాయం
- వాళ్లది ఫ్యాక్షన్... మనది ఫైటర్ జెట్... అర్థమైందా రాజా...
- ఏఎంసీఏ ప్రాజెక్టు శంకుస్థాపనలో మంత్రి లోకేష్

5





## నాలుగో విడతగా రూ.307 కోట్లు పంపిణీ: నిమ్మల

8

## 16 నెలలు... 16కు పైగా విజయాలు

- స్పష్టమైన మార్పు చూపించిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'
- ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సీఎం చంద్రబాబు పిలుపు
- సమీక్షలో ప్రజా సహకారానికి ప్రశంసలు
- పాదుపు చర్యల్లో భాగంగా అధికారులతో సీఎం వర్చువల్ సమీక్ష

4

## ఎక్సైజ్ విధానంలో పారదర్శకత

- ఎక్సైజ్ శాఖలో వినూత్న మార్పులకు శ్రీకారం
- ప్రజల ఆరోగ్యానికీ పెద్దపీట... పెరిగిన ఆదాయం
- మద్యం నాణ్యతపై ల్యాబుల్లో పెద్దఎత్తున పరీక్షలు
- ఎక్సైజ్ శాఖను పూర్తిగా గాడిలో పెట్టిన సీఎం చంద్రబాబు



11




# రాయలసీమ నుంచే 5వ జనరేషన్ ఫైటర్ జెట్లు

- ఆత్మనిర్భర్ లక్ష్యంలో ఆమ్కా ప్రాజెక్టు ముందడుగు
- 36 రోజుల్లో జెట్ స్పీడ్‌లో ఈ ప్రాజెక్టుకు అనుమతులు
- ప్రధాని మోదీ ఇచ్చిన పొదుపు ఉద్యమానికి ఏపీ సారధ్యం
- త్వరలో బంగారం ఉత్పత్తికి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్
- కేంద్ర మంత్రి రాజ్ నాథ్‌సింగ్‌తో కలిసి ఆమ్కా ప్రాజెక్టుకు సీఎం శంకుస్థాపన
- ఏపీ అంటే అడ్వాన్స్డ్ ప్రదేశ్: రక్షణ మంత్రి రాజ్‌నాథ్ కితాబు




పుట్టపర్తి (చైతన్య రథం): అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్టు సహా వివిధ డిఫెన్సు యూనిట్లతో దేశానికి రక్షణ కవచంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలోని ఆమ్కా ప్రాజెక్టుతో ప్రధాని మోదీ ఆశిస్తున్న ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించే అవకాశం ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఆమ్కా ప్రాజెక్టు సహా ఇతర రక్షణ రంగ ప్రాజెక్టులకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. డీఆర్డీఓలో భాగమైన ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలోని అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్, ఫ్లైట్ టెస్టింగ్ ప్రాజెక్టు శిలాఫలకాన్ని ఇరువురు నేతలు ఆవిష్కరించారు. త్రివిధ దళాలకు రక్షణ ఉత్పత్తులను తయారు చేయనున్న కల్యాణీ స్ట్రాటజిక్ సిస్టమ్స్ ఆధ్వర్యంలోని ఆగ్నేయాస్త్ర ఎనర్జిటిక్స్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, హెచ్‌ఎఫ్ సీఎల్ ప్రాజెక్టుల శిలాఫలకాలను కేంద్ర మంత్రితో కలిసి సీఎం ప్రారంభించారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులోని డ్రోన్ సిటీలో ఏర్పాటు కానున్న 5 డ్రోన్ తయారీ, టెక్నాలజీ కంపెనీలను కూడా వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ...” సత్యసాయి బాబా బోధనలతో ఈ ప్రాంతం నుంచి విశ్వ శాంతికి బాటలు పడ్డాయి. ఇప్పుడు పుట్టపర్తిలో ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్టు రావటం ఎంతో కీలకంగా మారింది. దేశం గర్వించే వ్యూహాత్మకమైన రక్షణ కేంద్రంగా పుట్టపర్తి మారుతుంది. ఆమ్కా ప్రాజెక్టుతో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యసాధనలో ఏపీ ముఖ్యపాత్ర పోషిస్తుంది. భారత రక్షణ రంగాన్ని ఆధునీకరించటంతో పాటు బలోపేతం చేయటంపై ప్రధాని దృష్టి సారించారు. ఆధునిక తరం స్టెల్త్ యుద్ధ విమానాలను తయారు చేసేలా ఆమ్కా ప్రాజెక్టు ఏర్పాటు అవుతోంది. భారత రక్షణ శక్తిని ప్రపంచానికి చాటటంలో ఆపరేషన్ సింధూర్ ఓ ప్రత్యక్ష ఉదాహరణ. ఆపరేషన్ సింధూర్ లో వినియోగించిన డ్రోన్లు ఏపీలోనే తయారై, టెస్ట్ చేశారు. ఆమ్కా లాంటి ప్రాజెక్టును ఏపీకి కేటాయించినందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ధన్యవాదాలు. రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడితో 7,500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రాజెక్టు వస్తుంది. ఫైటర్ జెట్ ఇంటిగ్రేషన్ తో పాటు ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రంగా పుట్టపర్తి మారుతుంది. అత్యంత వేగంగా ఈ ప్రాజెక్టును సాకారం చేయటంలో రక్షణ శాఖ, కేంద్ర ప్రభుత్వ సహకారం అందించాయి.” అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

### రోజుల వ్యవధిలోనే అమ్కా ప్రాజెక్టు సాకారం

“కేవలం 36 రోజుల్లోనే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగలిగామని.. జెట్ స్పీడ్‌తో అనుమతులిచ్చామని సీఎం వివరించారు. ఏరోస్పేస్ రంగంలో కీలకమైన ఈ ప్రాజెక్టుతో పాటు మరికొన్ని డిఫెన్సు ప్రాజెక్టులు కూడా వస్తున్నాయి. భారత్ ఫోర్జ్, హెచ్‌ఎఫ్ సీఎల్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీలకు శంకుస్థాపన చేశాం. ఇటీవల యుద్ధాల్లో డ్రోన్లే కీలకంగా మారాయి. వ్యవసాయం నుంచి చాలా రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరిగింది. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేసి ఉత్పత్తి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. శ్రీహరికోట అంతరిక్ష శక్తి, నాగాయలంకలో క్షిపణిశక్తి, పుట్టపర్తి రక్షణ శక్తి, విశాఖ నుంచి నౌకాదళ శక్తితో మొత్తం దేశానికే రక్షణ కవచంగా ఏపీ నిలుస్తుంది. కూటమి అధికారంలోకి వచ్చాకే రాయలసీమకు నీరిచ్చి లక్ష కోట్లతో హార్టికల్చర్ హబ్‌గా మారుస్తున్నాం. రాయలసీమలో ఇనుప ఖనిజం, సున్నపురాయి లాంటి ఖనిజ వనరుల్ని సమర్థంగా వినియోగించుకుంటాం. కడప స్టీల్ ప్లాంటు 2027 డిసెంబరు నాటికి పూర్తి చేస్తాం. స్టీల్, సిమెంట్ ప్లాంట్లు, సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు సీమ కేంద్రంగా మారుతుంది. డిఫెన్స్, స్పేస్, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్ లాంటి పరిశ్రమలతో రాయలసీమ రతనాల సీమగా మారుస్తాం. కొప్పర్తి పారిశ్రామిక నోడ్ ఎలక్ట్రానిక్స్ తయారీ హబ్‌గా మారుతుంది. తిరుపతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్లాంట్, శ్రీహరి కోట సమీపంలో స్పేస్ సిటీ ఏర్పాటు చేస్తాం. కియా పరిశ్రమ ఏటా 18 లక్షల కార్లు తయారు చేస్తోంది. కరవు సీమలో తయారైన కార్లు 80 దేశాల్లో తిరుగుతున్నాయి. రాయలసీమలోని ఆర్డీటీ సంస్థకు విదేశీ విరాళాల విషయంలో సమస్య ఉత్పన్నం అయితే కేంద్రంతో మాట్లాడి మంత్రి లోకేష్ ఆ సమస్యను పరిష్కరించారని” సీఎం వెల్లడించారు.

### గతంలో కేజీఎఫ్ ఇప్పుడు జేజీఎఫ్

“త్వరలో కర్నూలు జిల్లా జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్ నుంచి బంగారం ఉత్పత్తి జరుగుతుంది. JGFలో ఈ ఏడాది 600 కేజీల బంగారం ఉత్పత్తి అవుతుంది. రెండో ఏడాది 1,500 కిలోల బంగారం తయారవుతుంది. రానున్న రోజుల్లో

- (మిగతా వివరాలు 3లో)













# రాయలసీమ నుంచే 5వ జనరేషన్ ఫైటర్ జెట్లు



(2వ పేజీ తరువాయి)

బంగారం ఉత్పత్తికి ఏపీ కీలకంగా మారుతుంది. సమర్ధవంతమైన నీటి నిర్వహణతో జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. అభివృద్ధిని బుల్లెట్ స్పీడ్‌తో తీసుకెళ్తున్నాం. అవకాశాలు తెచ్చే బాధ్యత మాది. వాటిని అందిపుచ్చుకునే బాధ్యత యువతది. గత పాలనలో విధ్వంసం చేశారు. పరిశ్రమలు తరిమేశారు. సాగునీటి రంగాన్ని నిర్లక్ష్యం చేశారు.

సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో మళ్లీ ఏపీ బ్రాండ్ ను పునరుద్ధరించాం. 23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. వీటివల్ల 24లక్షల మందికి ఉద్యోగాలువస్తాయి. యువతకు ఇక్కడే ఉద్యోగాలు రావాలి, ఇతరులకూ ఇక్కడే ఉపాధి కల్పించేలా పరిశ్రమలు వస్తున్నాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ లాంటి ప్రాజెక్టులు వచ్చాయి. రిలయన్స్, బీపీసీఎల్ లాంటి ప్రాజెక్టులువస్తాయి. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రంగా మూడు ఎకనామిక్ రీజియన్లలో పెట్టుబడులు వస్తాయి. చిప్ నుంచి షిప్ వరకూ మన దేశంలోనే తయారు కావాలని ప్రధాని మోదీ పిలుపు ఇచ్చారు.

ఏపీలో డిజైన్‌చేయండి,పెట్టుబడులు పెట్టండి, ఉత్పత్తులు తయారు చేయండి అని పారిశ్రామిక వేత్తల్ని కోరుతున్నాను. పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా ఏపీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం... వేగంగా అనుమతులు ఇస్తున్నాం. దేశానికి తిరుగులేని శక్తిగా రాయలసీమ, ఆంధ్రప్రదేశ్ తయారవుతాయి.” అని ముఖ్యమంత్రి వివరించారు.

## నాదేశం- నాబాధ్యత

“పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావం మనపై కూడా పడిందని...ఇంధనం, బంగారం కొనుగోలుతో విదేశీ మారక నిల్వలు తరిగిపోతున్నాయని సీఎం అన్నారు. దేశానికి ఆర్థిక భద్రత కూడా అత్యంత కీలకమని.. ఇతర దేశాలు కూడా పొదుపు చర్యలు చేపట్టాయని తెలిపారు. ప్రధాని మోదీ ఇచ్చిన 7 అంశాలను ఆచరిద్దాం. పొదుపు చర్యల్లో భాగంగా కాన్వాయ్ లో వాహనాల సంఖ్యను తగ్గించుకున్నాం. దీనిపై ఓ కార్యాచరణను కూడా తీసుకువచ్చాం. వర్క్ ఫ్రమ్ హోమ్ లాంటి అంశాలను అమల్లోకి తీసుకు రావాలని కోరుతున్నాను. ప్రతీ భారతీయుడూ ప్రస్తుత సవాళ్లను అవకాశాలుగా మలచుకోవాలి. ప్రధాని మోదీ ఇచ్చిన పొదుపు ఉద్యమానికి ఏపీ సారధ్యం వహించాలని” ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

## 7 సంస్థలతో ఒప్పందాలు

అంతకు ముందు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం చంద్రబాబు సమక్షంలో 7సంస్థలు ఎంఓయూలు కుదుర్చుకున్నాయి. రూ.4460 కోట్ల పెట్టుబడులు, 6400 మందికి ఉద్యోగాలు కల్పించేలా ఈ ఒప్పందాలు కుదిరాయి. భారత్ ఫోర్జ్, రఘువంశీ మెషీన్ టూల్స్, సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్, ఎన్ఐబీఈ గ్రూప్, పీఎంటీ డిఫెన్స్, చక్రవ్యూహ్ డైనమిక్స్, ఇండస్ బ్రిడ్జ్ వెంచర్స్ సంస్థలు ఈ ఎంఓయూలు కుదుర్చుకున్నాయి. శంకుస్థాపన కార్యక్రమానికి ముందు ఆమ్కా ప్రాజెక్టులో నిర్మితం కానున్న అడ్వాన్స్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ నమూనాతో పాటు భారత్ డైనమిక్స్ సహా వేర్వేరు సంస్థలు ఏర్పాటు చేసిన మిస్సైళ్లు, హ్యాండ్ గ్రెనేడ్ లు, టార్పెడో నమూనాలు, ఆధునిక తుపాకుల ప్రదర్శనను కేంద్ర మంత్రి రాజ్ నాధ్ సింగ్‌తో కలిసి సీఎం తిలకించారు. శంకుస్థాపనల కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు, మంత్రులు టీజీ భరత్, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్య ప్రసాద్, సవిత, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఏపీ సలహాదారు సతీష్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

## ఏపీ ఇక అడ్వాన్స్‌డ్ ప్రదేశ్: రాజ్‌నాథ్ సింగ్

ఆమ్కా ప్రాజెక్టు ఏపీ సహా దేశ రక్షణలో ఓ చారిత్రాత్మక అధ్యాయాన్ని జోడిస్తోందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. గూగుల్ లాంటి ఐటీ దిగ్గజ కంపెనీలతో పాటు రక్షణ రంగ పరిశ్రమల్ని ఆకర్షిస్తున్న ఏపీ పేరు అడ్వాన్స్ ప్రదేశ్ అని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. 5 జనరేషన్ ఆధునిక స్టెల్త్ యుద్ధ విమానాల్ని తయారు చేస్తున్న రాయలసీమను మిలటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్సుగా అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు. రూ.15 వేల కోట్ల విలువైన పెట్టుబడితో ఎయిర్ క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ తో పాటు ఆధునిక ఫ్లైట్ టెస్టింగ్ సెంటర్ ను కూడా ఏర్పాటు చేస్తున్నామని ఇలాంటి ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రాలు కేవలం కొద్దిదేశాల వద్ద మాత్రమే ఉన్నాయని.. ఇప్పుడు భారత్ కూడా ఆ సరసన చేరిందని అన్నారు.

అమ్కా ప్రాజెక్టుతో తయారైన ఆధునిక యుద్ధ విమానాలు మన రక్షణ శక్తిని చాటేలా మన గగనశక్తిని చాటేలా పుట్టపర్తి నుంచి టేకాఫ్ అవుతాయని కేంద్ర మంత్రి వివరించారు. ఆ తరహా యుద్ధ విమానాలను పుట్టపర్తి నుంచి తయారు చేయబోతున్నామని తెలిపారు. భారత్ డైనమిక్స్ లిమిటెడ్ కూడా రూ.480 కోట్లతో ఆధునిక అటానమస్ అండర్ వాటర్ వ్యవస్థలను, టార్పెడోలను ఉత్పత్తి చేస్తుందన్నారు. ఇప్పటి వరకూ దిగుమతి చేసుకుంటున్న చాలా పరికరాలను కూడా స్వదేశీయంగా తయారు చేసుకోగలమని చెప్పారు.











చైతన్యరథం

# 16 నెలలు... 16కు పైగా విజయాలు

- స్పష్టమైన మార్పు చూపించిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'
- ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సీఎం చంద్రబాబు పిలుపు
- సమీక్షలో ప్రజా సహకారానికి ప్రశంసలు
- పొదుపు చర్యల్లో భాగంగా అధికారులతో సీఎం వర్చువల్ సమీక్ష



అమరావతి (చైతన్య రథం): గతేడాది జనవరి నుంచి నేటి వరకు ప్రతీ నెలా 3వ శనివారం నిర్వహిస్తోన్న 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం పరిశుభ్రత–పర్యావరణ విషయంలో ఎంతో మార్పు తీసుకువచ్చిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారుల దగ్గర సంతోషం వ్యక్తం చేశారు. 16 నెలలుగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా సాధించిన విజయాల నుంచి స్ఫూర్తి పొంది, మరింత కష్టపడి పనిచేయాలని అధికారులకు సీఎం సూచించారు. ప్రజల సహకారంతోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని చెప్పారు. క్యాంపు కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై శుక్రవారం అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పొదుపు చర్యల్లో భాగంగా ఈసారి సమీక్షను ఆన్‌లైన్‌లో చేపట్టారు. మునిసిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, ఇంకా పలువురు ఐఏఎస్ అధికారులు, జిల్లాల కలెక్టర్లు, మునిసిపల్ కమిషనర్లు, పంచాయతీ రాజ్ అధికారులు, సెర్ప్, మెప్మా, హెల్త్, పీసీబీ సహా సుమారు 150మంది వరకు అధికారులు వర్చువల్‌గా సమీక్షలో పాల్గొన్నారు. జిల్లాస్థాయిలో కూడా ఇకపై అధికారులు రివ్యూలు సాధ్యమైనంత వరకు ఆన్లైన్ విధానంలో, లేదంటే హైబ్రిడ్ విధానంలో నిర్వహించాలని సీఎం ఈ సందర్భంగా కలెక్టర్లకు సూచించారు. అలాగే సాగునీటి విడుదలపై కార్యాచరణ సిద్ధం చేయాలని జలవనరుల శాఖ, వ్యవసాయ శాఖ అధికారులకు, కలెక్టర్లకు సీఎం సూచించారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు.

## 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' విజయాలు

1. మన ప్రభుత్వం వచ్చాక 86 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వేస్ట్ క్లియర్. మొత్తంగా ఈ 23 నెలల్లో 121 లక్షల టన్నుల చెత్త తొలగింపు. జూన్‌కల్లా 100 శాతం క్లియర్.
2. డోర్ టు డోర్ కలెక్షన్ ద్వారా ప్రతీ రోజూ పట్టణాల్లో 7,527 టన్నులు, గ్రామాల్లో 1,430 టన్నుల చెత్త సేకరణ.
3. రూ.1,254 కోట్లతో 6 వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టులు, త్వరలో 6 సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు.
4. చెత్త ప్రాసెసింగ్ కోసం రూ.603 కోట్లతో 107 ఇంటిగ్రేటెడ్ ప్లాంట్లు అక్టోబర్‌నాటికి అందుబాటులోకి వస్తాయి. అప్పుడు డంపింగ్ యార్డ్ అనేదే ఉండదు.
5. నెట్ జీరో లక్ష్యంలో భాగంగా నెట్ జీరో హెల్తీ క్యాంపస్ హాస్టళ్లు, ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ విద్యుత్, కిచెన్ గార్డెన్స్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, కంపోస్టింగ్, వాటర్ టెస్ట్ కిట్స్, ముస్తాబు వంటి కార్యక్రమాల అమలు.
6. అన్ని పట్టణాల్లో ప్రతీ నెలా 10, 20 తేదీల్లో ఈ–వ్యర్థాలు సేకరణ. ఇప్పటివరకు 22 మెట్రిక్ టన్నుల ఈ వేస్ట్ సేకరణ.
7. చెత్త సేకరణకు 200 ఈ–ఆటోల వినియోగం. ఈ నెలాఖరుకల్లా కొత్తగా అందుబాటులోకి 5,000 పుష్ కార్ట్స్, 12,000 ట్రై సైకిళ్లు.
8. రాష్ట్రంలో ప్రస్తుతం 31.33 శాతానికి పెరిగిన గ్రీన్ కవర్. దీనిని 2030నాటికి 37 శాతానికి, 2047కల్లా 50 శాతానికి పెంచాలని లక్ష్యం.
9. 650 స్వచ్ఛ రథాలతో గ్రామాల్లో రోజుకు 125 టన్నుల పొడి చెత్త సేకరణ. ఇప్పటివరకు వ్యర్థాలు డిపాజిట్ చేసినవారికి రూ.8కోట్ల విలువైన నిత్యావసరాల అందజేత.
10. కొత్తగా గ్రీన్ షాప్స్ ప్రారంభం. ప్రజలు అక్కడికి వెళ్లి ప్లాస్టిక్, ఐరన్‌వంటి వ్యర్థాలను ఇచ్చి... తిరిగి తమకు కావాల్సిన నిత్యావసర వస్తువులు పొందే సౌలభ్యం.
11. 'స్వచ్ఛపథం' పేరుతో ప్రతీ బుధవారం రహదారులు, డంపింగ్ యార్డులు శుభ్రం.
12. డబ్ల్యువోడబ్ల్యు – పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహణ.
13. నెల్లూరు, అనకాపల్లి, చిత్తూరులో నిర్మాణంలో సర్క్యులర్ ఎకానమీ పార్కులు.
14. వినియోగంలోకి 50ప్లాస్టిక్ వ్యర్థయూనిట్లు. జూన్ నాటికి అందుబాటులోకి మరో 210 యూనిట్లు.
15. రాష్ట్రానికి పెద్దఎత్తున స్వచ్ఛ సర్వేక్షణ అవార్డులు.
16. క్లైమేట్‌యాక్షన్ విభాగంలో చిత్తూరుజిల్లా కందుల వారిపల్లెకు కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ అవార్డు.

### పంచాయతీలకు అవార్డులపై సీఎం అభినందన

గ్రామీణాభివృద్ధి, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీలు జాతీయస్థాయిలో గుర్తింపు పొందడం గర్వకారణంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ విజయాలకు గ్రామస్థాయి సిబ్బంది, పంచాయతీ అభివృద్ధి అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామాల ప్రజల సమిష్టి కృషి ఉందని ముఖ్యమంత్రి అన్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లను ఈ సందర్భంగా అభినందించారు. స్వర్ణాంధ్ర –స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో గ్రామ పంచాయతీలు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

### జాతీయ పంచాయతీ అవార్డుల వివరాలు:

1. 2025వ సంవత్సరానికి... సుపరిపాలన విభాగంలో అనకాపల్లి జిల్లా నాతవరం మండలం శృంగవరం గ్రామపంచాయతీకి ప్రథమ స్థానం – రూ.కోటి పురస్కారం
2. 2025వ సంవత్సరానికి... మహిళా స్నేహపూర్వక పంచాయతీ విభాగంలో తిరుపతిజిల్లా శ్రీకాళహస్తి మండలం బొక్కసంపాలెం గ్రామపంచాయతీకి ప్రథమ స్థానం –రూ.కోటి పురస్కారం.
3. 2025వ సంవత్సరానికి... పేదరిక నిర్మూలన, జీవనోపాధి మెరుగుదల విభాగంలో కడప జిల్లా ఖాజీపేట మండలం చెమ్ముళ్లపల్లి గ్రామ పంచాయతీకి ద్వితీయ స్థానం – రూ.75లక్షల పురస్కారం.
4. 2025వ సంవత్సరానికి... స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాల విభాగంలో ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం గుండమాల గ్రామ పంచాయతీకి జాతీయస్థాయిలో తృతీయ స్థానం – రూ.50 లక్షల పురస్కారం.
5. 2025వ సంవత్సరానికి... నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తమ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్‌లో చిత్తూరు జిల్లా కుప్పం మండలం దేశవ్యాప్తంగా మూడోస్థానం – రూ.1.5కోట్ల పురస్కారం.
6. 2026వ సంవత్సరానికి... క్లైమేట్ యాక్షన్ స్పెషల్ పంచాయత్ విభాగంలో చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం కందులవారిపల్లె గ్రామ పంచాయతీకి ప్రథమస్థానం –రూ.కోటి పురస్కారం.
7. 2026వ సంవత్సరానికి... పంచాయత్ క్షమతా నిర్మాణ్ సర్వోత్తమ సంస్థాన్ పురస్కార్ విభాగంలో చిత్తూరు జిల్లా పంచాయతీ రిసోర్స్ సెంటర్ దేశంలో ప్రథమస్థానం – రూ.కోటి పురస్కారం.
8. 2026వ సంవత్సరానికి... ఆత్మనిర్భర్ పంచాయత్ స్పెషల్ అవార్డు కింద చిత్తూరు జిల్లా ఇరాల మండలం కాణిపాకం గ్రామ పంచాయతీకి ద్వితీయస్థానం – రూ.75 లక్షల పురస్కారం.

# పెట్రోలులో ఇథనాల్ మిశ్రమం పెంచాలని కోరుతూ కేంద్రానికి లేఖ

- ఏపీలోని మొక్కజొన్న రైతులకు మేలు జరుగుతుందన్న సీఎం
- కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురితో ఫోన్‌లో మాట్లాడిన సీఎం
- దిగుమతుల భారం తగ్గేలా ఇథనాల్ మిశ్రమంపై సూచనలు



అమరావతి (చైతన్య రథం): చమురు దిగుమతులపై భారం తగ్గేలా ఇథనాల్ మిశ్రమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు మరోమారు కేంద్రంతో మాట్లాడారు. ఈ వ్యవహారంపై కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురితో ముఖ్యమంత్రి శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం అమలులో ఉన్న 20 శాతం ఇథనాల్ మిశ్రమాన్ని 40 శాతానికి పెంచేలా చూడాలని కేంద్ర పెట్రోలియం మంత్రిని కోరారు. బ్రెజిల్‌లాంటి దేశాల్లో ఇథనాల్ మిశ్రమం అత్యధికస్థాయిలో ఉన్న విషయాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ఇథనాల్ మిశ్రమం పెరిగితే భారతదేశం పెట్రోలియం దిగుమతులపై ఆధారపడటం తగ్గి విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుందని సీఎం వివరించారు. ఇప్పటికే దీనిపై కేంద్రానికి లేఖ రాసినట్టు సీఎం తెలిపారు. ఇథనాల్ మిశ్రమం పెంపు నిర్ణయాన్ని వేగంగా అమలు చేయాలని సీఎం కోరారు. కేంద్రం చేపట్టే చర్యలవల్ల చమురు దిగుమతులు తగ్గి దేశ ఇంధన భద్రత పెరుగుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే ఇథనాల్ మిశ్రమం వల్ల రూ.1.1 లక్షల కోట్లమేర విదేశీ మారక ద్రవ్యం ఆదా అయ్యిందని వివరించారు. అలాగే 500 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గాయని స్పష్టం చేశారు. ఇథనాల్ తయారీవల్ల చెరకు, మొక్క జొన్న రైతులకు అదనపు ఆదాయం కూడా చేకూరుతుందని కేంద్ర మంత్రికి సీఎం తెలియచేశారు. ఇప్పటికే రైతులకు రూ.87,558 కోట్ల ఆదాయం వచ్చిందని స్పష్టం చేశారు. ఏపీలో పెద్ద మొత్తంలో ఉత్పత్తి అవుతున్న మొక్క జొన్న పంటకు కేంద్రం తీసుకునే నిర్ణయంవల్ల మేలు జరుగుతుందని అన్నారు. మొక్క జొన్న ఇథనాల్ ఉత్పత్తిలో ముఖ్యమైన ముడి వనరు కావటంతో డిమాండ్ కూడా గణనీయంగా పెరుగుతుందని వెల్లడించారు. క్వింటాలు మొక్క జొన్నకు కనీస మద్ధతు ధరగా రూ.2400ను కేంద్రం నిర్ణయించినా.. ఆ ధరకు కొనుగోలు జరగకపోవటంతో బహిరంగ మార్కెట్‌లో దీని ధర రూ.1700 నుంచి 1800కు పడిపోయిందని సీఎం వివరించారు. మొక్కజొన్న రైతుల ప్రయోజనాలు కాపాడేలా కేంద్రం త్వరితగతిన ఇథనాల్ మిశ్రమ శాతాన్ని పెంచే నిర్ణయం తీసుకోవాలని సీఎం కోరారు. ఇటీవల ఢిల్లీ పర్యటనలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాతోనూ సీఎం చంద్రబాబు ఈ అంశాన్ని ప్రస్తావించారు.

# హైబ్రిడ్ మోడ్‌లో మహానాడు!

- టీడీపీ సెంట్రల్ ఆఫీస్‌లో 27, 28 తేదీల్లో నిర్వహణ
- 'ఆయిల్ క్రైసిస్', పొదుపు చర్యల్లో భాగంగా నిర్ణయం
- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా వెల్లడి

మంగళగిరి (చైతన్య రథం): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడి ఆదేశాలు మేరకు ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్న పసుపు పండుగ మహానాడు ఈసారి హైబ్రిడ్ మోడ్‌లో జరపాలని పార్టీ నిర్ణయించినట్టు రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం, ప్రస్తుతం దేశంలో ఉన్న చమురు సంక్షోభం ప్రభావం దృష్ట్యా బాధ్యతగా వ్యవహరించాలని జాతీయ అధ్యక్షులు భావించినట్టు ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం మంగళగిరిలో ఈనెల 27, 28 తేదీల్లో హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించనున్న మహానాడులో పొలిట్ బ్యూరో సభ్యులు, స్టేట్ బాడీ సభ్యులు పాల్గొంటారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1848 క్లస్టర్ల వద్ద స్క్రీన్లు ఏర్పాటు చేస్తామని, ఒక్కో క్లస్టర్ దగ్గర సుమారు 500మంది కార్యకర్తలు వీక్షించేలా ఏర్పాట్లు ఉంటాయని పేర్కొన్నారు. మే 18, 19, 20 తేదీల్లో జరగాల్సిన మినీ మహానాడులు, 23, 24 తేదీల్లోని పార్లమెంట్ స్థాయి మహానాడులను రద్దు చేస్తున్నట్టు వెల్లడించారు. పొదుపు చర్యల్లో భాగంగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ స్వాగతించాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

చైతన్యరథం



# చరిత్రను మార్చబోతున్న ఏఎంసీఏ

- భారతదేశ రక్షణరంగ కొత్త శక్తి కేంద్రంగా పుట్టపర్తి
- నాడు కియా కార్లు.. నేడు ఫైటర్ జెట్లు.. సీఎం చలవే
- 23నెలల్లో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్' ప్రపంచానికి చూపించాం
- అభివృద్ధిలో ఉమ్మడి అనంత నెం.1 కావడం ఖాయం
- వాళ్లది ఫ్యాక్షన్... మనది ఫైటర్ జెట్... అర్ధమైందా రాజా...
- ఏఎంసీఏ ప్రాజెక్టు శంకుస్థాపనలో మంత్రి నారా లోకేష్





పుట్టపర్తి (చైతన్య రథం): "పుట్టపర్తిలో ఏర్పాటయ్యే ఏఎంసీఏ (అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్) స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్ట్ శంకుస్థాపన ఉమ్మడి అనంతపురం జిల్లా చరిత్రను మార్చబోతుంది. డిఫెన్స్ రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. ఈ అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలి"అని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. పుట్టపర్తిలో ఏఎంసీఏ ప్రాజెక్టు భూమిపూజ కార్యక్రమంలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలసి పాల్గొన్నారు. ఈసందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... భగవాన్ శ్రీ సత్యసాయిబాబా పవిత్ర భూమి ఈరోజు భారతదేశ రక్షణరంగ కొత్త శక్తి కేంద్రంగా మారుతోందని ఉద్ఘాటించారు.

## అనంతపురానికి రిటర్న్ గిఫ్ట్ ఏఎంసీఏ

"యువగళం పాదయాత్ర నుంచి చూస్తున్నాను. ఉమ్మడి అనంతపురం జోషే వేరు. ఈ జోష్ ఎప్పుడూ అదిరిపోతుంది. ఉమ్మడి అనంతపురం, గత ఎన్నికల్లో ఎన్‌డీఏకి కంచుకోట. 14 ఆఫ్ 14 సీట్లు క్లీన్ స్వీప్ చేశారు. అందుకే ఇప్పుడు మేము రిటర్న్ గిఫ్ట్ ఇస్తున్నాము. అప్పుడు కియా, ఇప్పుడు ఫైటర్ జెట్స్. కరువు నేలపై కార్లు పరిగెత్తించిన మన విజనరీ ముఖ్యమంత్రి సీబీఎన్. ఇప్పుడు అదే పుణ్యభూమిపై ఫైటర్ జెట్స్ ఎగిరేలా చేస్తున్నదీ మన ముఖ్యమంత్రి సీబీఎన్. ఈ నేలకు భగవాన్ సత్యసాయి బాబా ఆశీస్సులున్నాయి. ఎవరూ ఊహించని సమయంలో ఆయన ఇక్కడ ఎయిర్‌పోర్ట్ నిర్మించారు. ఇప్పుడు ఆయన అనుగ్రహంతో ఫైటర్ జెట్స్ తయారు చేసే పరిశ్రమలు ఇక్కడికి వచ్చాయి" అని మంత్రి లోకేష్ ప్రకటించారు.

## వాళ్ల ముగ్గురూ.. 75 ఏళ్ల కుర్రాళ్లు

ఆపరేషన్ సిందూర్‌కు ఒక ఏడాది పూర్తి అయింది. మన ప్రధాని నరేంద్ర మోదీ పాకిస్తాన్‌కు గట్టి జవాబు ఇచ్చిన ఘటన అది. దానికి ప్రతి భారతీయుడూ గర్వపడాలి. ఆపరేషన్ సిందూర్ వెనుక అతిపెద్ద శక్తి, మన ఐరన్ మ్యాన్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్. దేశంలోని అనేక రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ సర్కార్లున్నాయి. కానీ ఏపీలో మాత్రమే డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉంది. దేశం అంతా నమో అంటే నరేంద్ర మోదీజీ. ఏపీలో నమో అంటే నాయుడుజీ –మోదీజీ. ఇది ఒక పవర్‌ఫుల్ కాంబినేషన్. మోదీజీ, రాజ్ నాథ్‌సింగ్ జీ, మన నాయుడుకి –ఒక కామన్ థింగ్ ఉంది. వీరంతా 75 ఏళ్ల కుర్రాళ్ళు. వాళ్ల స్పీడ్ చూస్తే నాకు డౌట్ వస్తుంది. వాళ్లలోని ప్రతి ఒక్కరిలో ఒక 25 ఏళ్ల కుర్రాడు ఉన్నారని. ఈ ముగ్గురి స్పీడ్ తట్టుకోవడం ఎవరి వల్లా కాదు" అని లోకేష్ పేర్కొన్నారు.




## నమో జోడివల్లే రాష్ట్రానికి భారీ పెట్టుబడులు

గూగుల్ డేటా సెంటర్ రూ.1.35 లక్షల కోట్లు ఇన్వెస్ట్‌మెంట్. ఆర్సెలార్ మిట్టల్ రూ.1.35 లక్షల కోట్లు ఇన్వెస్ట్‌మెంట్. ఇప్పుడు పుట్టపర్తిలో ఫైటర్ జెట్స్ లక్ష కోట్ల పెట్టుబడులు. అమరావతి, పోలవరానికి నిధులు. విశాఖ ఉక్కుని కాపాడుకున్నాము. విశాఖ రైల్వే జోన్ తెచ్చుకున్నాం. త్వరలో కర్నూలుకు హైకోర్టు బెంచ్ రాబోతోంది. ఇవన్నీ సాధించుకున్నామంటే అది నమో జోడి (నాయుడు, మోడీజీ) వల్లే. 23 నెలల్లో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటే ఏంటో దేశానికి చూపించాం. ఆంధ్రప్రదేశ్‌ని ఇన్వెస్ట్‌మెంట్స్ డెస్టినీగా మార్చాం. ఇతర రాష్ట్రాల అభివృద్ధి చూసి మనం అసూయ పడే రోజులు పోయాయి. ఇప్పుడు ఇతర రాష్ట్రాలు మన అభివృద్ధి చూసి అసూయ పడే రోజులు వచ్చాయి" అని భావోద్వేగంగా ప్రకటించారు.

## ఏఎంసీఏతో యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు

"జువ్వలదిన్నెలో సాగర్ డిఫెన్స్, పుట్టపర్తిలో ఏఎంసీఏ, డిఫెన్స్ ఆర్ అండ్ డి ఆర్గనైజేషన్, ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ కలిసి ఏఎంసీఏ ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తున్నాయి. హిందూస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ దశాబ్దాలుగా బెంగళూరును అభివృద్ధి చేసింది. అదే తరహాలో ఏఎంసీఏ పుట్టపర్తిని అభివృద్ధి చేస్తుంది. ఇక్కడ 5వ తరం స్టెల్త్ మల్టీ–రోల్ ఫైటర్ జెట్స్ తయారు చేస్తారు. భారత్ ఫోర్జ్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, హిమాచల్ ఫ్యూచరిస్టిక్ కమ్యూనికేషన్ లిమిటెడ్, ప్రీమియర్ ఎక్స్‌ప్లోసివ్స్ లిమిటెడ్‌తోపాటు అనేక ప్రతిష్ఠాత్మక కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెడుతున్నాయి. దీనివల్ల ఈ ప్రాంత యువతకు పెద్దఎత్తున ఇక్కడ ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఇక్కడనుంచి ఇతర దేశాలకు కూడా మనం డిఫెన్స్ ఎక్విప్‌మెంట్ నుంచి ఎక్స్‌పోర్ట్ చేస్తాం. ఒక్క కియాతో ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధి చెందింది. ఇప్పుడు ఏఎంసీఏతో ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధిలో నెంబర్ 1 కావడం ఖాయం" అన్నారు.

## ఈ ప్రాజెక్టు కోసం చంద్రబాబు ప్రత్యేక కృషి

"ప్రతి పెద్ద ప్రాజెక్ట్ వెనుక ఒక కథ ఉంటుంది. ఏఎంసీఏ కథ కూడా 2025లో మొదలైంది. 5 ఫిబ్రవరి 2025న ఢిల్లీలో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ గారిని కలిశాను. ఆరోజు ఆంధ్రప్రదేశ్ విజన్ వాళ్ల ముందు పెట్టాను. ఇవీజూ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వమని అభ్యర్థించాను. ఆ తర్వాత మన సర్కార్ ఈ మిషన్‌పై నిరంతరం పనిచేస్తూనే ఉంది. మన పరిశ్రమల మంత్రి టీ .జీ. భరత్ కూడా ఈ మిషన్‌ని నిరంతరం ముందుకు తీసుకెళ్లారు. మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా ఈ ప్రాజెక్ట్ కోసం ప్రత్యేకంగా కృషిచేశారు. ఆ ప్రయత్నాల ఫలితంగానే ఇవాళ పుట్టపర్తి భారత డిఫెన్స్ మ్యాప్‌పై కొత్త గుర్తింపు పొందుతోంది. లక్ష కోట్ల కంటే ఎక్కువ ఇన్వెస్ట్‌మెంట్, వేలాది యువతకు ఉపాధి అవకాశాలు వస్తున్నాయి. ఇది కేవలం ఒక డిఫెన్స్ ప్రాజెక్ట్ కాదు...ఇది రాయలసీమ భవిష్యత్తుకు కొత్త దిశ ఇచ్చే ప్రాజెక్ట్. ఇవాళ పుట్టపర్తి కేవలం ఒక ఆధ్యాత్మిక నగరం కాదు... భారత రక్షణరంగ భవిష్యత్ కేంద్రంగా మారుతోంది" అని లోకేష్ స్పష్టం చేశారు.

## ప్రధాని మోడీజీ, రాజ్‌నాథ్‌లకు ధన్యవాదాలు

"ఆంధ్రప్రదేశ్‌కు ఇంత మహత్తరమైన రక్షణ ప్రాజెక్ట్ ఇచ్చినందుకు, మన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీజీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జీ లకు హృదయ పూర్వక ధన్యవాదాలు. ఇప్పుడు మేము హామీ ఇస్తున్నాము. ఆంధ్రప్రదేశ్ వికసిత భారత్ 2047 నిర్మాణంలో బలమైన భాగస్వామ్యం అందిస్తుంది. ఇంత దూరం వచ్చి పంచ్ లేకపోతే ఎలా... మిమ్మల్ని డిసప్పాయింట్ చేయను. వాళ్లది ఫాక్షన్ బ్యాక్‌గ్రౌండ్ –మనది ఫైటర్ జెట్ బ్యాక్‌గ్రౌండ్. వాళ్లది కిడ్నాప్ బ్యాక్‌గ్రౌండ్ –మనది కియా బ్యాక్‌గ్రౌండ్. రెండిటికీ చాలా తేడా ఉంది – అర్థమైందా రాజా!!" అంటూ యువనేత లోకేష్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చురకలంటించారు.

## భారత రక్షణ వ్యవస్థ
# ఏఎంసీఏతో బలోపేతం
### ఎక్స్ ట్వీట్‌లో సీఎం చంద్రబాబు నాయుడు

ఆంధ్రప్రదేశ్‌ను కేంద్రంగా చేసుకుని, భారతదేశ రక్షణ వ్యవస్థను బలోపేతం చేయడంలో నేడు ఒక ప్రధాన మైలురాయిగా సీఎం చంద్రబాబు అభివర్ణించారు. ఈమేరకు ఎక్స్‌లో ట్వీట్ చేస్తూ.. "రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ



అభివృద్ధి చేస్తున్న అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ కార్యక్రమ సదుపాయాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి ప్రారంభించే అవకాశం నాకు లభించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, భారతదేశం అత్యాధునిక రక్షణ సాంకేతికతలలో స్వావలంబన దిశగా వేగంగా పురోగమిస్తోంది. ఏఎంసీఏ కార్యక్రమం స్టెల్త్ వ్యవస్థలు, అధునాతన ఏవియానిక్స్ మరియు సమీకృత యుద్ధ విమానయానంలో స్వదేశీ సామర్థ్యాలను బలోపేతం చేస్తుంది. మేము ఈ ప్రాంతవ్యాప్తంగా కీలక రక్షణ ప్రాజెక్టులకు పునాది వేశాము మరియు రక్షణ, ఏరోస్పేస్ రంగాలలోని కంపెనీలతో తొమ్మిది అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశాము. తద్వారా ఆంధ్రప్రదేశ్‌ను వ్యూహాత్మక తయారీ మరియు ఆవిష్కరణలకు ఒక ప్రధాన కేంద్రంగా మరింతగా నిలబెట్టాము" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# చిరస్మరణీయుడు కాటన్
## సీఎం చంద్రబాబు నివాళి

అమరావతి (చైతన్య రథం): "గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసి, అన్నదాతకు శాశ్వత సంపద అందించిన



మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకుంటున్నా" అంటూ సీఎం చంద్రబాబు నాయుడు నివాళి అర్పించారు. ఈమేరకు ఎక్స్‌లో ట్వీట్ చేస్తూ.. "కాటన్ తన దూరదృష్టితో గోదావరి డెల్టాకు జీవం పోసి లక్షలాది రైతు కుటుంబాలకు వెలుగునిచ్చారు. అందుకే ప్రజల గుండెల్లో ఇప్పటికీ కాటన్ సజీవంగా ఉన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి, సమర్థ నీటి నిర్వహణకు కాటన్ దొరే స్ఫూర్తి" అని చంద్రబాబు పేర్కొన్నారు.

## నేడు శ్రీకాకుళం జిల్లాలో
# సీఎం చంద్రబాబు పర్యటన
### నరసన్నపేటలో 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'

అమరావతి (చైతన్య రథం): 'స్వర్ణాంధ్ర –స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో పర్యటించనున్నారు. ఉదయం 9.00 గంటలకు ఉండవల్లి క్యాంప్ ఆఫీస్‌నుంచి బయలుదేరి 10.40 గంటలకు శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం తామ్రపల్లి చేరుకుంటారు. అనంతరం సీఎం నరసన్నపేటలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక సమావేశంలో పాల్గొంటారు. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు 'స్వర్ణాంధ్ర –స్వచ్ఛాంధ్ర' కార్యక్రమానికి సీఎం హాజరుకానున్నారు. మధ్యాహ్నం 1.20 గంటలకు నరసన్నపేటలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ దగ్గర ప్రజలతో సమావేశమై స్థానిక సమస్యలు, అభివృద్ధి అంశాలపై ప్రజలతో మాట్లాడనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2.10 గంటలనుంచి 3.40 గంటల వరకు తామ్రపల్లి గ్రామంలో నిర్వహించే స్థానిక పార్టీ కేడర్ సమావేశంలో పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారు. 3.55 గంటలకు తామ్రపల్లినుంచి తిరుగు ప్రయాణమై సాయంత్రం 5.35 గంటలకు ఉండవల్లి క్యాంప్ ఆఫీసుకు చేరుకుంటారు. రాష్ట్రంలో గత 16 నెలలుగా ప్రతీ నెలా 3వ శనివారం రాష్ట్ర ప్రభుత్వం 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా పరిశుభ్రత, పర్యావరణంవంటి అంశాల్లో పురోగతి సాధించాలని ముఖ్యమంత్రి కృత నిశ్చయంతో ఉన్నారు.






పుట్టపర్తి విమానాశ్రయంలో కేంద్ర రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్‌కు స్వాగతం పలుకుతున్న సీఎం చంద్రబాబునాయుడు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్.

















పుట్టపర్తి పర్యటనలో భాగంగా ప్రశాంతి నిలయాన్ని సందర్శిస్తున్న కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. సాయి కుల్వంత్ హాలులో సత్యసాయి మహాసమాధిని సీఎం, కేంద్రమంత్రి దర్శించుకున్నారు.
















శ్రీసత్యసాయి
జిల్లా పుట్టపర్తిలో అడ్వాన్స్‌డ్
మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్టుకు
శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు నాయుడు,
రక్షణ మంత్రి రాజ్ నాథ్, మంత్రి నారా లోకేష్.
ఏఎంసీఏతోపాటు మరికొన్ని డిఫెన్స్, డ్రోన్ సిటీలోని
ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అనంతరం వేదిక వద్ద
మిస్సైల్‌లు, హ్యాండ్ గ్రేనేడ్, ఆధునిక తుపాకులు, యుద్ధ విమానం
ప్రొటోటైప్‌లాంటి రక్షణ ఉత్పత్తుల ప్రదర్శనను తిలకించిన
సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మంత్రి
లోకేష్. కార్యక్రమంలో పలువురు మంత్రులు, బీజేపీ
రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ తదితరులు
పాల్గొన్నారు.














చైతన్యరథం





శ్రీసత్యసాయి జిల్లాలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ రెండోరోజు పర్యటనలో భాగంగా పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని బాబా మహా సమాధిని దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం మంత్రి లోకేష్ ప్రశాంతి నిలయం చేరుకోగా అక్కడ ట్రస్ట్ వర్గాలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికాయి. అనంతరం సాయి కుల్వంత్ మందిరంలోని శ్రీభగవాన్ సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సత్య సాయి చేసిన సామాజిక సేవను మంత్రి లోకేష్ కొనియాడారు. ఆయనవెంట రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, సత్యసాయి జిల్లా ఇన్చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా అధ్యక్షులు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తదితరులు ఉన్నారు.







# కూటమి పాలన యువతకు స్వర్ణ యుగం

## మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

అమరావతి (చైతన్య రథం): కూటమి పాలన రాష్ట్ర యువతకు స్వర్ణ యుగంలా మారిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో మంత్రి మాట్లాడుతూ...."కూటమి పాలన రాష్ట్ర యువతకు స్వర్ణ యుగంలా మారింది. రాష్ట్రంలో యువతకు ఓవైపు పెట్టుబడులు, పరిశ్రమలతో ఉపాధి అవకాశాలు కల్పిస్తూ.. మరోవైపు ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీతో ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీచేస్తున్నాం.యూనివర్సిటీల్లో ఖాళీగావున్న 1523ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి నేడు నోటిఫికేషన్ విడుదల చేశాం.ఎన్నో ఏళ్ల నుంచి ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తున్నాం. ఏ పత్రికలు చూసిన వాటి నిండా ఉద్యోగాల ప్రకటనలే. ఏ ప్రాంతంలో చూసిన యువత ముఖాల్లో చిరునవ్వులే.

మెగా డిఎస్సీతో 16వేల టీచర్ ఉద్యోగాలు భర్తీ చేశాం. దివ్యాంగ బ్యాక్లాగ్, ఎస్సీ ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాం. ఎన్నికల్లో చెప్పిన విధంగా ఉద్యోగాలు భర్తీ చేస్తు న్నాం. ఇది యువ నాయకుడు, మంత్రి లోకేశ్ చిత్తశుద్ధి, కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం. గత 5 ఏళ్ళు జగన్ నిరుద్యోగుల్ని నమ్మించి మోసం చేశారు. నాడు జగన్ ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయకపోగా, రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలు తరిమేసి యువతను రోడ్డున పడేశారు. నేడు యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యంగా అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ స్ఫూర్తి అభినందనీయమని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

# నాలుగో విడతగా రూ.307 కోట్లు పంపిణీ

- పోలవరం నిర్వాసితులకు అండగా ఉన్నది చంద్రబాబే
- 2027లో మోదీ చేతుల మీదుగా ప్రాజెక్టు జాతికి అంకితం
- జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి


ఉండవల్లి (చైతన్య రథం): ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు నాలుగో విడతగా రూ.307 కోట్లు నిధులు నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేసినట్టు రాష్ట్ర జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా నిధులను శుక్రవారం నిర్వాసితులకు అందజేశామన్నారు. మంత్రి రామానాయుడు వివరాలను వెల్లడిస్తూ.. 2014-19తెలుగుదేశం హయాంలో 72 శాతం పూర్తయిన పోలవరం ప్రాజెక్టును జగన్ తన ఐదేళ్ల కాలంలో రివర్స్ టెండరింగ్ పేరిట విధ్వంసానికి పాల్పడ్డాడని విమర్శించారు. పోలవరం ఉనికినే ప్రశ్నార్థకం చేశాడన్నారు. రేపు మాపంటూ నాలుగు గడువులు చెప్పి పూర్తి చేయలేక చేతులెత్తేసాడు అన్నారు. పైగా అసలు పోలవరం పూర్తవుతుందో లేదో, ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితిలోకి పోలవరాన్ని నెట్టేశాడన్నారు. తెదేపా హయాంలో కేంద్ర నిధులు కోసం ఎదురు చూడకుండా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పనులు చకచకా చేసేవారమన్నారు. అందువలన అప్పుడు 72 శాతం పూర్తయిందన్నారు. ఐదేళ్ల జగన్ హయాంలో కేవలం రెండు శాతం, అది కూడా దోచుకోవడానికి వీలైన మట్టి పనులు మాత్రమే చేసి, పోలవరాన్ని మట్టికరిపించాడన్నారు. అలాగే పోలవరానికి అమూల్యమైన ఆస్తులు ఇచ్చిన నిర్వాసితులను తన హయాంలో జగన్ తీవ్ర నిర్లక్ష్యం చేశాడు అన్నారు. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనూ, నేడు కూటమి ప్రభుత్వ హయాంలోనూ నిర్వాసితులను నిండు మనసుతో ఆదుకున్న నిజమైన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాత్రమేనని రామానాయుడు చెప్పారు. 2017లో రూ.700 కోట్లు,2025 జనవరిలో రూ.800కోట్లు, 2025 అక్టోబర్లో మరో రూ.1000కోట్లు,2026 మార్చిలో 220కోట్లు,నేడు నాలుగో విడతగా రూ.307 కోట్లు ఇచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. 2027 జూన్ నాటికి ప్రధాని మోదీ చేతుల మీదుగా పోలవరం జాతికి అంకితం చేయడానికి గడువు నిర్దేశించుకుని యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేస్తున్నామన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం ఎంత ముఖ్యమో నిర్వాసితులకు పునరావాసం కల్పించడం, పరిహారం పూర్తిగా చెల్లించడం అంతే



ముఖ్యమని.. ముఖ్యమంత్రి చంద్రబాబు మాకు దిశానిర్దేశం చేశారని నిమ్మల చెప్పారు. నేడు విడుదల చేసిన రూ.307 కోట్ల నిధులు తమ తమఖాతాలకు జమవుతున్నాయని హర్షం వ్యక్తం చేస్తూ నిర్వాసితులు మెసేజ్‌లు పంపుతున్నారని రామానాయుడు చెప్పారు.

పోలవరం నిర్వాసితులు అందరూ..పరిహారం పొందటంలో ఏమైనా ఇబ్బందులుంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని, దళారులను నమ్మి మోసపోవద్దని హితవుపలికారు. 20నెలల కాలంలో మూడువిడతలుగా నిర్వాసితులకు నిధులిచ్చి, ఇప్పుడు నాలుగోవిడతగా మళ్లీ ఇస్తున్న కూటమి ప్రభుత్వ నిబద్ధతను..ప్రజలు గమనించాలన్నారు. జగన్ హయాంలో నిర్వాసితులకు ఒక పైసా ఇవ్వకపోగా.. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఖర్చు చేసిన దానికి రీయింబర్స్‌గా వచ్చిన రూ.3800 కోట్లు నిధులను జగన్ దారి మళ్ళించాడని రామానాయుడు విమర్శించారు.

# పోలవరంపై చిత్తశుద్ధి ఉంది..
# నిర్వాసితులపై అభిమానమూ ఉంది






- **నిర్వాసితుల కోసమే పోలవరం జిల్లా**
- **23నెలల్లో రూ.2,250 కోట్లు పరిహారం చెల్లించాం**
- **పోలవరం నిర్వాసితులతో భేటీలో సీఎం చంద్రబాబు**
- **సమస్యల పరిష్కారంపై నమ్మకం వచ్చింది: నిర్వాసితులు**





అమరావతి (చైతన్య రథం): పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై చిత్తుశుద్ధి ఉందని... పోలవరం నిర్వాసితులపట్ల అభిమానంతో ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. శుక్రవారం పుట్టపర్తి పర్యటన ముగించుకుని అమరావతి చేరుకున్న అనంతరం క్యాంప్ కార్యాలయంలో పోలవరం నిర్వాసితులతో సీఎం చంద్రబాబు సమావేశం అయ్యారు. పోలవరం నిర్వాసితులకు రూ.306.61 కోట్ల పరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని సీఎం చంద్రబాబు అందించారు. అలాగే పలువురు లబ్దిదారులకు ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో ఇళ్ల తాళాలను అందించారు. ఇళ్ల పట్టాల నిమిత్తం 62.05 ఎకరాలు, ల్యాండ్ టూ ల్యాండ్ కింద 520.02 ఎకరాలను గుర్తించినట్టు అధికారులు వెల్లడించారు. 23 నెలల్లో ఇప్పటికే మూడు దఫాలుగా నిర్వాసితులకు పరిహారం అందించిన సీఎం... శుక్రవారం నాలుగో విడతలో మరికొంతమంది నిర్వాసితులకు పరిహారం అందించారు. 2025 ఏడాదిలో సంక్రాంతి, దీపావళి సందర్భంగా రెండుసార్లు 2026 ఏడాదిలో ఉగాది సందర్భంగా మూడోసారి, ఇవాళ కాటన్ దొర జయంతి సందర్భంగా నాలుగో విడత పోలవరం నిర్వాసితులకు ముఖ్యమంత్రి పరిహారం అందించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 29,936 మంది నిర్వాసితులకు సుమారు రూ.2,250 కోట్ల పరిహారాన్ని పోలవరం నిర్వాసితులకు చెల్లించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."కాటన్ జయంతి రోజున పోలవరం నిర్వాసితులతో సమావేశం కావడం... ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిధులు ఇవ్వడం ఆనందంగా ఉంది. సంక్రాంతి, దీపావళి, ఉగాది ఇలా పండుగలకు పోలవరం నిర్వాసితులకు నిధులు అందిస్తున్నాం. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంమీద కమిట్మెంట్ ఉంది. నిర్వాసితులమీద అభిమానం ఉంది. ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోకూడదు. ఇబ్బందులు పడకూడదనేదే నా ఆలోచన. పోలవరం నిర్వాసితులు కోసమే పోలవరం జిల్లా ఏర్పాటు చేశాం. టెక్నాలజీ అనుసంధానం చేసి ప్రతీ కుటుంబ ఆదాయం పెంచుతాం. గిరిజన నియోజకవర్గాలైన పోలవరం, రంపచోడవరంను అన్ని విధాలా తీర్చిదిద్దుతాం. పోలవరం ప్రాజెక్టు అనుకున్న సమయానికి పూర్తవుతుంది. నిర్వాసితుల్లో ఏ ఒక్కరికీ అన్యాయం జరగదు. ప్రాజెక్టు, టౌన్‌షిప్, ఇండస్ట్రీ ఇలా ఏంవచ్చినా త్యాగం చేసేది రైతులే. వారసత్వంగా వచ్చిన భూములు పోతే బాధపడతారు. నిర్వాసితులకు అన్యాయం జరగనివ్వను. రంపచోడవరంలో బ్రహ్మాండమైన రోడ్లు నిర్మిస్తున్నాం. 2022లో వరదల సమయంలో పోలవరం ప్రాంతంలో నేను పర్యటించాను. వరద బాధితులకు కనీసం భోజనం, నీళ్లు కూడా నాటి ప్రభుత్వం ఇవ్వలేదు. విశాఖలో హుద్‌హుద్ వచ్చినప్పుడు వారంపాటు అక్కడే ఉండి పరిస్థితి చక్కదిద్దాం. 2019 కూడా తర్వాత మా ప్రభుత్వం కొనసాగి ఉంటే పోలవరం 2020కి పూర్తయ్యేది. గత ప్రభుత్వ నిర్వాకం, నిర్లక్ష్యంవల్ల డయా ఫ్రమ్ వాల్ దెబ్బతినేలా చేశారు. పోలవరం నిర్వాసితులకు పరిహారం పెంచుతామని హామీ ఇచ్చి మోసం చేశారు. గత పాలకులు అధికారులను మార్చారు. కాంట్రాక్టరును మార్చారు. ప్రాజెక్టును నాశనం చేశారు. పోలవరం ప్రాజెక్టును మళ్లీ గాడిలో పెట్టాం. 2027 పుష్కరాలకంటే ముందే ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితమిస్తాం. గోదావరి -కావేరి నదుల అనుసంధానం జరుగుతుంది. గంగా -కావేరి నదుల అనుసంధానం కావాలనేది నా కోరిక. ఇది చేస్తే దేశంలో నీటి ఎద్దడి అనేది ఉండదు" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**చంద్రబాబు సీఎం అయ్యాకే మాకు మంచి రోజులు: నిర్వాసితులు**

సీఎం చంద్రబాబు పోలవరం నిర్వాసితులతో నిర్వహించిన ముఖాముఖిలో నిర్వాసితులు తమ అభిప్రాయాలను... క్షేత్రస్థాయి పరిస్థితులను వివరించారు. గతంలో పరిహారం, ఆర్ అండ్ ఆర్ పనులు ఎలా ఉండేవి.. ఇప్పుడు ఎలా జరుగుతున్నాయనే అంశాన్ని సీఎంకు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం మీద... తమ పరిహారం మీద తాము పూర్తిగా నమ్మకాన్ని కోల్పోయామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం మీద... తమకు అందే పరిహారం మీద నమ్మకం కలిగిందని నిర్వాసితులు చెప్పారు. చంద్రబాబు సీఎం అయ్యాకే... 23 నెలల కాలంలో నాలుగు విడతలుగా పరిహారం చెల్లింపులు జరుపుతున్నారని సంతోషాన్ని వ్యక్తం చేశారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్ లో కూడా గత పాలనలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని నిర్వాసితులు వివరించారు. పోలవరం నిర్వాసితులకు డబ్బులివ్వలేనని... తాను ఏం చేయలేనని నాటి సీఎం జగన్ చెప్పడంతో తాము ఆందోళన చెందామని పోలవరం నిర్వాసితులు వివరించారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలకు గత ప్రభుత్వం రోడ్లు కూడా వేయలేదని పలువురు ముంపు గ్రామాల ప్రజలు సీఎంకు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పోలవరం నిర్వాసితులుగా తమను పట్టించుకోకపోవడమే కాకుండా... వరదల సమయంలో సర్వం కోల్పోయిన తమకు కనీసం బియ్యం పంపిణీ కూడా చేపట్టలేదంటూ నాడు జరిగిన సంఘటనలను సీఎంకు వివరించారు. కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి, జలవనరుల శాఖ అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, పోలవరం జిల్లాకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# ఓ అండ్ ఎం పనులకు రూ.708 కోట్లు

- **మూడో విడతలో రూ.397 కోట్లతో పనులు**
- **జూన్ మొదటివారంలోగా కాల్వల తవ్వకాలు పూర్తి**
- **మంత్రి నిమ్మల రామానాయుడు**



విజయవాడ (చైతన్య రథం): ఐదేళ్ల జగన్ అరాచక పాలనలో కాలువల వ్యవస్థ అస్తవ్యస్తమైపోయిందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆవేదన చెందారు. నిర్వహణ పనులు నీటికి వదిలేసారని ఆయన ధ్వజమెత్తారు. ఓఅండ్ఎం పనులు, వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతిపై ఇరిగేషన్ అధికారులతో మంత్రి నిమ్మల రామానాయుడు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మొదటి సంవత్సరంలోనే రెండు విడతలుగా ఓఅండ్ఎం పనుల కోసం రూ.708 కోట్లు కేటాయించినట్టు చెప్పారు. నేడు కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, పూడికతీతవంటి అత్యవసర, మరమ్మత్తులు పనుల కోసం రూ.397 కోట్లు కేటాయించామన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, పూడికతీతవంటి కనీస నిర్వహణ పనులు చేయలేదన్నారు. ఆ కారణంగానే అన్నదాతలకు అపార నష్టం జరిగిందన్నారు. అత్యవసర పనులు కోసం 10 లక్షలు దాటితే, కాలయాపన లేకుండా, 7 రోజుల్లోనే షార్ట్ టెండర్లు పిలిచేలా కేబినెట్ ఆమోదించిన విషయాన్ని తెలియజేశారు. మొత్తం 6,502 పనుల్లో 5,943 పనులు సుమారు 91 శాతం సాగునీటి సంఘాల ద్వారానే పనులు జరుగనున్నాయని వివరించారు. ఖరీఫ్‌నాటికి ఓఅండ్ఎం పనులు పూర్తిచేసేలా సీఈ స్థాయినుంచి కిందిస్థాయి అధికారులు వరకు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఓ అండ్ ఎం పనులకు సంబంధించి ప్రతివారం, పనుల వివరాలు, వర్క్ ప్రోగ్రెస్ రిపోర్టు అందించాలని నిమ్మల ఆదేశించారు. జలధారకు, ఓ అండ్ ఎం పనులను కూడా సమన్వయం చేసి, భూగర్భ జలాలు పెంచడానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈనెలలో జలధారపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, ముఖ్యమంత్రి చంద్రబాబు, కలెక్టర్లు, ఇరిగేషన్ అధికారుతో కాన్ఫరెన్స్ నిర్వహిస్తారన్నారు. ఈ సమీక్షలో ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శశిభూషణ్, కడా కమిషనర్ ప్రశాంతి, ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, సీఈలు, ఎస్ ఈలు, ఈఈలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చైతన్యరథం

# 50ఏళ్ల కలనెరవేర్చిన కొండపల్లి

- భోజరాజపురానికి బీటీ రహదారి ఏర్పాటు
- హామీని నెరవేర్చి నేడు రోడ్డును ప్రారంభించిన మంత్రి



విజయనగరం (చైతన్య రథం): గజపతినగరం నియోజకవర్గం దత్తిరాజేరు మండలంలో భోజరాజపురం గ్రామస్తుల దశాబ్దాల కలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నెరవేర్చారు. గత ఐదు దశాబ్దాలకు పైగా ఈ గ్రామానికి రాహదారి సౌకర్యం లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గ్రామంలో 250 మందికి పైగా జనాభా ఉంటారు. చిన్న గ్రామం కదా ? ఇక్కడ అభివృద్ధి చేస్తే ఎంత... చేయకపోతే ఎంత ? అన్న నిర్లక్ష్యంతో ఈ ప్రాంతంలో ఏళ్ల నుంచి ఎన్నికవుతున్న ప్రజాప్రతినిధులు అందరూ గ్రామంపై పూర్తిగా శీతకన్ను వేశారు. ప్రతి అసెంబ్లీ ఎన్నికలకు ఎమ్మెల్యే అభ్యర్థులు ఈ గ్రామానికి రావడం రహదారి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇవ్వడం, శంకుస్థాపన చేయడం... రహదారి కలగానే మిగిలిపోవడం ఆనవాయితీగా వస్తోంది. గత సాధారణ ఎన్నికలకు ముందు సైతం గ్రామస్తులు తమకు రహదారి సౌకర్యం ఐదు దశాబ్దాలుగా లేదంటూ.. పోలింగ్ బహిష్కరిస్తామని చెప్పి ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. చివరికి నాడు ఓ ఎమ్మెల్యే అభ్యర్థిగా కొండపల్లి సైతం తాను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పిస్తానని మాట ఇచ్చారు. నేడు ఆ మాటను నిలబెట్టుకుంటూ రు. 2 కోట్లతో ఈ రహదారి నిర్మాణం పూర్తిచేసి శుక్రవారం ప్రారంభోత్సవం చేశారు. కొండపల్లి గెలిచి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ గారు దృష్టిలో ఈ రహదారి సమస్య పెట్టడంతో పాటు పదే పదే ఫాలోప్ చేస్తూ పట్టువదలని విక్రమార్కుడిలా రహదారి నిర్మాణం పూర్తి చేశారు. రాజకీయాలకు అతీతంగా మంత్రి ఈ పని చేయడం పట్ల గ్రామంలో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. రహదారి నిర్మించిన తర్వాతే గ్రామంలో అడుగుపెడతానని శపథం చేసిన మంత్రి ఈ రోజు రహదారి ప్రారంభోత్సవానికి వెళ్లగా గ్రామస్తులు మేళతాళాలతో భారీగా స్వాగతం పలుకుతూ బ్రహ్మరథం పట్టారు. ఐదు దశాబ్దాల తమ కలను మంత్రి శ్రీనివాసుడు నెరవేర్చారని.. ఇలాంటి పట్టుదల ఉన్న నాయకుడిని ఇన్నేళ్లలో తాము ఎప్పుడూ చూడలేదంటూ గ్రామస్తులు ప్రశంసలు కురిపించారు. 50 ఏళ్లుగా రహదారి లేక గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులు, ఆవేదన చూశాకే ఈ గ్రామానికి రహదారి నిర్మించాలని నిర్ణయించుకున్నానని.. ఈ రోజు ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుని భోజరాజపురానికి రోడ్డు వేయించడం సంతృప్తిగా ఉందని మంత్రి కొండపల్లి తెలిపారు.

# కాటన్ ఆశయాలతో ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి

- లైడార్ సర్వే ఆధారంగా డెల్టా ప్రక్షాళనకు డీపీఆర్ సిద్ధం చేస్తున్నాం
- ఈఏడాది కాలువల్లో పూడికతీత పనులకు రూ.397 కోట్లు
- సర్ ఆర్థర్ కాటన్ జయంతి వేడుకల్లో మంత్రి నిమ్మల



విజయవాడ (చైతన్య రథం): కాటన్ మహాశయుడి ఆశయాలతో రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం విజయవాడ జలవనరుల మంత్రి క్యాంపు కార్యాలయంలో సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు. ఆంగ్లేయుడైనా కాటన్ ముందుచూపుతో ధవళేశ్వరం, కృష్ణా బ్యారేజీలతోపాటు ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో కాలువల నిర్మాణాలు చేసిన మహానుభావుడని కొనియాడారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో పోలవరం ప్రాజెక్టుతోపాటు ఇరిగేషన్ శాఖ, విధ్వంశంతో కాటన్ ఆత్మసైతం క్షోభించిందని అన్నారు. విధ్వంశానికి గురైన పోలవరం ప్రాజెక్టుతోపాటు, ఇరిగేషన్ రంగాన్ని చంద్రబాబు గాడిలో పెట్టారని, గోదావరి నదిపై కాటన్ ధవళేశ్వరం బ్యారేజి తరువాత మళ్లీ చంద్రబాబు సారథ్యంలోనే పోలవరం నిర్మాణం అవుతుందని తెలిపారు. కాటన్ స్ఫూర్తితో ధవళేశ్వరం బ్యారేజ్‌కు 117 కొత్త గేట్ల ఏర్పాటుకు రూ.150.09 కోట్లు కేటాయించామని, త్వరలోనే పనులు చేపట్టి గేట్ల అమరిక పూర్తి చేస్తామని తెలిపారు. గోదావరి డెల్టా ప్రక్షాళనకు 14 కోట్లతో లైడార్ సర్వే పూర్తి చేయగా, ఆ సర్వే ఆధారంగా డీపీఆర్ తయారు చేస్తున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు సకాలంలో సాగు నీరు కూడా అందించలేదని, వేల కోట్లు పెట్టి నిర్మించిన ప్రాజెక్టులకు, వార్షిక నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయని, కూటమి ప్రభుత్వం వచ్చిన తొలి ఏడాదిలోనే రూ.790 కోట్లు కేటాయించి కాలువలు, డ్రైన్లలో తూడు, గుర్రపుడెక్క, పూడికతీత వంటి పనులు పూర్తి చేశామని స్పష్టం చేశారు. రానున్న ఖరీఫ్ సీజన్‌కు కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, పూడిక తొలగింపు పనుల కోసం రూ.397 కోట్లు కేటాయించి పనులు చేస్తున్నామన్నారు.

# 'ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్' పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

- ఉపాధి, శిక్షణ శాఖ సంచాలకులు జి గణేష్ కుమార్

విజయవాడ (చైతన్య రథం): ఈ ఏడాది జూలై 2026లో జరగనున్న ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్ పరీక్షలకు అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు రాష్ట్ర ఉపాధి, శిక్షణ శాఖ సంచాలకులు గణేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ వొకేషనల్ ట్రైనింగ్ పరిధిలోని క్రాఫ్ట్స్‌మెన్ ట్రైనింగ్ స్కీమ్ కింద, జూలై 2026 యాన్యువల్ సిస్టమ్ ద్వారా నిర్వహించే ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్ కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నామన్నారు.

2024-26 బ్యాచ్‌లో రెండేళ్ల కోర్సులో రెండో సంవత్సర విద్యార్థులు, 2025-27 బ్యాచ్‌లో రెండేళ్ల కోర్సులో మొదటి సంవత్సర విద్యార్థులు, 2025-26 బ్యాచ్‌లో ఏడాది కోర్సు మరియు ఆరు నెలల కోర్సు బ్యాచ్‌లకు చెందిన అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకావచ్చునన్నారు. రెగ్యులర్ విద్యార్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ.100/- చెల్లించవలసి ఉంటుందని అన్నారు. విద్యార్థులు తమ సంబంధిత ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఐటిఐ ప్రిన్సిపాళ్లకు నగదు రూపంలో ఫీజు చెల్లించి రశీదు పొందవలసి ఉంటుందన్నారు. జరిమానా లేకుండా ఫీజు చెల్లించడానికి చివరి తేదీ 15.06.2026గా పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను, ఫీజు రశీదుతో కలిపి నిర్ణీత గడువులోగా సంబంధిత ఐటిఐ కార్యాలయాల్లో సమర్పించాలని సూచించారు. ఒకసారి చెల్లించిన ఫీజు తిరిగి ఇవ్వబడదని రాష్ట్ర ఉపాధి మరియు శిక్షణ శాఖ సంచాలకులు జి. గణేష్ కుమార్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మహానాడును ప్రజలకు చేరువ చేయాలనే..

## చంద్రబాబు నిర్ణయం వినూత్నం.. అభినందనీయం

వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి (చైతన్య రథం): తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడు కార్యక్రమాన్ని ఈసారి వర్చువల్ విధానంలో నిర్వహించాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయం దూరదృష్టికి నిదర్శనమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ప్రజాధనం, పార్టీ వనరుల వినియోగంలో పొదుపు పాటిస్తూ, సాంకేతికతను సమర్థంగా వినియోగించాలనే సీఎం చంద్రబాబు ఆలోచన ప్రతి కార్యకర్తకు ఆదర్శమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,845 క్లస్టర్లలో స్క్రీన్లు ఏర్పాటు చేసి ప్రతి కార్యకర్త మహానాడులో భాగస్వామి అయ్యేలా చర్యలు తీసుకోవడం పార్టీ చరిత్రలో కొత్త అధ్యాయమన్నారు. ఎన్టీఆర్ భవన్ కేంద్రంగా రాష్ట్ర నాయకత్వం, పొలిట్‌బ్యూరో సభ్యులు పాల్గొనే విధంగా రూపొందించిన ఈ వ్యవస్థ పార్టీని మరింత బలోపేతం చేస్తుందన్నారు. పార్టీని కాలానుగుణంగా ఆధునీకరించడంలో తెదేపా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ కీలక పాత్ర పోషిస్తున్నారని మంత్రి కొనియాడారు. యువత, టెక్నాలజీ, పార్టీ వ్యవస్థలను సమన్వయం చేస్తూ మహానాడును డిజిటల్ స్థాయిలో విజయవంతం చేయడానికి లోకేష్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈనెల 27, 28 తేదీల్లో జరిగే మహానాడు కార్యక్రమం తెలుగుదేశం పార్టీకి కొత్త ఉత్సాహాన్ని నింపడంతోపాటు, రాష్ట్ర ప్రజలకు పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి దిశను మరింత స్పష్టంగా తెలియజేస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## సీఎస్ సాయిప్రసాద్ పదవీ కాలం నవంబరు 30 వరకు పొడిగింపు



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్ పదవీకాలాన్ని కేంద్ర ప్రభుత్వం మరో ఆరు మాసాలు అంటే జూన్ 1నుండి నవంబరు 30వరకు పొడిగించింది. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు కేంద్ర ప్రభుత్వం ఇందుకు ఆమోదం తెలిపింది. ఈమేరకు ఆల్ ఇండియా సర్వీసెస్ రూల్ 16(1) (డీసీఆర్‌బీ) రూల్స్ 1958కు అనుగుణంగా సిఎస్ సాయిప్రసాద్ పదవీ కాలాన్ని ఆరు మాసాలకు పొడిగిస్తూ కేంద్ర డిపార్టుమెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డిఓపిటి) మంత్రిత్వ శాఖ అండర్ సెక్రటరి రాజేశ్‌కుమార్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ (పొలిటికల్) ముఖ్య కార్యదర్శికి లేఖ ద్వారా తెలియజేశారు. ప్రస్తుతం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్న సాయిప్రసాద్ వాస్తవానికి ఈనెలాఖరున పదవీ విరమణ చేయాల్సి ఉండగా ఆయన సేవలను మరికొంత కాలం వినియో గించుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సిఎస్ పదవీ కాలాన్ని పొడిగించాల్సిందిగా కేంద్రానికి ప్రతిపాదనలు పంపగా ఆమేరకు కేంద్ర ప్రభుత్వం సాయిప్రసాద్ పదవీ కాలాన్ని ఆరు మాసాలు అనగా జూన్ 1నుండి నవంబరు 30వ తేదీ వరకూ పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# ఎక్సైజ్ విధానంలో పారదర్శకత

- ఎక్సైజ్ శాఖలో వినూత్న మార్పులకు శ్రీకారం
- ప్రజల ఆరోగ్యానికీ పెద్దపీట... పెరిగిన ఆదాయం
- మద్యం నాణ్యతపై ల్యాబుల్లో పెద్దఎత్తున పరీక్షలు
- ట్రాక్ అండ్ ట్రేస్, ఎక్సైజ్ సురక్ష యాప్‌లతో పారదర్శకత
- అవినీతికి తావులేకుండా కలెక్టర్ల ఆధ్వర్యంలో షాపుల కేటాయింపు
- ఎన్నికల హామీ మేరకు కల్లుగీత కార్మికులకు 10శాతం షాపులు
- 23 నెలల పాలనలో ఎక్సైజ్ శాఖలో విప్లవాత్మక మార్పులు
- ఎక్సైజ్ శాఖను పూర్తిగా గాడిలో పెట్టిన సీఎం చంద్రబాబు





అమరావతి (చైతన్య రథం): రెండేళ్ల క్రితం ఏపీలో మద్యం అంటే భయం... అనుమానం... అసంతృప్తి.... దోపిడీ. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. అదే ఎక్సైజ్ శాఖలో పారదర్శకత, నాణ్యత, టెక్నాలజీకి పెద్దపీట వేస్తూ... ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ అనేక సంస్కరణలతో ఎక్సైజ్ శాఖ గాడిలో పడింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన వెంటనే సంస్కరణలు తీసుకురావాలని భావించిన శాఖల్లో ఎక్సైజ్ శాఖ ప్రధానంగా ఉంది. దీంతో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎక్సైజ్ శాఖ ప్రక్షాళనపై సీఎం చంద్రబాబు ఫోకస్ పెట్టారు. ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. ఆ దిశగా ప్రభుత్వం, ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకుంది. ఎస్ఈబిని రద్దు చేసి ఎక్సైజ్ శాఖ మొత్తాన్ని ఏకీకృతం చేసింది. ఎక్సైజ్ శాఖలో చోటుచేసుకున్న మద్యం కుంభకోణంపై శ్వేతపత్రాన్ని ముఖ్యమంత్రి విడుదల చేశారు. గతంలో అమలు చేసిన ఆన్ లైన్ ఆర్డర్ ఫర్ సప్లై విధానాన్ని ఎక్సైజ్ శాఖ తీసుకొచ్చింది. ఐజీస్థాయి అధికారి ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేసి అక్రమాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశాలిచ్చింది. నూతన మద్యం పాలసీ (2024-2026) ప్రకటించి లాటరీ ద్వారా ప్రైవేటు వ్యక్తులకు మద్యం షాపులు కేటాయించారు. పారదర్శకమైన విధానాల ఫలితంగా దాదాపు 90 వేల దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల రూపంలో ప్రభుత్వానికి రూ.1800 కోట్ల ఆదాయం సమకూరింది. 10 శాతం మేర షాపులు అంటే... 354 దుకాణాలను కల్లుగీత కార్మికులకు కేటాయించారు. గత ప్రభుత్వ హయాంలో ఏఆర్ఈటీ పేరుతో ప్రజలపై భారం మోపారు. ఆ భారాన్ని తగ్గిస్తూ ఏఆర్ఈటీని ప్రభుత్వం రద్దు చేసింది. గతంలో మద్యం షాపుల్లో డిజిటల్ లావాదేవీలు 0.6 శాతం మాత్రమే ఉంటే ప్రస్తుతం 45శాతానికి చేర్చడం ద్వారా పారదర్శకతకు అత్యధిక ప్రాధాన్యమిచ్చింది ఎక్సైజ్ శాఖ.

### అందుబాటులోకి ప్రీమియం బ్రాండ్లు..

అన్ని బ్రాండ్లకు పారదర్శకంగా అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా టెండర్ కమిటీ ఏర్పాటు చేశారు. ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి ఎక్సైజ్ శాఖ అవకాశం కల్పిస్తోంది. అంతర్జాతీయ బ్రాండ్లను కూడా అందుబాటులోకి తెచ్చే లక్షంతో రాష్ట్ర వ్యాప్తంగా 11 ప్రీమియం స్టోర్‌లను ఏర్పాటు చేసింది ఎక్సైజ్ శాఖ. నాటు సారా, కల్తీ మద్యం వైపు ఎవరూ వెళ్లకుండా చేయడం లక్ష్యంగా రూ.99 బ్రాండ్ అందుబాటులోకి వచ్చింది. కూటమి ప్రభుత్వ హయాంలో పారదర్శకమైన విధానం అమలు చేయడం, జాతీయ, అంతర్జాతీయ, ప్రీమియం బ్రాండ్లు అందుబాటులోకి తీసుకురావడం, పొరుగు రాష్ట్రాలతో సమానంగా ధరలు ఉండడంతో అక్రమ రవాణా దాదాపు నిలిచిపోయిందనే చెప్పాలి. ఫలితంగా 2024-25లో రూ.28,846 కోట్లు, 2025-26లో రూ.29,042 కోట్ల మేర ఎక్సైజ్ రెవెన్యూ వచ్చింది. మద్యం షాపుల నుండి బార్‌లకు మద్యం అక్రమ రవాణా నివారించేలా బార్‌లలో కూడా ఎమ్మార్పీ విధానాన్ని అవలంభించేలా చర్యలు తీసుకుంది కూటమి ప్రభుత్వం. డిస్టిలరీల నుంచి షాపుల వరకు ప్రతి మద్యం బాటిల్ ట్రాక్ అండ్ ట్రేస్ విధానంలో పర్యవేక్షించేలా ఎక్సైజ్ శాఖ జాగ్రత్తలు తీసుకుంది.

### 13 రకాల పరీక్షలు... 30 వేల శాంపిళ్ల టెస్టులు

ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి మద్యం బ్యాచ్‌ను 13 రకాలైన పరీక్షలు నిర్వహించిన అనంతరమే మార్కెట్లోకి వెళ్లేలా ఎక్సైజ్ అధికారులు చర్యలు చేపట్టారు. అందుకోసం విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, చిత్తూరు, కర్నూలులో అత్యాధునిక ల్యాబరేటరీలను ఏర్పాటు చేసింది ప్రభుత్వం. గతంలో ఏటా సగటున 14 వేల పరీక్షలు మాత్రమే నిర్వహిస్తే, ప్రస్తుతం ప్రతి నెల సగటున 30 వేల పరీక్షలు చేస్తూ నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకుంటోంది. గంజాయి నిర్మూలన కోసం ఈగిల్ టీమ్స్ ఏర్పాటు చేయడం... మద్యం ఆదాయంలో 2 శాతం బడ్జెట్ ఈగిల్ వ్యవస్థకు కేటాయించడం వంటి చర్యలు ఎక్సైజ్ శాఖ చేపడుతోంది. ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం వినియోగ దారులు ఎవరైనా, ఎక్కడైనా బాటిళ్లను స్కాన్ చేసే అవకాశం కల్పించారు. మద్యం బాటిళ్ల తయారీ నుంచి షాపుకు వచ్చే వరకు ప్రతి సమాచారం తెలుసుకునే వెసులుబాటును ఎక్సైజ్ శాఖ కల్పించింది. ఎక్సైజ్ ఐ యాప్ ద్వారా మద్యం షాపుల్లోని సీసీ కెమెరాలన్నింటినీ అనుసంధానించి ఏ షాపును ఎప్పుడు తెరుస్తున్నారు, ఎప్పుడు మూస్తున్నారోననే అంశంపై నిరంతరం మానిటర్ చేస్తున్నారు.

### ఎక్సైజ్ వ్యవస్థను హైజాక్ చేసిన నాటి ప్రభుత్వం

రాష్ట్రంలో దశలవారీగా సంపూర్ణ మద్య నిషేధాన్ని అమలు చేస్తామని... మద్యం విక్రయాలను కేవలం ఫైవ్ స్టార్ హోటళ్లకు మాత్రమే పరిమితం చేస్తామని 2019 ఎన్నికలకు ముందు జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక మద్యం నిర్మూలన కాదు నియంత్రణ అన్నారు. తర్వాత ప్రభుత్వ మద్యం షాపులు అన్నారు. అప్పటి వరకు ఉన్న మద్యం బ్రాండ్లను నాటి ప్రభుత్వ పెద్దల సూచనల మేరకు తొలగించారు. ప్రపంచంలో ఎక్కడా లేని, ఎప్పుడూ కనీ వినీ ఎరుగని బూం బూం, ప్రెసిడెంట్ మెడల్ లాంటి బ్రాండ్లు తీసుకొచ్చారు. వినియోగదారుడు తనకు నచ్చిన బ్రాండ్ కాకుండా.. తాము అమ్మే బ్రాండ్ తాగాల్సిందే అనే పరిస్థితి తీసుకొచ్చి ఎక్సైజ్ వ్యవస్థ మొత్తాన్ని నాటి ప్రభుత్వ పెద్దలు హైజాక్ చేశారు. కల్తీ, నకిలీ మద్యాన్ని ప్రభుత్వ షాపుల్లోనే అమ్మారు. చిన్న బడ్డీ కొట్టులో డిజిటల్ పేమెంట్ అందుబాటులో ఉన్న ఈ రోజుల్లో కూడా ఏ మద్యం షాపులోనూ డిజిటల్ లావాదేవీలను గత ప్రభుత్వం జరగనివ్వలేదు. గత ప్రభుత్వ హయాంలో 99.38 శాతం లావాదేవీలు క్యాష్ అండ్ క్యారీ విధానంలోనే జరిగాయని లెక్కలు చెబుతున్నాయి. నాడు నాణ్యమైన మద్యం అందుబాటులో లేకపోవడం, ధరలు భారీగా ఉండడంతో తమిళనాడు, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల నుంచి అక్రమ రవాణా అడ్డగోలుగా పెరిగింది. మద్యం అక్రమాలను ఎవరూ అడ్డుకోవడానికి వీల్లేదు అన్నట్లు ఎక్సైజ్ శాఖను విడగొట్టి సరైన నిఘా లేకుండా చేశారు. ఒక్కో మద్యం బ్రాండు సరఫరాపై కేసుకు అనధికారికంగా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలున్నాయి. మద్యం తయారీ సంస్థల నుంచి, బీర్ తయారీ కంపెనీల నుంచి కోట్లాది రూపాయలు దోచుకున్నారని దర్యాప్తు సంస్థలు సైతం నిర్ధారించిన పరిస్థితి. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం 76% మంది మహిళలు మానసిక, శారీరక, లైంగిక వేధింపులకు గురయ్యారు. 2019తో పోలిస్తే 2023 నాటికి 52 శాతం లివర్ సమస్యలు, 54 శాతం కిడ్నీ సమస్యలు పెరిగాయి. గుంటూరు జీజీహెచ్‌లో ఉండే డీ అడిక్షన్ కేంద్రంలో 2019 నాటికి 343 కేసులు ఉంటే.. 2023 నాటికి ఏకంగా 4913కి పెరిగారు. ఇలాంటి పరిస్థితులకు చెక్ చెప్పేలా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంది. ప్రజారోగ్య రక్షణకు పెద్ద పీట వేసింది.

### ఎక్సైజ్‌లో విప్లవాత్మక మార్పులు ..: మంత్రి కొల్లు రవీంద్ర

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రెండేళ్ల కాలంలో ఎక్సైజ్ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఎక్సైజ్ శాఖ అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని వివరించారు. ప్రజలకు నాణ్యమైన మద్యం అందించే లక్ష్యంతో పారదర్శకంగా వ్యవహరిస్తున్నామన్నారు. గతంలో కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని... కానీ నేడు ప్రతి డిస్టిలరీలో తయారయ్యే మద్యాన్ని జుచీూ నుంచి డిస్టిలింగ్, బాటిలింగ్ వంటి పలు దశల్లో పరీక్షించడమే కాకుండా.. మద్యం షాపులు, బార్లలో కూడా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే బ్రాండ్ మిక్సింగ్ వంటి ఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి చెప్పారు. గత ప్రభుత్వంలో డిజిటల్ లావాదేవీలు 1శాతం మేర కూడా లేదని... కానీ నేడు 40 శాతానికి పైగా డిటిటల్ లావాదేవీలు నిర్వహిస్తుండమనేది ప్రభుత్వ, ఎక్సైజ్ శాఖ పారదర్శకతకు నిదర్శనమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.

# మచిలీపట్నం నగర సమగ్ర అభివృద్ధి, సుందరీకరణే ధ్యేయంగా పని చేయాలి

**- నగర అభివృద్ధిపై అధికారులతో సమీక్షలో మంత్రి కొల్లు**

మచిలీపట్నం (చైతన్య రథం): మచిలీపట్నం నగర సమగ్ర అభివృద్ధి, సుందరీకరణే ధ్యేయంగా పని చేయాలని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. రాష్ట్ర మంత్రి శుక్రవారం మధ్యాహ్నం మచిలీపట్నం నగరంలోని రహదారులు భవనాలు శాఖ అతిథి గృహంలో జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్‌తో కలిసి నగర అభివృద్ధిపై పలు శాఖల అధికారులతో సమీక్షించారు. సమావేశంలో మచిలీపట్నం నగర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై మంత్రి అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా నగరంలోని డంపింగ్ యార్డ్ నుంచి చెత్త తరలింపు పనుల పురోగతి, నగర పారిశుధ్య నిర్వహణ, రహదారుల అనుసంధానం అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ విస్తరణ, మురుగు నీటి సమస్యల పరిష్కారం, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నగర ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. మచిలీపట్నం వంటి చారిత్రక ప్రాధాన్యత కలిగిన నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. నగరంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువుల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నగరంలో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుధ్య నిర్వహణపై మంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించారు. డంపింగ్ యార్డ్ నుండి పేరుకుపోయిన చెత్తను తరలించే ప్రక్రియ ఏ మేరకు పురోగతిలో ఉందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా చెత్త నిల్వలు లేకుండా త్వరితగతిన తరలింపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, చెత్త సేకరణ, తరలింపు ప్రక్రియను మరింత సమర్ధవంతంగా నిర్వహించాలని సూచించారు. అలాగే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ పనులను వేగవంతం చేసి నీటి నిల్వ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మచిలీపట్నం నగర సుందరీకరణకు అవసరమైన ప్రతి చర్యను ప్రభుత్వం చేపడుతోందని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో నగర కమిషనర్ బాపిరాజు, సహాయ కమిషనర్ గోపాలరావు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆర్డి సుబ్బారావు, బందరు ఆర్టీవో కే సాంబశివరావు, తహసిల్దార్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమం కూటమి లక్ష్యం

- **ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టీకరణ**
- **ప్రజా దర్బార్‌లో అర్జీలు స్వీకరించిన మంత్రి**



మచిలీపట్నం (చైతన్య రథం): రాష్ట్ర అభివృద్ధి, పరిశ్రమల విస్తరణ, ఉద్యోగాల కల్పన, ప్రజా సంక్షేమం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బృందావన థియేటర్ పక్కన గల టీడీపీ కార్యాలయంలో మంత్రి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను ఓపిగ్గా ఆలకించిన ఆయన వారి సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకుడు నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, రాబోయే కాలంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తూ పరిశ్రమలు, మౌలిక వసతుల నిర్మాణం వేగంగా కొనసాగుతోందన్నారు. ఉత్తరాంధ్రలో పోర్టులు, హైవేలు, కొత్త ఎయిర్‌పోర్టులు అభివృద్ధి చెందుతున్నాయని, ఇటీవల ఆర్సెలర్ మిట్టల్, గూగుల్ డేటా సెంటర్స్, రేర్ ఎర్త్ మినరల్స్‌కు సంబంధించిన ప్రాజెక్టులు అక్కడికి రానున్నాయని చెప్పారు. అలాగే ఈస్ట్ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి చెందిన ప్రాజెక్టులు రాబోతున్నాయని వెల్లడించారు.

అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దేందుకు పనులు వేగంగా సాగుతున్నాయని, క్వాంటం కంప్యూటింగ్ రంగంలో కూడా కీలక ప్రణాళికలు అమలవుతున్నాయని తెలిపారు. ప్రకాశం జిల్లాలో కంప్రెస్డ్ గ్యాస్ పరిశ్రమలు, రాయలసీమలో హార్టికల్చర్, ఆటోమొబైల్ రంగాల్లో పెట్టుబడులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. కియా, అపోలో టైర్స్ వంటి సంస్థలు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతున్నాయని అన్నారు. పుట్టపర్తిలో లక్ష కోట్ల పెట్టుబడులతో యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టుకు భూమిపూజ జరగడం రాష్ట్రానికి గర్వకారణమని, కేవలం 15 రోజుల్లో అనుమతులు మంజూరు కావడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని తెలిపారు. అలాగే శ్రీ సిటీ, నెల్లూరు పరిసర ప్రాంతాలు, గన్నవరం, మల్లవల్లి ప్రాంతాల్లో కూడా పరిశ్రమలు వేగంగా ఏర్పాటవుతున్నాయని చెప్పారు.

మచిలీపట్నం పోర్టు, ఫిషింగ్ హార్బర్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, పామర్రు, గుడివాడలో ఎంఎస్ఎంఈ పార్కులకు భూముల కేటాయింపులు జరుగుతున్నాయని తెలిపారు. మచిలీపట్నం–రేపల్లె రైల్వే మార్గం ప్రాజెక్టు విషయమై మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా మ్యాప్ పరిశీలించి ప్రాజెక్టుపై చొరవ చూపారని గుర్తు చేశారు. సుమారు రూ.2800 కోట్ల వ్యయంతో తొలి దశలో రేపల్లె వరకు ట్రాక్ ప్రతిపాదన ముందుకు సాగుతుండటం ఆనందదాయకమన్నారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి కానుందని తెలిపారు. ఈ రైల్వే లైన్ మచిలీపట్నం, అవనిగడ్డ, రేపల్లె ప్రాంతాల అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. భవిష్యత్తులో దీనిని బాపట్ల, గుంటూరు మీదుగా హైదరాబాద్ వరకు విస్తరించే ప్రతిపాదనలు ఉన్నాయని వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ వాతావరణం, ఆర్థిక అనిశ్చితి దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మంత్రి కోరారు. విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. దేశ భద్రత, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రజలు పొదుపు చర్యలు పాటించాలని మంత్రి సూచించారు. పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించి సైకిళ్లు, ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగించాలని కోరారు. వంటనూనెల వినియోగాన్ని తగ్గించడంతో పాటు ఎలక్ట్రిక్ స్టౌలు, కుక్కర్లు వాడాలని సూచించారు. బంగారం కొనుగోళ్లలో కూడా నియంత్రణ పాటించాలని అన్నారు. ప్రతి ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. సోలార్ వినియోగం పెరిగితే విద్యుత్ ఖర్చులు తగ్గడంతో పాటు థర్మల్ స్టేషన్లపై ఒత్తిడి కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. "నా దేశం –నా భద్రత" భావనతో ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, సహాయ కమిషనర్ గోపాలరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ, కూటమి నాయకులు లోగిశెట్టి వెంకటస్వామి, ఇలియాజ్ పాషా, తలారి సోమశేఖర్, కె సుశీల, సుబ్రహ్మణ్యం, పలు మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## అచ్చ ప్రాజెక్టుతో అంగన్వాడీల్లో

# విద్యా విప్లవానికి శ్రీకారం

- **అంగన్వాడీ కార్యకర్తలే ప్రభుత్వ పథకాల అసలైన మూలస్తంభాలు**
- **తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడపాల్సిన ఆవశ్యకత ఉంది**
- **స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వంతో సమన్వయంగా పనిచేయాలి**
- **మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సూర్య కుమారి**




విజయవాడ (చైతన్య రథం): ఆంధ్రలో చిన్నారుల చదువులు (అచ్చ) ప్రాజెక్టుతో అంగన్వాడీ కేంద్రాల్లో విద్యా విప్లవానికి నాంది పలుకుతుందని మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఏ సూర్య కుమారి తెలిపారు. స్థానిక ఇరిగేషన్ కాంపౌండ్ కార్యాలయంలోని ఫార్మర్స్ ట్రైనింగ్ సెంటర్‌లో అచ్చ (ఆంధ్రాలో చిన్నారుల చదువులు) ప్రాజెక్ట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఏ. సూర్య కుమారి లాంఛనంగా పథకాన్ని శు క్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఏ. సూర్యకుమారి మాట్లాడుతూ... అంగన్వాడీ కార్యకర్తల సేవలను అభినందిస్తూ, వారి సవాళ్లను, భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు. రాష్ట్రంలో ఏ పథకం అమలు కావాలన్నా, చిట్టచివరి లబ్ధిదారునికి చేరడంలో అంగన్వాడీ కార్యకర్తలే ప్రధాన భూమిక పోషిస్తారని ఆమె కొనియాడారు. ఒక రోజు అంగన్వాడీ కార్యకర్తగా నేను అని చెపుతూ... సెక్రటరీ హోదాను పక్కన పెట్టి, ఒక రోజు అంగన్వాడీ కార్యకర్త ఎదుర్కొనే రోజువారీ కష్టాలను (పిల్లలను తీసుకురావడం, వంట చేయడం, డేటా అప్‌లోడ్ చేయడం, తల్లిదండ్రులను ఒప్పించడం) ఆమె కళ్ళకు కట్టినట్లు వివరించారు. మారుతున్న సామాజిక దృక్పథం... గతంలో ఆసుపత్రి ప్రసవాలపట్ల ఉన్న భయాందోళనలు ఇప్పుడు పోయి, నూరు శాతం ఆసుపత్రి ప్రసవాలు జరుగుతున్నాయని, అదేవిధంగా అంగన్వాడీలపట్ల కూడా నమ్మకం పెరగాలని ఆకాంక్షించారు.

అంగన్వాడీ సెంటర్లో అక్కడక్కడా మౌలిక సదుపాయాల కొరత (టాయిలెట్లు, తాగునీరు) ఉన్నప్పటికీ మెరుగైన సేవలు అందిస్తున్నారని తెలిపారు. సుమారు 11-12 లక్షల మంది పిల్లలు రావాల్సి ఉండగా, ప్రస్తుతం 8-8.5 లక్షల మందే అంగన్వాడీ కేంద్రాలకు వస్తున్నారని, ఈ సంఖ్య క్రమేపీ పెరగాలని పేర్కొన్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు (సృజన ఫౌండేషన్, క్రిస్ప్ ఫౌండేషన్) విడివిడిగా కాకుండా, ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ఒకే రకమైన శిక్షణను అందించాలని సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లల ఎదుగుదలలో భాగస్వాములు కావాలని, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంటూ పిల్లలతో సమయం గడపాలని, అది వారి బాధ్యత అని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో ఇండక్షన్ స్టవ్‌ల పంపిణీ వంటి చర్యల ద్వారా అంగన్వాడీ ల పనిభారం తగ్గుతుందని, హెల్పర్లను కూడా విద్యాబోధనలో భాగస్వాములను చేయాలని సూచించారు. అంగన్వాడీ కార్యకర్తలు కేవలం ఐసీడీఎస్ కే పరిమితం కాకుండా ఆశా, ఏఎన్ఎం, గ్రామ సర్పంచ్‌లతో కలిసి పనిచేసి బెస్ట్ అంగన్వాడీగా నిలవాలని ముఖ్య కార్యదర్శి సూర్యకుమారి పిలుపునిచ్చారు.

జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ.... అంగన్వాడీ చిన్నారుల కోసం కార్యక్రమాన్ని తీసుకువచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలోని రెండు ఆస్పిరేషన్ బ్లాక్స్ (పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం) మినహాయించి, మిగతా చోట్ల అంగన్వాడీల పనితీరులో గణనీయమైన మార్పు కనిపిస్తోందని చెప్పారు. నీతి ఆయోగ్ సహకారంతో వెనుకబడిన బ్లాక్స్‌లో కూడా అభివృద్ధి సాధిస్తామని, చిన్నారులు మంచి పౌరులుగా ఎదిగేలా తమ టీం మొత్తం కృషి చేస్తుందని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుకు సహకరిస్తున్న గేట్స్ ఫౌండేషన్, సుజన ఫౌండేషన్ మరియు ఇతర భాగస్వాములకు జిల్లా కలెక్టర్ డా లక్షిశా కృతజ్ఞతలు తెలియజేశారు.

మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.... "రాష్ట్రవ్యాప్తంగా 55,746 అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం, ముందస్తు బాల్య విద్య వంటి సేవలు అందుతున్నాయన్నారు. 1975లో ఐసిడిఎస్ ప్రారంభమైనప్పుడు కేవలం పోషకాహారం అందించడమే లక్ష్యంగా ఉండేదని, ముఖ్యంగా రక్తహీనత ఉన్న మహిళలకు, పోషకాహార లోపం ఉన్న పిల్లలకు ప్రాధాన్యత ఇచ్చేవారన్నారు. చిన్నారుల్లో 6 ఏళ్ల లోపు 85శాతం మెదడు అభివృద్ధి చెందుతుందని అధ్యయనాలు చెబుతున్నాయన్నారు. అందుకే శారీరక, మానసిక ఎదుగుదలకు ఈ వయస్సు చాలా కీలకమని ప్రభుత్వం గుర్తించిందన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు అంగన్వాడీల ద్వారా అర్లీ చైల్డ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్‌ను బలోపేతం చేస్తున్నామన్నారు. 'అచ్చ' (ఆంధ్రాలో చిన్నారుల చదువు) ప్రాజెక్ట్ ఇది కేవలం ఒక ప్రోగ్రామ్ మాత్రమే కాదని, ఒక మార్పుకు నాంది అన్నారు. అంగన్వాడీల్లో విద్య నాణ్యతను పెంచడం, కార్యకర్తల సామర్థ్యాన్ని పెంపొందించడం ఆటపాటల ద్వారా పిల్లల్లో చదువుపై ఆసక్తి కలిగించేలా ఈ ప్రాజెక్ట్ రూపొందించబడిందన్నారు. కుప్పంలో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్టుకు ఆర్థికంగా, సాంకేతికంగా సహకరిస్తున్న అన్ని సంస్థలకు, ప్రతినిధులకు డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.

క్రిస్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి మాజీ ఐఏఎస్ రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. క్రిస్ప్ ఫౌండేషన్ ద్వారా దేశంలో 14 రాష్ట్రాల్లో విద్యా సంబంధ కార్యక్రమాల్లో పనిచేస్తున్నామన్నారు. రాష్ట్రంలో కూడా అంగన్వాడీ కేంద్రాల్లోని ప్రీప్రైమరీ లెవల్ విద్యార్థులకు సంబంధించి సహకారం అందిస్తున్నామన్నారు. ముందుగా అచ్చ ప్రాజెక్టుకు సంబంధించిన లోగో, బ్రోచర్స్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ జాయింట్ డైరెక్టర్ కె. ప్రవీణ, ఆర్జేడీ పి.సుజాత రాణి, ఏడీ స్వరాజ్య లక్ష్మి, ఐసిడిఎస్ డైరెక్టరేట్‌కు చెందిన ఉదయలక్ష్మి, రాజా రాణి, ఎన్టీఆర్ జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రుక్సానా భేగం, నోడల్ ఆఫీసర్ సీహెచ్. సాయి గీత, క్రిస్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సంధ్యా రాణి, సుజనా ఫౌండేషన్‌కు చెందిన శ్రీనివాస్, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన సీడీపీవోలు, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, వివిధ ఎన్జీవో సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు సమర్థంగా పనిచేయాలి

**●ప్రతి ఇంటికీ ప్రభుత్వ పనితీరు చేరాలి**

**●అమరావతిలో టిడిపి శిక్షణ కార్యక్రమంలో కిమిడి నాగార్జున పిలుపు**



విజయనగరం (చైతన్యరథం): రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ ముందుకు సాగుతున్నారని విజయనగరం జిల్లా టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జున పేర్కొన్నారు. అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన క్లస్టర్ ఇంచార్జ్‌ల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోందన్నారు. పెట్టుబడుల ఆకర్షణ, యువతకు ఉపాధి అవకాశాలు, పరిశ్రమల స్థాపన, రోడ్లు మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఐటీ రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. యువగళం ద్వారా యువతలో నూతన ఆలోచనలను తీసుకొచ్చిన లోకేష్ పార్టీని ప్రజలకు మరింత చేరువ చేస్తున్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి క్లస్టర్ ఇంచార్జ్ ప్రజల్లోకి తీసుకెళ్లాలి అని సూచించారు. ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# బీటీ రోడ్డును ప్రారంభించిన మంత్రి కొండపల్లి



విజయనగరం (చైతన్యరథం): గజపతినగరం నియోజకవర్గం దత్తిరాజేరు మండలంలో దశాబ్దాల కాలంగా రోడ్డు సౌకర్యం లేని భోజరాజపురం గ్రామానికి రూ.2 కోట్లతో 2 కిలోమీటర్ల మేర నిర్మించిన బీటీ రోడ్డును శుక్రవారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు ఈ గ్రామ ప్రజలు ముందుకు రాలేదు. ఆ సమయంలో కొండపల్లి శ్రీనివాస్ వారికి హామీ ఇచ్చారు. గ్రామస్థుల విన్నపం మేరకు రోడ్డును నిర్మించారు. సీఎం చంద్రబాబు గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని కొండపల్లి చెప్పారు. దశాబ్దాల కాలంగా రోడ్డు లేదని, రోడ్డును నిర్మించిన మంత్రి కొండపల్లికి ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

# గీతం డీమ్డ్ వర్సిటీలో సర్ ఆర్థర్ కాటన్ జయంతి



విశాఖపట్నం (చైతన్యరథం): గీతం డీమ్డ్ వర్సిటీ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ప్రముఖ ఇంజినీరింగ్ నిపుణుడు, గోదావరి ఆనకట్ట రూపశిల్పి సర్ ఆర్థర్ కాటన్ జయంతిని శుక్రవారం నిర్వహించారు. గీతం డైరెక్టర్ ప్రొఫెసర్ పి. భరణిచంద్రకుమార్, విభాగాధిపతి డాక్టర్ ముకుంద్, ప్రొఫెసర్ ఎం. రమేష్, డాక్టర్ పి. చందనకుమార్ కాటన్ విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ.. భారతదేశానికి ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు నీటిపారుదల రంగంలో కాటన్ అమూల్యమైన సేవలందించారని కొనియాడారు. ప్రజల బాగుకోసం తపనపడి ఆంధ్రరాష్ట్రాన్ని పచ్చగా ఉంచడానికి ఆయన నిర్మించిన ఆనకట్టలు ఎంతగానో దోహదపడ్డాయన్నారు. ఇంజినీరింగ్ విద్యనభ్యసించే విద్యార్థులు కాటన్ వంటి నిపుణులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

# మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

పార్వతీపురం (చైతన్యరథం): మన్యం జిల్లా వీరఘట్టం మండలం మరియగిరి సమీపంలో ఎంజీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని చెప్పారు. యువత తప్పుడు మార్గంలో వెళ్లకుండా క్రీడలపై ఆసక్తి చూపిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన జట్టుకు రూ.50వేలు, ద్వితీయ స్థానంలో వచ్చిన జట్టుకు రూ.30వేలు, తృతీయ స్థానం సాధించిన జట్టుకు రూ.15వేలు, కన్సోలేషన్ బహుమతిగా రూ.10వేలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

# సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ఎమ్మెల్యే కొండ్రు మురళీ ప్రజాదర్బార్



విజయనగరం (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో నియోజకవర్గ స్థాయిలో తొలిసారి ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. రాజాం తహసీల్దార్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ సేదు మాధవన్, ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు చేరువగా పరిపాలనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టరు ఆదేశించారు.

# యువతకు అండగా కూటమి ప్రభుత్వం... దెందులూరులో జాబ్ మేళా

**●అందివచ్చిన ప్రతి సదవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్**



దెందులూరు (చైతన్యరథం): నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, SEEDAP - DRDA ఆధ్వర్యంలో పెదపాడు మండలం సత్రంపాడులో శుక్రవారం భారీ జాబ్ మేళా నిర్వహించారు. దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ పర్యవేక్షణలో జరిగిన ఈ మేళాకు దాదాపు 321 మందికి పైగా నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ నిరుద్యోగులతో ఎంతో స్నేహపూర్వకంగా మమేకమై, వారిలో స్ఫూర్తిని నింపారు.

**యువతకు దిశానిర్దేశం - స్ఫూర్తిదాయక ప్రసంగం**

జాబ్ మేళాను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ యువతను ఉద్దేశించి ప్రసంగిస్తూ కీలక సూచనలు చేశారు. "ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆలోచన మేరకు 'ఒక కుటుంబం – ఒక వ్యవస్థాపకుడు' విధానంలో యువత ఎదగాలనీ, కేవలం ఉద్యోగం కోసమే కాకుండా, స్వయం ఉపాధి పొందేలా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని పిలుపునిచ్చారు..

**ఉద్యోగం రాని వారు నిరాశ చెందవద్దు:**

"ఉద్యోగం రాలేదని ఎవరూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవద్దు. ఎక్కడ వెనుకబడ్డామో తెలుసుకుని, లోపాలను సరిదిద్దుకుని మళ్ళీ ప్రయత్నిస్తే విజయం కచ్చితంగా లభిస్తుంది. పేదరికం ఎవరికి అడ్డుకాదు, మీపై మీకు నమ్మకం ఉంటే సాధించలేనిది ఏదీ లేదు" అని భరోసా ఇచ్చారు.

ఈ జాబ్ మేళాలో టాటా, ఫాక్స్‌కాన్, అపోలో, మోహన్ స్పింటెక్స్, పేటీఎం, మెడ్‌ప్లస్ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయి. దూర ప్రాంతాల నుండి వచ్చిన నిరుద్యోగ యువతకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తన సొంత ఖర్చులతో 400 మందికి పైగా యువతకు భోజన ఏర్పాట్లు చేయడం సర్వత్ర హర్షం వ్యక్తమైంది.

# ధవళేశ్వరం బ్యారేజీతో తెలుగు నేలపై చెరగని ముద్ర

**●తెలుగు నేల ఉన్నంత వరకు సర్ ఆర్థర్ కాటన్ పేరు అజరామరం : దేవినేని ఉమామహేశ్వరరావు**



విజయవాడ (చైతన్యరథం): వృథాగా సముద్రంలో కలిసిపోయే గోదావరి జలాలను మళ్లించి ఉభయ గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. కాటన్ జయంతి సందర్భంగా గొల్లపూడిలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేవినేని ఉమా మాట్లాడుతూ.. 1847 నుంచి 1852 మధ్య కేవలం ఐదేళ్ల వ్యవధిలో ధవళేశ్వరం బ్యారేజీ నిర్మాణాన్ని పూర్తి చేయడం కాటన్ దూరదృష్టికి నిదర్శనమన్నారు. ఆ ప్రాజెక్టు ఉభయ గోదావరి జిల్లాల తలరాతనే మార్చేసిందని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు ఆ ప్రాంత రైతుల గుండెల్లో కాటన్ దొర 'అపర భగీరథుడు'గా చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. తెలుగు ప్రజల పట్ల ఆయన చూపిన సేవాభావానికి గుర్తుగా గోదావరి ప్రాంత ప్రజలు నేటికీ ఆయన్ను ప్రత్యక్ష దైవంలా ఆరాధిస్తున్నారని పేర్కొన్నారు. నదులు, కాలువల అనుసంధానం ద్వారా సాగునీరు, తాగునీటి సమస్యలతో పాటు జల రవాణా వ్యవస్థ కూడా అభివృద్ధి చెందుతుందని కాటన్ అప్పుడే ఊహించారని గుర్తు చేశారు. దేశంలో నదుల అనుసంధానంపై డాక్టర్ కె.ఎల్. రావు గారు కలలు కనగా, ఎన్టీఆర్ తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా చెన్నైకి నీటిని అందించే మహత్తర నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. రాయలసీమ జిల్లాలకు సాగునీరు చేరడానికి ఎన్టీఆర్ తీసుకున్న నిర్ణయాలే బాటలు వేసాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అదే దారిలో ముందుకు సాగుతూ కుప్పం, హిందూపూర్, బెంగళూరు సరిహద్దుల వరకు నీటిని తీసుకెళ్లే కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. కాటన్ మహనీయుని సేవలను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# ఇదేం వాతావరణం... అక్కడ ఎండలు... ఇక్కడ వానలు

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఓ వైపు ఎండ తీవ్రత, మరోవైపు పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శుక్రవారం ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 43.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని తెలిపారు. అలాగే 28 జిల్లాలకు గాను 19 జిల్లాల పరిధిలోని 72 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డు అయినట్లు ఆయన వెల్లడించారు. శనివారం(16-05-26) విజయనగరం, మన్యం, పోలవరం, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ కడప జిల్లాల్లో 40-42°C మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైందుకు అవకాశం ఉందన్నారు. ఆదివారం 19 మండలాల్లో తీవ్ర వడగాలులు, 30 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోవైపు నైరుతి, పశ్చిమమధ్య బంగాళాఖాతంలోని బలపడిన అల్పపీడనంకు అనుబంధంగా ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని ఏపీఎస్డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో శనివారం మన్యం, అల్లూరి, పోలవరం, అనకాపల్లి, తూర్పుగోదావరి, ఏలూరు, పల్నాడు, మార్కాపురం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప జిల్లాల పరిధిలో కొన్నిచోట్ల మేఘావృతమైన వాతావరణం, మరికొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. పొలాల్లో పనిచేసే రైతులు, పశుకాపరులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఆకాశం మేఘావృతమై ఉరుములు వినిపించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. చెట్ల క్రిందకు వెళ్లొద్దని విజ్ఞప్తి చేశారు.

# తూర్పు గోదావరి జిల్లా ప్రీమియర్ లీగ్ సీజన్-2 విన్నర్ సుభాని స్టార్స్

●విన్నర్స్‌కు ట్రోఫీ అందజేసిన రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం (చైతన్యరథం): స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయం మైదానంలో తూర్పు గోదావరి జిల్లా ప్రీమియర్ లీగ్ సీజన్-2లో భాగంగా శుక్రవారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. సుభాని స్టార్స్- జెకె స్వాగర్స్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్లో విజేతగా సుభాని స్టార్స్, రన్నర్స్‌గా జెకె స్వాగర్స్ నిలిచారు. విన్నర్స్ రన్నర్స్ కు రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ట్రోఫీలను, మెడల్స్‌ను అందజేశారు. గత 40 రోజులుగా క్రీడాకారులు తమ ప్రతిభను కనబరిచారని గెలిచిన క్రీడాకారులందరికి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. టోర్నమెంట్ నిర్వహణకు సహకరించిన గంగా హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పరమహంస, చల్లా బాలమురళి,వి సోలార్ ఎంటర్ప్రైజెస్, జయ కిషన్ (జెకె) లను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. 52 కోట్ల రూపాయలతో ఇండోర్ స్టేడియంతో పాటు త్వరలోనే మల్టీపర్పస్ స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, జూన్లో శంకుస్థాపనకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. అది త్వరితగతిన పూర్తయ్యేలా బాధ్యతను తానే స్వయంగా తీసుకుంటానని ఎమ్మెల్యే ఈ సందర్భంగా చెప్పారు.పేద, మధ్య తరగతి క్రికెట్ క్రీడాకారులు ఇటువంటి టోర్నమెంట్ లలో ఆడటం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయికి వెళ్లేందుకు మంచి అవకాశాలు దక్కుతాయని అన్నారు. జయ కిషన్ గవర్నమెంట్ సజావుగా నిర్వహించేందుకు చేసిన కృషిని ఈ సందర్భంగా అభినందించారు. క్రీడాకారుల అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే అన్నారు.

# నో వెహికల్ డే పాటించిన మంత్రి నిమ్మల రామానాయుడు

●సైకిల్ తొక్కుకుంటూ 10 కి.మీ ప్రయాణించిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి



పాలకొల్లు (చైతన్యరథం): పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇంధన పొదుపు చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా ఏపీ ప్రభుత్వం నో వెహికల్ డే అమలు చేస్తోంది. ఈ క్రమంలోనే ఏపీ జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు సీఎం క్యాంపు కార్యాలయానికి సైకిల్ తొక్కుకుంటూ వచ్చారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయం నుంచి ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం వరకూ సుమారు పది కిలోమీటర్ల దూరం ఎండలో సైకిల్ తొక్కుకుంటూ వచ్చారు మంత్రి నిమ్మల. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా శుక్రవారం పోలవరం నిర్వాసితులకు రూ.307 కోట్ల పరిహారం, పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి నిమ్మల రామానాయుడు తన కాన్వాయ్ పక్కనపెట్టి.. సైకిల్ మీద సమావేశానికి వచ్చారు. మరోవైపు ప్రధానమంత్రి పిలుపు మేరకు ఇప్పటికే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ తమ కాన్వాయ్ వాహనాలను సగం మేరకు తగ్గించుకున్నారు. ఇదే స్ఫూర్తితో పలువురు ఏపీ మంత్రులు కూడా ఇంధన పొదుపు బాట పట్టారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవికుమార్ సొంత కార్లను పక్కనబెట్టారు. అలాగే ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సైతం వీరి సరసన చేరారు. కార్లకు బదులుగా సైకిళ్లు, ఎలక్ట్రిక్ బైక్‌లలో ప్రయాణిస్తూ, ప్రజల్లో ఇంధన పొదుపుపై చైతన్యం కల్పిస్తున్నారు. ఇక సైకిల్ మీద కార్యాలయానికి వెళ్లిన మంత్రి కొల్లు రవీంద్ర.. రాష్ట్రంలోని ప్రతి వ్యక్తి వాహన వినియోగాన్ని వీలైనంతగా తగ్గించుకోవాలని కోరారు. దేశం కోసం పొదుపు చేయటమనేది అందరి బాధ్యతగా పేర్కొన్నారు. ఇంధన పొదుపుతో పాటుగా.. ఇళ్ల మీద సోలార్ కనెక్షన్ ఏర్పాటు కోసం ప్రజలు ముందుకు రావాలని కోరారు. మరోవైపు అద్దంకిలో పర్యటించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్.. ఎస్కార్ట్, కాన్వాయ్ వాహనాలు పక్కనపెట్టారు. తన సొంత వాహనంలోనే పర్యటనకు వెళ్లారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఎలక్ట్రిక్ బైక్ మీద నియోజకవర్గంలో పర్యటించారు. ఎలాంటి హడావిడి లేకుండా ఎలక్ట్రికల్ బైక్ మీద వెళ్లి అభివృద్ధి పనులలో పాల్గొన్నారు. విజయవాడ ఈస్ట్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు సైతం నియోజకవర్గంలో సైకిల్ మీద తిరుగుతూ పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు.



# రూ.2 కోట్లతో ఆధుని రైతు బజార్‌కు ఎంపీ పెమ్మసాని శంకుస్థాపన

●రైతులు, మహిళా సంఘాలకు ఉపయోగపడే విధంగా నిర్మాణం



గుంటూరు (చైతన్యరథం): “నగరంలో మూడు రైతు బజార్లో ఉన్న ఆధునిక సౌకర్యాలు లేక ప్రజలు రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా రూ. 6కోట్లతో ఆధునిక సౌకర్యాలతో 100 షాపులతో ఈ రైతు బజార్ నిర్మిస్తున్నాం.” అని గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు. పశ్చిమ నియోజకవర్గంలోని పట్టాభిపురంలో ఆధునిక రైతు బజార్ నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి పెమ్మసాని చంద్రశేఖర్ శంకుస్థాపన చేశారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ... రైతు బజార్ అనే ఆలోచన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో 1999లో ప్రారంభమైందని, రైతులను నేరుగా వినియోగదారులతో అనుసంధానం చేస్తూ మధ్యవర్తులు లేకుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా రైతు బజార్లను తీసుకొచ్చారు. గుంటూరులో మూడు రైతు బజార్లు ఉన్నప్పటికీ ఇప్పటి వరకు సరైన ఆధునిక సౌకర్యాలు లేక ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పార్కింగ్, టాయిలెట్స్, పరిశుభ్రత, సరైన మౌలిక వసతులు లేకపోవడం వల్ల పూర్తి స్థాయిలో ఉపయోగపడలేకపోయాయి. ఇప్పుడు దాదాపు రూ.6 కోట్లతో ఆధునిక రైతు బజార్ నిర్మాణం చేపడుతున్నాం. ఇందులో ప్రభుత్వ స్థలం, మున్సిపల్ స్థలం వినియోగిస్తూ సుమారు 11 వేల స్క్వేర్ ఫీట్ల విస్తీర్ణంలో నిర్మాణం జరుగుతుంది. మొత్తం 100 షాపులు ఏర్పాటు చేయనున్నాం. ఇందులో రైతులకు, మహిళా సంఘాలకు, కమర్షియల్ వినియోగానికి ప్రత్యేకంగా షాపులు కేటాయిస్తాం. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని జీ+1 లేదా జీ+2 నిర్మాణ విధానంలో డిజైన్లు రూపొందిస్తున్నారు. మున్సిపాలిటీ, ఇతర శాఖల మధ్య సమన్వయం లేక అనేక సంవత్సరాలు పెండింగ్‌లో ఉండిపోయింది. గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గల్లా మాధవి ఈ సమస్యను నా దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమన్వయంతో పనిచేయడంతో ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు ప్రారంభ దశకు వచ్చింది. ప్రజా ప్రతినిధులు పదవులను అలంకారంగా కాకుండా బాధ్యతగా తీసుకుంటే ప్రజల్లో మంచి పేరు వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బండారు ఆయురారోగ్యాలతో విలసిల్లాలి

●ఆత్రేయపురం మండలం అభివృద్ధికి ఎమ్మెల్యే బండారు కృషి అమోఘం



కొత్తపేట (చైతన్యరథం): నియోజకవర్గం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పుట్టినరోజు సందర్భంగా ఆత్రేయపురం మండలంలో సంబరాలు అంబరాన్నంటాయి. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణ రాజు, వాడపల్లి దేవస్థానం పాలకమండలి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు, అనపర్తి తెలుగుదేశం నియోజకవర్గ పరిశీలకులు ఆకుల రామకృష్ణ తదితర నాయకులు ముందుగా కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఎమ్మెల్యే బండారు పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత లొల్ల లాకుల వద్ద కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదాన శిబిరంలో 62 మంది వరకు పాల్గొని రక్తాన్ని దానం చేశారు. ఆత్రేయపురం మండల పార్టీ అధ్యక్షులు రామకృష్ణ రాజు సైతం రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం నాయకులు కార్యకర్తల కోలాహలం మధ్య భారీ కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. ఎమ్మెల్యే బండారు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని, ప్రజాక్షేత్రంలో ప్రజల ఆదరాభిమానాలను మరింతగా సాధించాలని, వారికి సేవ చేయాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణరాజు మాట్లాడుతూ... గత రెండేళ్లలో ఆత్రేయపురం మండల అభివృద్ధికి ఎమ్మెల్యే బండారు ఎంతగానో కృషి చేశారని ప్రశంసించారు. వాడపల్లి దివ్య క్షేత్రాన్ని అభివృద్ధి చేయడంతో పాటుగా అక్కడికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా తగిన చర్యలు తీసుకుంటున్నారని కొనియాడారు. లొల్లలాకుల పునర్నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారన్నారు.

# టీడీపీలో 100 మంది చేరిక... ఆహ్వానించిన ఎమ్మెల్యే నిమ్మకాలయ చినరాజప్ప



సామర్లకోట (చైతన్యరథం): కాకినాడ జిల్లా పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోటలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో 129, 131 ఫోకస్ బూత్‌ల పరిధిలో సుమారు 100 మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజా సాగి సూరిబాబురాజు, పెద్దాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ సున్న రామారావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీకాంత్, టీడీపీ పెద్దాపురం మండల శాఖ అధ్యక్షుడు మొయిల్ కృష్ణ, సామర్లకోట పట్టణ శాఖ అధ్యక్షుడు అడబాల కుమారస్వామి, క్లస్టర్ ఇన్చార్జి కంటే జగదీష్, మాజీ కౌన్సిలర్ సత్యవతి, 129 బూత్ కన్వీనర్ దాట్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఫోకస్ బూత్ అబ్జర్వర్‌గా రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్ల గణేష్‌కుమార్ హాజరయ్యారు.

# దూండి రాకేష్‌కి వెల్డింగ్ వర్క్స్ యాజమానుల సంక్షేమ సంఘ వినతి



విజయవాడ (చైతన్యరథం): భవానిపురం వెల్డింగ్ వర్క్స్ యజమానుల సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు రాష్ట్ర అధికార ప్రతినిధి మరియు ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. భవానిపురంలోని వెల్డింగ్ వర్క్స్ షాపులు అన్నీ కూడా వేరే వేరే చోట్ల జానవాసాల మధ్య ఉన్నాయని, జరగరాని ప్రమాదాలు ఏవైనా జరిగినట్లయితే చాలా ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరిగే అవకాశం ఉందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అన్నీ వెల్డింగ్ షాపులు కలిపి ఒకే దగ్గర పెట్టే విధంగా ఒక ఇండస్ట్రియల్ పార్కుగా ఒక దగ్గర స్థలం కేటాయించాలని గత 16 సంవత్సరాలుగా అన్ని ఆఫీసుల చుట్టూ, రాజకీయ నాయకుల చుట్టూ తిరుగుతున్నామని చెప్పారు. ఈ ప్రాంతం అభివృద్ధిని ఆకాంక్షించే వ్యక్తిగా, గవర్నమెంట్ వారికి మా బాధలు చెప్పి పశ్చిమ నియోజకవర్గంలో ఒక మంచి ప్రాంతంలో మాకు ప్రత్యేకంగా ఇండస్ట్రియల్ పార్క్ కేటాయించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు మధురాతకం శ్రీనివాసరావు, కార్యదర్శి మద్దా భాస్కరరావు, ఉపాధ్యక్షులు షేక్ సాబీర్ ఇతర సంఘ సభ్యులు కలిశారు.

జోన్ - 3
(మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట)
చైతన్యరథం

# చంద్రబాబు విజన్‌తో జెట్ స్పీడ్‌లో రాష్ట్రాభివృద్ధి

**●పుట్టపర్తిలో ఏఎంసీఏ ప్రాజెక్టు... ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక చరిత్రలో సువర్ణ అధ్యాయం : ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్**



పెదకూరపాడు (చైతన్యరథం): పుట్టపర్తిలో అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరగడం ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును మార్చే చారిత్రాత్మక ఘట్టమని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గతంలో పరిశ్రమలు రాష్ట్రాన్ని దాటిపోయే పరిస్థితి ఉండేదని, కానీ సీఎం నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఇప్పుడు ప్రపంచ స్థాయి పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్ వైపు పరుగులు తీస్తున్నాయని అన్నారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఏఎంసీఏ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడం రాష్ట్ర ప్రతిష్టతను మరింత పెంచిందన్నారు. "నమో-నాయుడు" నమో జోడీ సమన్వయం వల్లే రాష్ట్రానికి భారీ పెట్టుబడులు, జాతీయ ప్రాజెక్టులు వరుసగా వస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, సీఎం చంద్రబాబునాయుడు దూరదృష్టి కలిసి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా నిలబెడుతున్నాయని అన్నారు. గూగుల్ డేటా సెంటర్‌కు రూ.1.35 లక్షల కోట్లు, ఆర్సెలార్ మిట్టల్ నుంచి భారీ పెట్టుబడులు రావడం, ఇప్పుడు లక్ష కోట్ల విలువైన ఫైటర్ జెట్స్ తయారీ ప్రాజెక్టు రాష్ట్రానికి దక్కడం చంద్రబాబు పరిపాలనా సామర్థ్యానికి నిదర్శనమన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పరిశ్రమలు పారిపోతే... కూటమి ప్రభుత్వంలో పెట్టుబడులు పరుగెత్తుకుంటూ వస్తున్నాయని భాష్యం ప్రవీణ్ విమర్శించారు. ఐదేళ్ల విధ్వంసం చూసిన రాష్ట్రానికి ఇప్పుడు చంద్రబాబు నాయకత్వం కొత్త దిశ, కొత్త ఆశ చూపుతోందన్నారు. అమరావతి నిర్మాణానికి కేంద్ర నిధులు, పోలవరం ప్రాజెక్టుకు వేగవంతమైన సహకారం, విశాఖ ఉక్కు పరిరక్షణ, విశాఖ రైల్వే జోన్ సాధన, కర్నూలుకు హైకోర్టు బెంచ్ ఏర్పాటు వంటి అంశాలు కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. కేవలం 36 రోజుల్లో ఏఎంసీఏ ప్రాజెక్టును రాష్ట్రానికి తీసుకురావడం సాధారణ విషయం కాదని, ఇది సీఎం చంద్రబాబు 'జెట్ స్పీడ్ పాలన"కు ప్రత్యక్ష ఉదాహరణ అని ఎమ్మెల్యే అన్నారు. ఈ ప్రాజెక్టుతో వేలాది మంది యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, రాయలసీమతో పాటు మొత్తం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి లభిస్తుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ వ్యాఖ్యానించారు.

# నీటి అవసరాలు తీర్చే చెరువుల్ని... ప్రజల ఆరోగ్య, ఆహ్లాద కేంద్రాలుగా మార్చండి

**●రూ.3.26 కోట్లతో చేపట్టనున్న తాగునీటి చెరువుల ఆధునీకరణ పనులపై ప్రత్తిపాటి దిశానిర్దేశం**



చిలకలూరిపేట (చైతన్యరథం): పట్టణంలోని చెరువుల ఆధునీకరణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని, ముఖ్యంగా మానుకొండవారిపాలెం రోడ్డులోని కోటమ్మ చెరువు, కెల్లంపల్లి చెరువుల్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి, ప్రజల తాగునీటి అవసరాలతో పాటు. ఆరోగ్య, ఆహ్లాద కేంద్రాలుగా మార్చే చర్యలకు శ్రీకారం చుట్టాలని ప్రత్తిపాటి అధికారుల్ని ఆదేశించారు. శుక్రవారం ఆయన పట్టణానికి చేరువలోని ప్రధాన చెరువుల్ని స్థానిక నాయకులతో కలిసి స్వయంగా పరిశీలించారు. అనంతరం వాటి అభివృద్ధిపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**ప్రజల ఆరోగ్యం కోసమే.. చెరువుల ఆధునీకరణ**

చెరువులంటే సహజంగా తాగునీటి నిల్వ కేంద్రాలుగానే చూస్తామని, వాటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, కట్టలపై వాకింగ్, సైకిల్ ట్రాక్ లు నిర్మించి, ఔషధ గుణాలు కలిగిన చెట్లు, పూల మొక్కలు నాటితే ప్రజలకు ఆరోగ్యంతో పాటు, ఆహ్లాదం కూడా అందించినట్లు అవుతుందని ప్రత్తిపాటి పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వం పట్టణ ప్రజల ఆరోగ్యం కోసం గతంలో నగరవనాలు ఏర్పాటు చేస్తే, వైసీపీ ప్రభుత్వం వాటిని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. మహిళలు, చిన్నారులతో పాటు, వృద్ధుల ఆరోగ్య రక్షణ చర్యల్లో భాగంగానే పట్టణం చుట్టుపక్కల ఉన్న చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టామని ప్రత్తిపాటి చెప్పారు. చెరువుల యొక్క రెవెన్యూ రికార్డుల్ని క్షుణ్ణంగా పరిశీలించి, సమగ్రంగా సర్వేచేసి, చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ప్రత్తిపాటి మున్సిపల్, రెవెన్యూ అధికారుల్ని ఆదేశించారు. చెరువుల్లోని పూడిక, కంప తొలగించి కట్టలను బలోపేతం చేసి, నడక, సైకిల్ మార్గాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆధునీకరించిన చెరువుల రక్షణ బాధ్యతల్లో భాగంగా అవసరమైన ప్రత్యేక భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయాలని, చెరువల సంరక్షణ బాధ్యతల్లో ప్రజల్ని కూడా భాగస్వాములను చేయాలని ప్రత్తిపాటి సూచించారు. సుందరీకరణ అనంతరం చెరువుల వద్ద ఎక్కడా చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు వేయడానికి వీల్లేదని, ప్రత్యేక డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. భవిష్యత్ లో బోటింగ్, ఓపెన్ జిమ్, లైబ్రరీ వంటి ఇతర సౌకర్యాల కల్పన అంశాన్ని కూడా పరిశీలించాలన్నారు.

# ప్రతి శుక్రవారం 'నాన్-వెహికల్ డే' పాటించాలి

**● సైకిల్‌పై 2వ డివిజన్‌లో 19 కీ.మీ మేరా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పర్యటన**



విజయవాడ (చైతన్యరథం): ప్రతి శుక్రవారం 'నాన్-వెహికల్ డే'గా ప్రభుత్వం ప్రకటించిందని, అందువల్ల ప్రజలందరూ ప్రతి శుక్రవారం తమ వాహనాలను ఉపయోగించకుండా ఇంధన పొదుపునకు సహకరించాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ కోరారు. వాహనాలను పక్కన పెట్టి సైకిల్‌ను తొక్కడం వల్ల డబ్బులు ఆదాతో పాటుగా కాలుష్యం కూడా తగ్గుతుందని తెలిపారు. శుక్రవారం ఉదయం శాసనసభ్యులు గద్దె రామమోహన్ 2వ డివిజన్‌లోని ఎస్ఆర్ఆర్ కళాశాల ఎదురుగా ఉన్న ప్రాంతాల్లో పర్యటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ శుక్రవారం ఉదయం ఇంటి వద్ద నుంచి సైకిల్ తొక్కుకుంటూ 2వ డివిజన్ వరకు వెళ్లారు. అక్కడ పర్యటించి, ప్రజా సమస్యలు తెలుసుకొన్న అనంతరం రామవరప్పాడు మీదుగా సైకిల్ పైనే తూర్పు నియోజకవర్గ కార్యాలయానికి చేరుకున్నారు. మొత్తం 19 కిలోమీటర్లు సైకిల్ పైనే పర్యటించి మధ్యమధ్యలో చిరువ్యాపారాలు చేసుకునేవారితోను, ప్లాట్‌ఫారం రిక్షా తొక్కేవారితోను, ఇతరులతోను మాట్లాడుతూ, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ... కొన్ని దేశాల అనాలోచిత నిర్ణయాల వల్ల యుద్ధం జరిగిందని, దాని వల్ల ప్రపంచం మొత్తం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్నాయని చెప్పారు. ముడిచమురు ధరలు పెరగడం వల్ల అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని తెలిపారు. కొన్ని రోజుల పాటు పొదుపు చర్యలు పాటించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడి ప్రజానీకానికి సూచించారని గుర్తుచేశారు. అందులో భాగంగానే తాను కూడా ఈ రోజు సైకిల్‌పై డివిజన్ పర్యటనకు వచ్చానని చెప్పారు. ప్రతి శుక్రవారం 'నాన్ వెహికల్ డే' అని కూటమి ప్రభుత్వం ప్రకటించిందని చెప్పారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభకు చదలవాడ ఘన సత్కారం

**●550 పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అభినందన సభ**



నరసరావుపేట (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఘనంగా అభినందన సభ నిర్వహించారు. 2025-26 విద్యాసంవత్సర పదో తరగతి పరీక్షల్లో 600 మార్కులకు గాను 550కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించి ప్రోత్సహించారు. శుక్రవారం ఉదయం నరసరావుపేటలోని గుంటూరు రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థుల విజయాలను ప్రశంసిస్తూ నినాదాలు చేస్తూ ర్యాలీ నగర ప్రధాన వీధుల మీదుగా కొనసాగింది. అనంతరం సత్తెనపల్లి రోడ్డులోని రంగా బొమ్మ సమీపంలో ఉన్న విజయకుమార్-లక్ష్మీదేవి కళ్యాణ మండపంలో అభినందన సభ ఘనంగా జరిగింది. కార్యక్రమంలో పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వేదికపైకి ఆహ్వానించి అభినందించారు. ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అలాగే మెరుగైన ఫలితాలు సాధించడంలో కృషి చేసిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులను సైతం సన్మానించారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కాగిత ప్రజాదర్బార్



పెడన (చైతన్యరథం): పెడన నియోజకవర్గం తోటమూల పెడన ఫంక్షన్ హాల్ నందు ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, మరియు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా అధికారులులతో కలిసి ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు తమ వ్యక్తిగత సమస్యలు, గ్రామీణాభివృద్ధి సంబంధిత అంశాలు మరియు ఇతర సమస్యలను నేరుగా ఎమ్మెల్యేకి కలెక్టర్‌కి తెలియజేశారు. ప్రజలు తమ వినతి పత్రాలను అందజేయగా, కాగిత కృష్ణ ప్రసాద్ వాటిని సానుకూలంగా స్వీకరించి, సమస్యలను త్వరితంగా పరిష్కరించే దిశగా అధికారులను ఆదేశించారు. వేసవికాలం ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని, ఎక్కడా తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా అధికారులు ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. "ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా నీటి సరఫరా సజావుగా ఉండేలా చూడాలి. వేసవి ఎండలు మరింత తీవ్రమవుతున్న నేపథ్యంలో ఇది ముఖ్యమైన బాధ్యత" అని అయన అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

# రూ.30 వేలకే విప్లవాత్మక మిని ఫైర్ ఇంజన్‌కు ఎమ్మెల్యే శ్రీకారం

జగ్గయ్యపేట (చైతన్యరథం): నియోజకవర్గ చరిత్రలోనే కాకుండా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలోనే నిలిచిపోయే ఒక వినూత్న ప్రయోగానికి జగ్గయ్యపేట మున్సిపాలిటీ వేదికైంది. జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ చేసిన ఒక అద్భుతమైన ఆలోచన ఇప్పుడు యావత్ రాష్ట్రానికే ఒక సరికొత్త దిక్సూచిగా మారబోతోంది. సరిగ్గా మూడు రోజుల క్రితం, జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని దబ్బాగుపల్లి గ్రామంలో ఊహించని విధంగా భారీ అగ్నిప్రమాదం సంభవించింది. చూస్తుండగానే అగ్నికీలలు ఎగసిపడ్డాయి. రైతులు ఎంతో కష్టపడి, చెమటోడ్చి పండించిన సుమారు 70 ఎకరాల మొక్కజొన్న మరియు ఇతర తోటల పంటలు అగ్నికి ఆహుతైపోయాయి. కళ్లముందే పంట బూడిదవుతుంటే రైతులు ఏం చేయాలో పాలుపోక ఆవేదనతో అల్లాడిపోయారు. రైతుల ఆవేదన, వ్యవస్థలో ఉన్న ఈ భౌగోళిక ఇబ్బంది ఎమ్మెల్యే మనసును తీవ్రంగా కలచివేసింది. "ప్రమాదం జరిగినప్పుడు కోటి రూపాయల ఫైర్ ఇంజన్ ఎక్కడో దూరం నుంచి వచ్చే లోపు రైతుల జీవితాలు బుగ్గిపాలు కావాలా? దీనికి ఏదో ఒక శాశ్వత పరిష్కారం కనిపెట్టాలి" అని ఆయన గట్టిగా నిశ్చయించుకున్నారు. ప్రతి గ్రామంలో ఉన్న ట్రాక్టర్ వాటర్ ట్యాంకర్‌కు ప్రత్యేకంగా ఒక హై-ప్రెషర్ మోటార్ మరియు ఫైర్ ఇంజన్ నాజిల్ ఏర్పాటు చేయాలి. దీనికి అయ్యే ఖర్చు కేవలం రూ.30,000 (ముప్పై వేల రూపాయలు) మాత్రమే! ప్రమాదం జరిగిన వెంటనే, పెద్ద ఫైర్ ఇంజన్ వచ్చే వరకు ఆగకుండా, ఈ లోకల్ ట్యాంకర్ల ద్వారా మంటలను ప్రాథమికంగా అణచివేసేందుకు 'ఫస్ట్ ఎయిడ్' (ప్రథమ చికిత్స) లాగా వాడుకోవచ్చు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు జగ్గయ్యపేట మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలో యుద్ధప్రాతిపదికన ఒక వాటర్ ట్యాంకర్‌కు ఈ మోటార్, నాజిల్ సిస్టమ్‌ను అమర్చారు. ఈరోజు జగ్గయ్యపేట పట్టణంలోని స్థానిక చెరువు బజార్‌లో దీనికి సంబంధించిన ప్రత్యక్ష ప్రయోగాన్ని (ట్రయల్ రన్) నిర్వహించారు. ఈ ట్రయల్ రన్ వందకు వంద శాతం విజయ సాధించడంతో పలువురు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి ఈ మిని ఫైర్ ఇంజన్ గురించి తెలియజేసి రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి పరికరాలు అందుబాటులోకి వచ్చే విధంగా చేస్తామని ఎమ్మెల్యే అన్నారు.

# ఇంధన పొదుపు చర్యలు పాటిస్తాం
# ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు బాటలో నడుస్తాం

## రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వెల్లడి



నెల్లూరు (చైతన్యరథం): రూరల్ నియోజకవర్గ పరిధిలోని 31వ డివిజన్ గాదం రోశయ్య నగర్ లో స్థానిక ప్రజలతో కలసి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, నగర మేయర్ దేవరకొండ సుజాత, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, బీజేపీ నాయకులు మండ్ల ఈశ్వరయ్య, జనసేన సీనియర్ నాయకులు చిట్టమూరు ప్రవీణ్ రెడ్డి, జనసేన నగర అధ్యక్షులు దుగిశెట్టి సుధీర్ బాబు, జిల్లా కార్యదర్శి గుణకల కిషోర్ ఈశంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నెల్లూరు రూరల్‌లో జరుగుతున్న, పూర్తైన, టెండర్లు పిలిచిన అభివృద్ధి పనుల విలువ సుమారు 700 కోట్ల రూపాయలుగా ఉందని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. క్షేత్రస్థాయిలో ఇంధన పొదుపు చర్యలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకుపోయి ప్రజా ఉద్యమంలా చేస్తామన్నారు.

భారతదేశానికి ఎలాంటి ఇబ్బంది రాకుండా ఉండాలని ప్రధానమంత్రి మోడీ సూచనలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తున్నారన్నారు. ప్రజలకు చెప్పే ముందు మనం పాటించాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత నారా లోకేష్‌ను స్ఫూర్తిగా తీసుకొని శంకుస్థాపన కార్యక్రమానికి ఎలక్ట్రికల్ స్కూటీలో శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చానని వెల్లడించారు.

కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జులు, కో క్లస్టర్ ఇంచార్జులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధసంఘాల అధ్యక్షులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించండి

## యర్రగొండపాలెం టీడీపీ ఇన్చార్జి గూడూరు ఎరిక్సన్ బాబు

యర్రగొండపాలెం (చైతన్యరథం): పట్టణంలోని మండల పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్సన్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యర్రగొండపాలెం మండలంలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించగా, వాటిని స్వయంగా పరిశీలించిన ఎరిక్సన్ బాబు తక్షణమే సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సంప్రదించి, కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వినతులపై కూడా వెంటనే చర్యలు తీసుకుని ప్రజలకు న్యాయం చేయాలని అధికారులను సూచించారు. ప్రతి వినతి పత్రాన్ని ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల టీడీపీ అధ్యక్షుడు చిట్యాల వెంగళ రెడ్డి, మండల అధ్యక్షుడు పొట్ల గోవిందు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు సభకు తరలిరండి : ఎమ్మెల్యే దగుమాటి పిలుపు

కావలి (చైతన్యరథం): తుమ్మలపెంట గ్రామంలో నిర్వహించనున్న "మత్స్యకార సేవలో" కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచ్చేయనున్న నేపథ్యంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి గ్రామాల్లో పర్యటిస్తూ మత్స్యకార కుటుంబాలను ఆహ్వానిస్తున్నారు. శుక్రవారం తుమ్మలపెంట పంచాయతీ పల్లిపాలెం,శ్రీరాంపురం,రాముడు పల్లిపాలెం,చిన్నరాముడుపాలెం, షెల్టర్ శ్రీరామపురం, రామచంద్రాపురం,పెదరాముడు పాలెం, ఇంద్ర నగర్, కొత్త సత్రం,పెద్ద గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే, మత్స్యకార కుటుంబాలను స్వయంగా కలుసుకుని సీఎం సభలో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ముఖ్యమంత్రి స్వయంగా తుమ్మలపెంటకు రావడం మత్స్యకారులకు గౌరవకర విషయమని తెలిపారు. ఎమ్మెల్యే స్వయంగా గ్రామానికి వచ్చి ఆహ్వానించడం పట్ల మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు. సీఎం సభను విజయవంతం చేసేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కావలి రూరల్ మండలం అధ్యక్షులు ఆవుల రామకృష్ణ, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..



# సమస్యలపై సత్వరం స్పందించాలి

## ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్



పూతలపట్టు (చైతన్యరథం): బంగారుపాళ్యం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.బంగారుపాళ్యం మండల ప్రజల ఇబ్బందులను స్వయంగా తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది.ఈ ప్రజా దర్బార్‌లో భాగంగా వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజల నుండి ఎమ్మెల్యే గారు దాదాపు 200 అర్జీలను స్వీకరించారు.ప్రజలు సమర్పించిన ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే గారు, వాటిని తక్షణమే పరిష్కరించాలని అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించకుండా, పారదర్శకంగా, వేగంగా స్పందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో బంగారుపాళ్యం మండల అధ్యక్షులు ధరణి ప్రసాద్, తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రభుత్వం అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ముఠికి కాలువలో పూడిక తీత

## పర్యవేక్షించిన డాక్టర్ గణేశ్ బృందం

నెల్లూరు (చైతన్యరథం): రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు ఆధ్వర్యంలో, నెల్లూరు నగరంలోని 47వ డివిజన్ మహాలక్ష్మి గుడి సెంటర్ పరిధిలో విపరీతమైన చెత్తతో డ్రైన్, కల్వర్టు పూర్తిగా బ్లాక్ అయి నెలలుగా మురుగునీరు నిల్వ ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దుర్వాసన, దోమల బెడదతో పాటు మురుగునీరు ఇళ్ల ముందుకు రావడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడంతో స్థానికలు టీడీపీ 47వ డివిజన్ ఇంచార్జ్ డాక్టర్ గణేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన డాక్టర్ గణేష్ కుమార్ అండ్ టీమ్ స్వయంగా ప్రాంతాన్ని పరిశీలించి డ్రైన్‌లో పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్త, మురుగును తొలగించే పనులు చేపట్టారు. పలు పాయింట్ల వద్ద బ్లాక్ క్లియర్ చేయడంతో నెలలుగా నిల్వ ఉన్న మురుగునీరు పూర్తిగా పారుదల కావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపి సీనియర్ నాయకులు జయశంకర్, డివిజన్ ఉపాధ్యక్షులు మదనంబేటి మనిశంకర్, ప్రధాన కార్యదర్శి కల్వకుంట భాస్కర్, నెల్లూరు మైనారిటీ సిటీ నాయకులు మహాబాష, నీలకంఠం మనికృష్ణ, కంచి క్రిష్ణ , పీవి రత్నం, కార్తక్ తదితరులు పాల్గొన్నారు.




# ఆగస్టు నాటికి హై లెవెల్ బ్రిడ్జి పనులు పూర్తి

## నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



నెల్లూరు (చైతన్యరథం): నగరంలోని జాతీయ రహదారిపై జరుగుతున్న హై లెవెల్ బ్రిడ్జి పనులు ఆగస్టు మాసానికి పూర్తిచేసే బాధ్యత తాను, మంత్రి పొంగూరు నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తీసుకుంటున్నామని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని బుజబుజ నెల్లూరు ప్రాంతంలో, గొలుగమూడి రోడ్డు ప్రాంతంలోని జాతీయ రహదారిపై జరుగుతున్న హై లెవెల్ బ్రిడ్జి పనులను రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి గారితో కలిసి నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పరిశీలించారు..ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నెల్లూరు నగరానికి జాతీయ రహదారిలో బుజ బుజ నెల్లూరు, గొలగమూడి రోడ్డు ప్రాంతాల్లో రెండు ఫ్లైఓవర్ బ్రిడ్జిలు మంజూరయ్యాయన్నారు..2023లో ప్రారంభించిన పనులు వివిధ ఇబ్బందులతో పనులు సజావుగా సాగలేదన్నారు..జాతీయ రహదారిలో నెల్లూరు నగరం దాటుకోవాలంటే అధిక సమయం వెచ్చించాల్సి వస్తోందన్నారు. దీంతో పాటు నగర ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. తాము, జాతీయ రహదారుల ప్రాజెక్టు అధికారి, ట్రాఫిక్ అధికారు లు, కాంట్రాక్టర్లు ప్రత్యేక సమావేశం నిర్వహించి హై లెవెల్ పనులు వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపడతామన్నారు. మంత్రి పొంగూరు నారాయణ బ్రిడ్జి పనులు వేగవంతానికి ఉన్న స్థాయి అధికారులతో చర్చిస్తున్నా రన్నారు,, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, పట్టిన పట్టు వదలరన్నారు... ఆయన సోదరుడు భవిష్యత్తు ఎమ్మెల్యే కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి హై లెవెల్ బ్రిడ్జి పనులు వేగవంతం అయ్యేందుకు దృష్టిసారిస్తారన్నారు...ఎంపీ పర్యటనలో నగర డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్, నాయకులు నూకరాజు మదన్ కుమార్ రెడ్డి, కేతంరెడ్డి వినోద్ రెడ్డి, కూటమి నాయకులు జాతీయ రహదారి అధికారులు, ట్రాఫిక్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం!

## ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి వెల్లడి




ప్రొద్దుటూరు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి "ప్రజా దర్బార్" నిర్వహించారు. ప్రజలందరినీ ఆప్యాయంగా పలకరించారు. వారి వ్యక్తిగత సామాజిక సమస్యలను వినతులను సావధానంగా ఆలకించారు. వచ్చిన ప్రతి విజ్ఞప్తిని,అర్జీని స్వీకరించి, వాటిని తక్షణమే పరిష్కరించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీర్ఘకాలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పదే పదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి చేరేలా చూడటం, ప్రజల చెంతకే పాలనను తీసుకువెళ్లడం లక్ష్యంగా, ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపడం మా ప్రధాన బాధ్యత అని అన్నపూర్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర షేక్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం ముక్తియార్, రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంక్షేమ డైరెక్టర్ శ్రీనివాసాచారి,రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు , జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బద్వేలు శ్రీనివాసుల రెడ్డి, కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి ఘంటసాల వెంకటేశ్వర్లు, కడప పార్లమెంట్ కార్యదర్శి తలారి పుల్లయ్య, పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, పట్టణ ఉపాధ్యక్షుడు ఖలీల్ భాష, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటకొండయ్య, మైనారిటీ నాయకులు మున్నా, పుల్లయ్య, కుళాయి రెడ్డి, కట్టమీది రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ వలసలు

రాజంపేట (చైతన్యరథం): రాజంపేట నియోజకవర్గం ఒంటిమిట్ట మండలంలోని సాలాబాద్ గ్రామంలో 30 కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం సాలాబాద్ బుజ్జి ఆధ్వర్యంలో జడ్పీటీసీ ముద్దుకృష్ణారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు రమణ సహకారంతో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్మోహన్ రాజు సమక్షంలో తెలుగుదేశం పార్టీ గూటికి చేరారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రాజు మాట్లాడుతూ నమో మంత్రంతో ఊరువాడా అందరూ కూటమి ప్రభుత్వానికి జై కొడుతున్నారన్నారు. దాని పర్యవసానంగానే ఈ భారీ వలసలు జరుగుతున్నాయని, భవిష్యత్తులో కూటమి ప్రభుత్వం మరింత వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు.



తెలుగుదేశం పార్టీ రాష్ట్ర జాతీయ ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్ర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పరిమి సజిత్ తదితరులు

# మంత్రి లోకేశ్ పర్యటన విజయవంతం

## సహకరించిన అందరికీ కృతజ్ఞతలు : పూల నాగరాజు



అనంతపురం (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి విచ్చేసిన నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేసిన అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేష్ ప్రసాద్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం జిల్లా పరిధిలో ఉన్న ఎమ్మెల్యేలందరికీ, రాష్ట్ర కమిటీ సభ్యులకు, పార్లమెంట్ కమిటీ సభ్యులకు, రాష్ట్ర జిల్లా స్థాయిలో ఉన్నటువంటి కార్పొరేషన్ చైర్మన్లు డైరెక్టర్లకు, అనంతపురం నగర కమిటీ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శికి, అనంతపురము మార్కెట్ యార్డ్ చైర్మన్, వైస్ చైర్మన్ మెంబర్లకు, మాజీ కార్పొరేటర్లకు నగరంలోని దేవాలయ కమిటీ చైర్మన్ డైరెక్టర్లకు, నగర కమిటీ కార్యవర్గ సభ్యులకు క్లస్టర్ ఇన్చార్జిలకు, యూనిట్ ఇన్చార్జిలకు, డివిజన్ పార్టీ అధ్యక్షులు కార్యవర్గ సభ్యులకు, బూత్ కన్వీనర్ పార్టీ క్రియాశీల నాయకులకు పేరుపేరునా అనంతపురం జిల్లా పార్టీ తరపున జిల్లా పార్టీ అధ్యక్షులు పూల నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.

# కార్యకర్త పాడె మోసిన ఎమ్మెల్యే కందికుంట

కదిరి (చైతన్యరథం): తలుపుల మండలం, నూతనకాలువ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త వల్లెపు చక్రపాణి దురదృష్టవశాత్తు ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతూ ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చక్రపాణి మన మధ్య లేకపోవడం పార్టీకి వారి కుటుంబానికి తీరని లోటు. పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ వారి కుటుంబానికి పార్టీ ఎల్లవేళల అండగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తుది వీడ్కోలు పలుకుతూ అంత్యక్రియల్లో పాల్గొన్న కదిరి నియోజకవర్గ శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్ టీడీపీ కుటుంబసభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# వ్యవసాయ విధానాల అమలుపై ప్రత్యేక దృష్టి

## వ్యవసాయ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



గిద్దలూరు (చైతన్యరథం): నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన వ్యవసాయ కార్యక్రమాలు, రైతు సంక్షేమ పథకాలు ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై శాసన సభ్యులు అశోక్ రెడ్డి వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ, పచ్చి ఎరువు విత్తనాల పంపిణీ, ఖరీఫ్‌కు అవసరమైన ఎరువుల నిల్వలు, ఖరీఫ్ 2026-27 కార్యాచరణ ప్రణాళిక, రైతు యాప్ నమోదు ప్రక్రియ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. అలాగే పంట మార్పిడి, పంట దిగుబడి పెంపు చర్యలు, సేంద్రియ ఎరువుల వినియోగం, భూసార పరిరక్షణ సహజ వ్యవసాయ విధానాల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యమంత్రి రైతులు సాంకేతికంగా పురోగతి చెందేందుకు ప్రవేశపెట్టిన రైతు యాప్‌లో ప్రతి రైతు నమోదు అయ్యేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంకా నమోదు కాని రైతులను గుర్తించి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. రైతులకు యాప్ వినియోగం, పంట నమోదు, సబ్సిడీలు ఇతర సేవలపై విస్తృత అవగాహన కల్పించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ విధానంపై కూడా అధికారులతో సమీక్షించారు. రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానం, దరఖాస్తుల పరిశీలన అనంతరం లబ్ధిదారుల ఎంపిక, ఎంపికైన రైతులు ప్రభుత్వం నిర్ణయించిన నాన్-సబ్సిడీ మొత్తాన్ని చెల్లించే విధానము యంత్ర పరికరాలు అందజేయుట గురించి చర్చించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్లు బాలాజీ నాయక్, రాజశ్రీ, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## వైసీపీ మెలో డ్రామా అద్భుతం : టీడీపీ ఎద్దేవా

కర్నూలు (చైతన్యరథం): జిల్లా వైసీపీ నాయకులు నిన్న కర్నూల్ నగరంలో ప్రదర్శించిన మెలోడీ డ్రామా అద్భుతంగా ఉందని, వేసవి తాపంలో ఉన్న కర్నూల్ ప్రజలకు మంచి వినోదాన్ని ఇచ్చిందని కర్నూల్ పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ ఎద్దేవా చేశారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్, కూడా చైర్మన్ వెంకటేశ్వర్లు, రాష్ట్ర పార్టీ ఉపాధ్యకుడు ప్రభాకర్ డీసీఎమ్మెస్ చైర్మన్ వై. నాగేశ్వరరావుయాదవ్, జిల్లా తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ అధ్యక్షులు జగదీష్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసెట్టి శ్రీనివాసులు జయలక్ష్మిదేవి భారతీ, కాశీ విశ్వనాధ్, యస్. సుబాన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పద్మలతారెడ్డి మహిళా అధ్యక్షురాలు ముంతాజ్ నగర అధ్యక్షులు కొరకంచి రవికుమార్ తెలుగు యువత అధ్యక్షుడు అబ్బాస్, స్వామిరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జికియా అన్సారి, నంది మధు, రాజశేఖర్ రెడ్డి హనుమంతరావు చౌదరి శేషు యాదవ్ రెడ్డి సి.ఎస్ నారాయణరెడ్డి ఇతర న్యాయవాదులతో కలిసి ఏర్పాటుచేసిన పత్రిక మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కలెక్టర్ కార్యాలయం దగ్గర వైసీపీ నాయకులు ధర్నా నిర్వహించి మంత్రి టీజీ భరత్‌పై అవినీతి ఆరోపణలు చేయదాన్ని తప్పు పట్టారు.






# అట్లాంటాలో 30న 'శ్రీ విద్య ఉపాసన'పై అవగాహన

**అట్లాంటా:** అట్లాంటా తెలుగు సంఘం (TAMA), దేవీపురం సంయుక్త ఆధ్వర్యంలో పవిత్రమైన 'శ్రీ విద్య ఉపాసన'పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక బోధనా కార్యక్రమం (SriVidya Teaching Tour) నిర్వహిస్తున్నారు. గురూజీ అమృతానందనాథ సరస్వతి కుమార్తెలు, ప్రధాన శిష్యులైన రాధా మర్తి, రమ కందర్ప ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించనున్నారు.

తేదీ: మే 30, శనివారం.

సమయం: సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు.

వేదిక: షిర్డీసాయి టెంపుల్, 700 జేమ్స్‌బర్గెస్ రోడ్, సువానీ (GA).

ఈ సదస్సుకు వచ్చే భక్తులు ప్రపంచంలోనే ఏకైక శ్రీచక్ర దేవాలయమైన 'దేవీపురం', శ్రీవిద్య, శ్రీచక్రం ప్రాముఖ్యతలను తెలుసుకోవచ్చు. ప్రధానంగా ఈ కార్యక్రమంలో 'గ్రూప్ కళావాహన' అనే అరుదైన విశిష్ట క్రతువు నిర్వహించనున్నారు. జీవితమే అత్యున్నతమైన ఆరాధన అని, మన శరీరమే శ్రీచక్రమని చాటిచెప్పే ఈ ప్రాచీన జ్ఞానాన్ని నేటి సమాజానికి ఉపయోగపడేలా బోధించనున్నారు.

ఆసక్తి గల వారు పేర్ల నమోదు కోసం tama.org/ srividyaupasana వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు (లేదా) పార్వతి కొంపెల్ల: (561) 359-4041, ప్రియ బాలుసు: (404) 993-0043, సునీత పొట్నూరు (TAMA ప్రెసిడెంట్): 404-988-9429, మధుకర్ యార్లగడ్డ (ఛైర్మన్): (913) 609-3563లను సంప్రదించవచ్చు.







# సౌదీ అరేబియాలో ఘనంగా మహానాడు

**సౌదీ అరేబియా:** ఎన్ఆర్ఐ టీడీపీ ఆధ్వర్యాన సౌదీ అరేబియాలోని దమ్మాంలో మహానాడు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు, తెలుగు జాతి ఆత్మగౌరవం, ఎన్ఆర్ఐ తెలుగు ప్రజల ఐక్యతను ప్రతిబింబించే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, టీడీపీ నాయకులు రాజేష్ మహాసేన, ఖలీద్ సైఫుల్లా పాల్గొన్నారు. టీటీడీలో దర్శనానికి భారీ డిమాండ్ ఉంటుందని, వారంలో ఒక రోజు తాను ప్రవాసీయులకు దర్శనానికి కేటాయిస్తున్నానని బోడె ప్రసాద్ అన్నారు. విభిన్న దేశాల ప్రవాసీ యుల మధ్య తెలుగు వారి విలక్షణత ప్రశంసనీయమని మహాసేన రాజేష్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు లోకేష్ తెలుగు ప్రజలు ఎక్కడున్నా వారికి వీలైనంతగా సహాయం చేస్తారని, ఈ గుణం వారిని విదేశాల్లోనూ ఆదరణీయులుగా చేసిందన్నారు.

**విజయవాడ విమానాశ్రయానికి సర్వీసులు కోరుతూ తీర్మానం**

మధ్యాహ్నం జరిగిన మహానాడు సమావేశంలో ఎన్ఆర్ఐ సంక్షేమం, సామాజిక అభివృద్ధి, తెలుగు సంస్కృతి పరిరక్షణ, పార్టీ బలోపేతంపై ముఖ్య తీర్మానాలు ఆమోదించారు. విజయవాడ విమానాశ్రయానికి సౌదీ అరేబియా, ఇతర గల్ఫ్ దేశాల నుంచి నేరుగా విమాన సౌకర్యం కల్పించాలని కోరుతూ



టీడీపీ సౌదీ అరేబియా అధ్యక్షుడు ఖాలీద్ సైఫుల్లా చేసిన తీర్మానాన్ని ఆమోదించారు. నవ్యాంధ్రప్రదేశ్‌లో గల్ఫ్ దేశాల వీసా, వైద్య పరిక్షా కేంద్రాలు లేకపోవడంతో ఉపాధి నిమిత్తం వచ్చే అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వీరి సౌకర్యార్థం విజయవాడ, తిరుపతి, విశాఖపట్టణం నగరాల్లో గమ్కా సెంటర్లను నెలకొల్పాలని పార్టీ రియాద్ ప్రముఖులు జానీ బాషా చేసిన సూచనను కూడా మహానాడు ఆమోదించింది. గల్ఫ్ దేశాలలో మరణించిన ప్రవాసీ కార్మికుల కుటుంబాల పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా వైద్యం, విద్య, వసతి కల్పించాలని మహిళ నాయకురాలు గడ్డం శిల్పా చేసిన విజ్ఞప్తిని కూడా మహానాడు తీర్మానించింది.

**మహానాడు నిర్వహణలో కీలక ప్రముఖులు**

కార్యక్రమ నిర్వహణలో ఉపాధ్యక్షుడు భరద్వాజ్ మడాల, ప్రధాన కార్యదర్శి అడబాల భాస్కర్‌రావు, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ సారధి నాయుడు వడ్లమూడి, ట్రెజరర్ చంద్రశేఖర్ కీలక పాత్ర పోషించారు. జుబైల్ కో-ఆర్డినేటర్ కోగంటి శ్రీనివాసరావు, రియాద్ కో-ఆర్డినేటర్లు జాని షేక్, రాజశేఖర్ సూరపనేని, దమ్మాం కో-ఆర్డినేటర్ జకీర్ మహ్మద్, ఖోబర్ కో-ఆర్డినేటర్ మహేశ్వర్ రెడ్డి, జెడ్డా కో-ఆర్డినేటర్ కె. శివరామకృష్ణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఎన్ఆర్ఐ టీడీపీ సౌదీ అరేబియా నాయకులు జానీ బాషా, రాజశేఖర్, ఖాలీద్ సైఫుల్లా, కోగంటి శ్రీనివాస రావు, భరద్వాజ్, చంద్రశేఖర్, భాను ప్రకాశ్, చెన్నుపాటి నరేష్, గడ్డం శిల్పా, మండవ అక్షితలు, పార్టీ ప్రతినిధులు రంజిత్, సత్తిబాబు, ముజ్జమ్మీల్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంగీత విభావరిలో ప్రముఖ గాయకులు రఘు కుంచె, మాళవిక తమ గాన ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. రియాద్, జుబైల్ టీమ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు, జానపద నృత్యాలు, స్కిట్లు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.





# శాన్ రామన్‌లో హోరెత్తిన మ్యాంగో ఫెస్టివల్

## జయరామ్ కోమటికి ఘన సన్మానం

**శాన్ రామన్:** అసోసియేషన్ ఆఫ్ ఇండో అమెరికన్స్ (AIA) ఆధ్వర్యంలో నిర్వహించిన 'ది గ్రేట్ ఇండియన్ ఫుడ్ & షాపింగ్ ఫెస్ట్ (TGIFS)', 'మ్యాంగో ఫెస్టివల్' శాన్ రామన్‌లోని బిషప్ రాంచ్‌లో అత్యంత వైభవంగా జరిగాయి. బే ఏరియా నలుమూలల నుంచి సుమారు 15వేల మందికి పైగా సందర్శకులు తరలివచ్చి ఈ సాంస్కృతిక, ఆహార, వినోద వేడుకలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేడుకకు సంజీవ్ గుప్త CPA గ్రాండ్ స్పాన్సర్‌గా, రియల్టర్ లావణ్య దువ్వి ప్లాటినం స్పాన్సర్‌గా వ్యవహరించగా... ట్రావెలపోడ్ ట్రావెల్ పార్ట్‌నర్‌గా, రియల్టర్ నాగరాజ్ సహకారంతో నిర్వహించారు.

ఈ ఏడాది ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది మ్యాంగో ఫెస్టివల్ (Mango Festival). సీజనల్ మామిడి పండ్లతో తయారు చేసిన వివిధ రకాల డెజర్ట్‌లు, పానీయాలు, స్వీట్లు సందర్శకులను కట్టిపడేశాయి. మామిడి రుచులను ఆస్వాదించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున క్యూ కట్టారు. వీటితో పాటు వందకు పైగా పైగా స్టాళ్లలో భారతీయ, ప్రపంచ స్థాయి వంటకాలు, దుస్తులు, జ్యువెలరీ, హస్తకళలు, గృహాలంకరణ వస్తువుల ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది.




ఈ వేడుకలో ఉత్తర అమెరికాలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమితులైన జయరామ్ కోమటిని ఏఐఏ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు దక్కిన ఈ గౌరవం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, అమెరికా, ఆంధ్రప్రదేశ్ మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భారత కాన్సుల్ నహాస్ అలీ, అలమెడ కౌంటీ సూపర్‌వైజర్ ఎలిసా మార్క్వెజ్, శాన్‌రామన్ వైస్ మేయర్ మారిసోల్ రూబియో తదితర ప్రముఖులు పాల్గొని తమ మద్దతు తెలిపారు.

వ్యాపార, వాణిజ్య స్టాళ్లతో పాటు నాన్‌స్టాప్ లైవ్ ఎంటర్టైన్మెంట్ ఈ ఫెస్టివల్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక నృత్య బృందాల ప్రదర్శనలు, కచేరీలు, డీజే హంగామా, సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులకు కనువిందు చేశాయి. ముఖ్యంగా మదర్స్ డే సందర్భంగా నిర్వహించిన 'చీరల ప్రదర్శన' (Saree Promenade) విశేష స్పందన పొందింది. చిన్నారుల కోసం కార్నివాల్ రైడ్స్, గేమ్స్ వంటి వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. బే ఏరియాలో వైవిధ్యాన్ని చాటుతూ ఏటా నిర్వహించే ఈ ఫెస్టివల్ స్థానిక వ్యాపారవేత్తలకు మంచి వేదికగా నిలుస్తోందని ఏఐఏ ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేశారు.






# సమాజంపై బొద్దింకల్లా దాడి చేస్తున్న పరాన్న జీవులు

### కొందరు నిరుద్యోగ యువత తీరుపై సీజేఐ సూర్యకాంత్ అసహనం



కొంతమంది నిరుద్యోగ యువతను బొద్దింకలతో సీజేఐ సూర్యకాంత్ పోల్చారు. వాళ్లు మీడియా, సామాజిక మాధ్యమం, ఆర్టీఐ కార్యకర్తల్లా మారి వ్యవస్థపై దాడి చేస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. సీనియర్ న్యాయవాది హోదాను కోరుతున్న ఒక న్యాయవాదిని సీజేఐ మందలిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. వ్యవస్థపై దాడి చేస్తున్న పరాన్నజీవులు సమాజంలో ఉన్నారని, వారితో చేతులు కలపాలనుకుంటున్నారా అని పిటిషనర్‌ను (న్యాయవాది) నిలదీశారు. సీనియర్ అడ్వకేట్‌ల హోదాకు సంబంధించిన మార్గదర్శకాలపై జాప్యం జరుగుతున్నందున ఢిల్లీ హైకోర్టుకు అదేశాలివ్వాలని పిటిషనర్ సుప్రీంకోర్టును కోరారు. దీనిపై విచారణకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. 'సీనియర్ అడ్వకేట్ హోదా అనేది కోర్టు ప్రసాదించే విశిష్ట గౌరవం. పిటిషన్లతో వాటిని సాధించుకోలేరు' అని సీజైఐ అన్నారు. ఫేస్‌బుక్‌లో పిటిషనర్ వాడిన భాష, పోస్టులు తాము గమనిస్తున్నామని పేర్కొన్నారు. వ్యవస్థపై దాడి చేస్తున్న కొందరు పరాన్నజీవులతో మీరు చేతులు కలపాలనుకుంటున్నారా అని పిటిషనర్?ను సూటిగా ప్రశ్నించారు. 'సీనియర్ హోదాను మీకు తప్ప ప్రపంచంలో ఎవరికైనా ఇవ్వవచ్చు. హైకోర్టు మీకు ఆ హోదా ఇచ్చినా మీ ప్రవర్తన చూసి మేము దానిని పక్కనపెడతాం' అని స్పష్టం చేశారు. కొందరి లా డిగ్రీల ప్రామాణికతపై కూడా తమకు అనుమానాలున్నాయని, దీనిపై సీబీఐ విచారణకు తగిన కేసు కోసం చూస్తున్నామని కూడా సీజేఐ పేర్కొన్నారు. దీనిపై ఓట్లు మాత్రమే కోరుకునే బార్ కౌన్సిల్ కూడా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. సీజేఐ వ్యాఖ్యలతో పిటిషనర్ క్షమాపణ చెప్పుకుంటూ పిటిషన్‌ను వెనక్కి తీసుకునేందుకు అనుమతి కోరారు. అందుకు కోర్టు అనుమతించింది.

# మోదీ పిలుపునందుకున్న సుప్రీం కోర్టు కీలక నిర్ణయం



ప్రస్తుత పెట్రోలియం సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఇంధన పొదుపు చర్యలపై నిర్దిష్టమైన రోజుల్లో వర్చువల్ తరహాలో కోర్టు ప్రొసీడింగ్స్ జరపనున్నట్లు ప్రకటించింది.అత్యున్నత న్యాయస్థానం నిర్ణయం ప్రకారం, ప్రతి సోమవారం, శుక్రవారాల్లో సుప్రీంకోర్టులో వర్చువల్ విచారణ జరుగనుంది. తక్కిన మూడు పనిదినాల్లో హైబ్రిడ్ మోడల్ (ముఖాముఖీ తరహా)లో విచారణ చేపడుతుంది.ప్రస్తుత ఇంధన సంక్షోభ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని సీజేఐ సూర్యకాంత్ ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇంతవరకూ కోర్టు ప్రొసీండింగ్స్‌ను ఫిజికల్ అప్పియరెన్స్, వర్చువల్ తరహాలో సుప్రీంకోర్టు నిర్వహిస్తోంది. ప్రధాన నరేంద్ర మోదీ ఇటీవల జాతీ ప్రయోజనాల దృష్ట్యా వర్క్ ఫ్రం హోం చర్యలు, ఇంధన పొదుపు చర్యలకు సంబంధించిన తగిన సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తాజా నిర్ణయం తీసుకుంది.

# నందిగ్రామ్‌ను వదులుకున్న బెంగాల్ సీఎం సువేందు



పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో రెండు సీట్లలో గెలిచిన ఆయన నందిగ్రామ్ అసెంబ్లీ సీటుకు శుక్రవారం రాజీనామా చేశారు. గెలిచిన మరో నియోజకవర్గం భవానీపూర్‌ను తనవద్దే ఉంచుకున్నారు. నందిగ్రామ్ నియోజకవర్గానికి చేసిన రాజీనామాను స్పీకర్ రతీంద్ర బోస్‌కు సువేందు అందజేశారు. అసెంబ్లీ నిబంధనల ప్రకారం ఎవరైనా రెండు నియోజకవర్గాల్లో గెలిచినప్పటికీ ఒక నియోజకవర్గాన్ని14 రోజుల లోపు వదులుకోవాల్సి ఉంటుంది. పూర్వ మేదినీపూర్ జిల్లాలోని నందిగ్రామ్, సౌత్ కోల్‌కతాలోని భవానీపూర్ నుంచి ఇటీవల సువేందు పోటీ చేశారు.నందిగ్రామ్ నియోజకవర్గంలో టీఎంసీ అభ్యర్థిగా పవిత్ర కర్ పోటీ చేశారు. ఆయనపై సువేందు 9,655 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. భవానీపూర్ నుంచి టీఎంసీ అభ్యర్థిగా ఆ పార్టీ అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పోటీ చేశారు. అయితే సువేందు చేతిలో 15,105 ఓట్ల తేడాతో ఆమె ఓడిపాయారు.

**నందిగ్రామ్‌నూ అభివృద్ధి చేస్తా**

నందిగ్రామ్ సీటుకు రాజీనామాచేసిన అనంతరం సువేందు మాట్లాడుతూ, భవానీపూర్ నుంచి తాను ప్రమాణస్వీకారం చేశారని, నిబంధనల ప్రకారం ఒక సీటును వదులుకోవాల్సి వచ్చిందని చెప్పారు. నందిగ్రామ్ నియోజకవర్గం అభివృద్ధిని కొనసాగిస్తానని, నియోజకవర్గానికి తాను దూరమయ్యాయని ప్రజలు అనుకోవద్దని అన్నారు. ఫిరోజా బీబీ సమయం నుంచి కూడా తాను ఆ నియోజకవర్గం కోసం పాటుపడుతున్నట్టు చెప్పారు.



# కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

### అదుపుతప్పి కింద పడిన ట్రాక్టర్ : ఆరుగురు మృతి

కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మునీరాబాద్ సమీపంలో బ్రిడ్జిపై వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి కిందపడటంతో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడగా, వారిలో 10 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న వారు ఓ కార్యక్రమం ముగించుకుని తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బ్రిడ్జిపై మలుపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ట్రాక్టర్ కిందకు పడిపోయిందని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన 10 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదానికి గల అసలు కారణాలపై విచారణ చేపట్టారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# అర్జీకర్ అత్యాచారం కేసులో ముగ్గురు అధికారులపై సస్పెన్షన్ వేటు



దేశవ్యాప్తంగా సంచలనం సృష్టి ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలో అత్యాచారం, హత్య కేసులో విధినిర్వహణల్లో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు అధికారులపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆ ముగ్గరినీ సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. వీరిలో అప్పటి కోల్‌కతా పోలీస్ కమిషనర్ వినీత్ గోయెల్, అభిషేక్ గుప్తా, మనోజ్ మఖోపాధ్యాయ్ ఉన్నారు. ఆర్జీకర్ హత్యాచారం కేసు: కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పటల్‌లోని 31 ఏళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీ డాక్టర్ 2024 ఆగస్టులో అత్యాచారం, హత్యకు గురైంది. ఈ ఘటన సంచలనమైంది. వైద్యులు, విద్యార్థులు, పౌర సమాజం నిరనసలకు దిగారు. ఈ ఘటనలో నిందితులను శిక్షించి న్యాయం చేయాలని, పనిప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ఆసుపత్రి అధికారులు, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఈ ఘటనకు బాధ్యత వహించాలని డిమాండ్లు వెల్లువెత్తాయి. సాక్ష్యాలను తారుమారు చేయడం, పోలీసు చర్యలో జరుగుతున్న జ్యాపం, సంస్థాగతమైన నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.కోర్టు ఆదేశాలతో ఈ కేసును సీబీఐ చేపట్టింది. పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో ఈ ఘటనను బీజేపీ ప్రధానంగా ప్రస్తావించింది. ఆర్జీ కర్ బాధితురాలికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చింది. బాధితురాలి తల్లికి రత్న దేబ్‌నాథ్‌కు పానిహతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టిక్కెట్ కూడా ఇచ్చింది. ఆ నియోజకవర్గం నుంచి టీఎంసీ అభ్యర్థి తీర్థంకర్ ఘోష్‌పై రత్న దేబ్‌నాథ్ 28,836 ఓట్ల భారీ ఆధిక్యంతో గెలుపొందారు.





# లీకు వీరుల జమానాలో నలిగిపోతున్న నీట్ పరీక్ష

నీట్ యూజీ 2026 పేపర్ లీక్ కేసులో మరో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. నీట్ పేపర్ లీక్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజస్థాన్‌కు చెందిన కుటుంబం గతంలోనూ వైద్య ప్రవేశ పరీక్షల పేపర్లను లీక్ చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. రాజస్థాన్ పోలీసుల సమాచారం ప్రకారం.. జైపూర్ జిల్లా జంవా రామ్‌గఢ్‌కు చెందిన మంగీలాల్ బివాల్, దినేష్ బివాల్ సోదరులు ఈ ఏడాది మాత్రమే కాకుండా గత కొన్ని సంవత్సరాలుగా మెడికల్ ఎంట్రన్స్ పరీక్షల ప్రశ్నపత్రాలను లీక్ చేసి విక్రయించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఇద్దరు సోదరులు రాజస్థాన్‌లోని సికార్ ప్రాంతంలోని కోచింగ్ సెంటర్లకు ప్రశ్నపత్రాలు చేరవేసినట్లు పోలీసులు గుర్తించారు. ముందుగా తమ కుటుంబ సభ్యుల కోసం ప్రశ్నపత్రాలను సేకరించి, అనంతరం ఇతరులకు భారీ మొత్తాలకు విక్రయించినట్లు దర్యాప్తులో తేలినట్లు సమాచారం. దర్యాప్తులో భాగంగా బివాల్ కుటుంబానికి చెందిన ఐదుగురు విద్యార్థులకు పరీక్షకు ముందే నీట్ 2025 ప్రశ్నాపత్రం అందినట్లు పోలీసులు గుర్తించినట్లు

**గత ఏడాది కూడా ఇదే తంతు**

తెలుస్తోంది. మంగీలాల్ కుమారుడు వికాస్ బివాల్ ప్రస్తుతం సవాయి మాధోపూర్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. అతడికి కూడా దీంట్లో భాగస్వామ్యం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రశ్నపత్రాల సేకరణ, పంపిణీ కోసం నిందితులు రూ.65 లక్షలు చెల్లించినట్లు దర్యాప్తు అధికారులు చెబుతున్నారు. ఈ మొత్తం వ్యవహారం కోచింగ్ సెంటర్ల మాఫియా ఆధ్వర్యంలో సాగిందని.. ఇది సాధారణ పేపర్ లీక్ కేసు కాదని అంటున్నారు. సంవత్సరాలుగా వ్యవస్థీకృతంగా నడుస్తున్న అక్రమ నెట్‌వర్క్ అని పేర్కొంటున్నారు. సికార్‌లోని కోచింగ్ సంస్థల మధ్య పోటీ, అంతర్గత విభేదాల కారణంగానే ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. నీట్ పేపర్ లీక్ వివాదం దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహానికి దారి తీసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్రం నీట్ యూజీ పరీక్షను రద్దు చేసి కొత్త తేదీలను ప్రకటించడమే కాకుండా సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. రంగంలోకి దిగిన సీబీఐ ఇప్పటికే పలువురిని అరెస్టు చేసింది. మరోవైపు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా ప్రశ్నపత్రం లీక్ జరిగిన విషయాన్ని అంగీకరించారు. వ్యవస్థలో లోపం జరిగిందని దీనికి ప్రభుత్వం బాధ్యత వహిస్తుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.



# మోదీకి రాజమర్యాద!

## యూఏఈ ఆకాశంలో యుద్ధవిమానం వెల్‌కమ్!

ప్రధాని నరేంద్రమోదీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు అరుదైన గౌరవం లభించింది. మోదీని యూఏఈ ప్రత్యేకంగా స్వాగతించింది. ఆయన ప్రయాణిస్తున్న విమానం శుక్రవారం మధ్యాహ్నం యూఏఈ గగనతలంలోకి ప్రవేశించగానే ఆ దేశ ఫైటర్ జెట్ ఎస్కార్ట్ వచ్చింది. తమ వాయుసేన కోసం ప్రత్యేకంగా రూపొందించిన యుద్ధ విమానం ఎఫ్-16 బ్లాక్ 60 'డెజర్ట్ ఫాల్కన్'ను పంపింది. అబుదాబిలో ప్రధాని విమానం ల్యాండ్ అయ్యేవరకు వెంటే వచ్చింది. ఐరోపా దేశాల పర్యటనకు బయల్దేరిన మోదీ మధ్యలో యూఏఈకి వెళ్లారు. కేవలం కొన్ని గంటలే అక్కడ ఉండనున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో ఆయన పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. యూఏఈపై ఇరాన్ దాడి సరికాదు: మోదీయూఏఈపై ఇరాన్ దాడిని ప్రధాని మోదీ ఖండించారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం ప్రపంచం మొత్తంమీద ఉందని చెప్పారు. హర్మూజ్ విషయంలో అంతా అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి ఉండాలన్నారు. యూఏఈ పర్యటనకు వెళ్లిన ప్రధాని మోదీ సమక్షంలో భారత్ పలు కీలక ఒప్పందాలు చేసుకుంది. ఎల్పీజీ సరఫరా, పెట్రోలియం నిల్వలపై ఎంవోయూ కుదుర్చుకుంది. అంతేకాకుండా వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యం, నౌకల మరమ్మతు కేంద్రం ఏర్పాటు తదితర అంశాలకు సంబంధించిన ఎంవోయూలపై భారత అధికారులు సంతకాలు చేశారు.

# "భారత్ ముందడుగు వేయండి"

## శాంతి దూతగా ఇండియాను కోరిన ఇరాన్!



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించేందుకు, శాంతి స్థాపనకు భారత్ కీలక పాత్ర పోషించగలదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అన్నారు. ఈ ప్రాంతంలో శాంతి నెలకొనేందుకు ద్వైపాక్షిక, దౌత్యపరమైన చర్చలు మాత్రమే మార్గం అని అబ్బాస్ అభిప్రాయపడ్డారు. బ్రిక్స్ సదస్సులో భాగంగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ప్రస్తుతం ఇండియాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా న్యూఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత యుద్ధాన్ని ముగించేందుకు ఇండియా ఎలాంటి నిర్మాణాత్మక ప్రతిపాదనతో వచ్చినా స్వాగతిస్తామని ప్రకటించారు. ప్రాంతీయ శాంతి భద్రతల్ని ప్రభావితం చేసే శక్తి ఇండియాకు ఉందని ఆయన అన్నారు. ఈ విషయంలో భారత్ అర్థవంతమైన ప్రతిపాదనతో వస్తే మద్దతు తెలుపుతామని చెప్పారు. అమెరికా, ఇజ్రాయెల్‌తో యుద్ధానికి సైనిక చర్య ఎంతమాత్రం పరిష్కారం కాదన్నారు. హార్ముజ్ వద్ద పరిస్థితి చాలా క్లిష్టంగా ఉందని, అయితే ఇక్కడి నుంచి నౌకలు సురక్షితంగా కదిలేందుకు ఎలాంటి సాయం అందించడానికైనా ఇరాన్ సిద్ధంగా ఉందని ప్రకటించారు. అమెరికాపై విశ్వాసం లేకపోవడం వల్లే చర్చలు పురోగతి సాధించడం లేదని అభిప్రాయపడ్డారు. అమెరికాను తాము నమ్మకపోవడానికి పలు కారణాలున్నాయని, అయితే అమెరికాకు మాత్రం ఇరాన్‌పై పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు. 40 రోజుల యుద్ధం తర్వాత కూడా అమెరికా ఎలాంటి లక్ష్యాన్ని సాధించలేదని, అందుకే ఇరాన్‌తో చర్చలకు ప్రతిపాదించారని, తమకు అమెరికన్లపై నమ్మకం లేదని అబ్బాస్ అరాగ్చీ చెప్పుకొచ్చారు. అమెరికాతో దౌత్యపరంగా ఇబ్బందులున్నాయన్నారు. అమెరికా, ఇరాన్ మధ్య పాక్ మధ్యవర్తిత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ అంశంపై కూడా అబ్బాస్ స్పందించారు. పాక్ దౌత్యచర్చలు విఫలం కాలేదని, కానీ అమెరికా వైఖరి సరిగ్గా లేకపోవడం వల్ల ఆ దేశంపై విశ్వాసం లేదని చెప్పారు. ఈ విషయంలో తమకు చైనా సహకరించినా స్వాగతిస్తామని అభిప్రాయపడ్డారు. గతంలో ఇరాన్, సౌదీ అరేబియా మధ్య సంబంధాలు మెరుగుపర్చడంలో చైనా సాయం చేసిందని గుర్తు చేశారు.

# అదానీపై కేసులు రద్దు?

## అమెరికా న్యాయశాఖ యూటర్న్‌కు సిద్ధమైందా



అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీపై నమోదైన కేసులను రద్దు చేసుకోవడానికి అమెరికా న్యాయశాఖ ప్రయత్నాలు ప్రారంభించినట్లు బ్లూమ్‌బర్గ్, ద న్యూయార్క్ టైమ్స్ తదితర అంతర్జాతీయ పత్రికలు కథనాలు ప్రచురించాయి. ఈ వారాంతంలోగా దీనిపై అధికారిక ప్రకటన వెలువడొచ్చు. దీనితోపాటు 2024 నవంబరులో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) దగ్గర నమోదైన కేసును మూసేసే అవకాశముంది. అమెరికాలో భారీ పెట్టుబడి పెట్టేందుకు అదానీ సంస్థల తరపు న్యాయవాది ప్రతిపాదించడంతో ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నట్టు 'ద న్యూయార్క్ టైమ్స్' ఎక్స్‌లో పేర్కొంది.

# రహస్య కోటలో ట్రంప్-షీ భేటీ

## చైనా 'పవర్ సెంటర్' తలుపులు తెరుచుకున్నాయి!

చైనా పర్యటనలో ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండో రోజు ఆ దేశాధినేత షీ జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశానికి 'జోంగ్నాన్‌హై' వేదికైంది. ప్రపంచంలోనే అత్యంత రహస్యమైన, శక్తిమంతమైన రాజకీయ కాంపౌండ్లలో ఇది ఒకటి. అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ నివాసం ఉండే ఈ ప్రాంగణంలో విదేశీ నేతలకు ఆతిథ్యమివ్వడం అత్యంత అరుదు. అలాంటిది ఇప్పుడు ట్రంప్‌ను ఇక్కడికి ఆహ్వానించడం ఆసక్తికరంగా మారింది. ఇంతకీ ఏంటీ 'జోంగ్నాన్‌హై' ప్రత్యేకత..?ఈ గోడల వెనకే కీలక నిర్ణయాలు..బీజింగ్‌లో ఉండే 'జోంగ్నాన్‌హై' కాంపౌండ్.. చైనీస్ కమ్యూనిస్ట్ పార్టీ, కౌన్సిలు హెడ్‌క్వార్టర్. 1950 నుంచి అధికార కమ్యూనిస్ట్ పార్టీ నేతలు ఇక్కడే నివాసం ఉంటూ పాలన సాగిస్తున్నారు. అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కూడా ఇందులోనే ఉంటారు. వైట్‌హౌస్ మాదిరిగా ఈ ప్రాంగణంలోకి వెళ్లేందుకు సాధారణ పౌరులకు అనుమతి ఉండదు. చైనా ప్రభుత్వ పాలసీ విధానాలకు సంబంధించి కీలక నిర్ణయాలను ఇక్కడే రూపొందిస్తారు. సంబంధిత నేతలు ఆ నిర్ణయాలను అధికారికంగా ప్రకటించేంతవరకు ఈ కాంపౌండ్ దాటి అవి బయటకు వెళ్లవు అనే పేరుంది. ఈ ప్రాంగణంలో లగ్జరీ నివాసాలు, అత్యాధునిక వైద్య సదుపాయాలతోపాటు అనేక సౌకర్యాలు ఉంటాయట. చైనా పాలకులు ఈ ప్రాంగణంలో విదేశీ నేతలకు ఆతిథ్యం ఇవ్వడం అనేది చాలా తక్కువ సందర్భాల్లోనే జరిగింది. రష్యా అధ్యక్షుడు పుతిన్, బెలారస్ అధినేత అలెగ్జాండర్ లుకాషెంకోవంటి నేతలతో షీ జిన్ పింగ్ ఇక్కడ భేటీ అయ్యారు. 2014లో నాటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా ఈ కాంపౌండ్‌లోని ఓ ద్వీపంలో జిన్‌పింగ్‌తో కలిసి వాక్ చేసినట్లు అప్పట్లో చైనా అధికారిక మీడియా వెల్లడించింది. 2002లో నాటి అగ్రరాజ్య అధ్యక్షుడు జార్జ్ బుష్ కూడా ఈ కాంపౌండ్‌ను సందర్శించారు. 2017లో ట్రంప్ చైనాలో పర్యటించినప్పటికీ నాడు ఈ ప్రాంగణానికి ఆయనను ఆహ్వానించలేదు. తాజాగా ఇప్పుడు జిన్‌పింగ్ తన పవర్ సెంటర్‌లో అమెరికా అధ్యక్షుడికి ఆతిథ్యమివ్వడం ఇరు దేశాధినేతల వ్యక్తిగత మైత్రిని చాటిచెబుతోంది.



గార్డెన్‌నుంచి పవర్ సెంటర్..

'జోంగ్నాన్‌హై' అంటే మధ్య, దక్షిణ సముద్రాలను కలిపే వారధి అని అర్థం. ఈ కాంపౌండ్‌లోని సరస్సులు ఒకదానితో ఒకటి అనుసంధానించి ఉండటంతో దీనికీ పేరు వచ్చిందని చరిత్రకారులు చెబుతారు. రాజుల కాలంలో ఇది ఉద్యానవనంగా ఉండేది. 12వ శతాబ్దానికి చెందిన సరస్సులు కూడా ఇక్కడ ఉన్నాయట. చైనా రాచరిక చరిత్ర, సంస్కృతి ఉట్టిపడేలా నిర్మాణాలు ఉన్నట్టు తెలుస్తోంది. క్వింగ్, మింగ్ రాజవంశానికి చెందిన చక్రవర్తులు ఇక్కడ నివాసం ఉండేవారని చరిత్ర చెబుతోంది. 1898లో క్వింగ్ రాజవంశానికి వ్యతిరేకంగా ఇక్కడ తిరుగుబాటు జరిగింది. ఆ సమయంలో మహారాణి డోవేగర్ సిక్స్ తన మేనల్లుడిని ఈ గార్డెన్‌లోని కృత్రిమ ద్వీపంలో బంధించారట.

దీని చరిత్ర, ప్రాముఖ్యతను గుర్తించిన కమ్యూనిస్ట్ నేత మావో జెడాంగ్ 1949లో పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాను ఏర్పాటుచేసిన తర్వాత 'జోంగ్నాన్‌హై'ను తన అధికారిక నివాసంగా ఎంచుకున్నారు. అప్పటినుంచి చైనా పాలకవర్గంలో ఉన్న నేతలకు ఇది అధికారిక రాజకీయ కేంద్రంగా కొనసాగుతూ వస్తోంది. 1972లో నాటి అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్‌ను మావో తన నివాసానికి ఆహ్వానించారు. ఆ పర్యటనతోనే కొన్ని దశాబ్దాలపాటు ఇరుదేశాల మధ్య దౌత్య ప్రతిష్టంభన తొలగి సత్సంబంధాలు ఏర్పడ్డాయి.

# హార్ముజ్‌లో 360 నౌకలు బందీ!

## ప్రపంచం చూడని నౌకల బ్లాకేజ్ సృష్టిస్తున్న ఇరాన్



హార్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇక్కడ చిక్కుకుపోయిన నౌకల్ని ఇరాన్ అంత సులభంగా అనుమతించడం లేదు. దీంతో హార్ముజ్ వద్ద ప్రస్తుతం 360 వరకు వాణిజ్య నౌకలు చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. వివిధ దేశాలకు చమురు, ఆహారం, ఇతర ఉత్పత్తులు రవాణా చేసే నౌకలివి. దీంతో ఆయా దేశాలు సమస్యలు ఎదుర్కొంటున్నాయి. 360 వరకు నౌకలు చిక్కుకుపోవడంతో ఈ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ పెరిగిపోయింది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో రోజుకు 40 నౌకలు మాత్రమే ఇక్కడినుంచి కదులుతున్నాయి. దీంతో నౌకా రవాణాకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ప్రపంచంలోనే అత్యంత రద్దీ అయిన సముద్ర రవాణా మార్గం ఇది. అంతర్జాతీయ ఆర్థిక ప్రగతికి కూడా ఈ మార్గం కీలకం. దాదాపు 20 శాతం నౌకలు ఈ మార్గం నుంచే వెళ్తాయి. అందులోనూ చమురు, గ్యాస్ నౌకలు ఎక్కువగా రవాణా జరిగేది ఈ ప్రాంతం నుంచే. అలాంటిది ఇక్కడ నౌకలు నిలిచిపోవడంతో అంతర్జాతీయంగా చమురు సంక్షోభం మొదలైంది. చమురు మార్కెట్లు, ప్రభుత్వాలు, షిప్పింగ్ కంపెనీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. షిప్పింగ్ ఇంటెలిజెన్స్ సంస్థ కెప్లర్ ప్రకారం ఇక్కడ 360 వాణిజ్య, ఆహారోత్పత్తుల నౌకలు నిలిచిపోయాయి. వీటిలో అతికష్టం మీద రోజుకు 40 నౌకలు మాత్రం కదులుతున్నాయి. ఇక్కడ చిక్కుకుపోయిన నౌకల్ని రక్షించేందుకు అమెరికాకు చెందిన నౌకలు రక్షణ కల్పిస్తున్నాయి. అయినప్పటికీ నౌకల రవాణా చాలా తక్కువగా ఉంది. ఇలాంటి యుద్ధం, దిగ్బంధం వంటి పరిస్థితుల్లో రక్షణ, సహాయం అందించడానికి ఈ ప్రాంతం అంత అనుకూలం కాదు. వన్ వే ట్రాఫిక్ సాధ్యం కాదు. అందుకే అనేక నౌకల్ని రక్షించడం కష్టంగా మారింది. దీంతో ప్రపంచం ఎప్పుడూ చూడని నౌకల బ్లాకేజ్ కొనసాగుతోంది.

# మార్ష్ తుఫాన్ ఇన్నింగ్స్.. చెన్నైపై లక్నో ప్రతీకార విజయం



ప్లే ఆఫ్స్ రేసులో నిలిచిన జట్లకు పోటీలో లేని జట్లు షాక్‌లు ఇస్తున్నాయి. పంజాబ్ కింగ్స్‌కు ధర్మశాలలో ముంబై ఇండియన్స్ ఝలక్ ఇవ్వగా.. విజయంతో ముందంజ వేయాలనుకున్న చెన్నై సూపర్ కింగ్స్‌ను లక్నో సూపర్ జెయింట్స్ ఓడించింది. ఆకాశ్ సింగ్ (3–26) విజృంభణతో 187కు సీఎస్కే పరిమితమవ్వగా.. ఛేదనలో మిచెల్ మార్ష్ (90) తుఫాన్ ఇన్నింగ్స్‌తో లక్నోను గెలుపు దిశగా నడిపాడు. వెంటవెంటనే మూడు వికెట్లు పడినా.. ముకుల్ చౌదరి (13 నాటౌట్), నికోలస్ పూరన్ (32 నాటౌట్) ప్రత్యర్థికి అవకాశమివ్వలేదు. కంబోజ్ ఓవర్లో పూరన్ నాలుగు సిక్సర్లతో లక్నో ప్రతీకార విక్టరీ సాధించగా... చెన్నై ఐదో స్థానం వద్దే ఆగిపోయింది.

పంతొమ్మిదో సీజన్లో ప్లే ఆఫ్స్ సమీకరణాలు ఆసక్తి రేపుతున్నాయి. జోరు మీదున్న జట్లు ముందంజ వేస్తాయనుకుంటే అనూహ్యంగా కంగుతింటున్నాయి. శుక్రవారం లక్నో సూపర్ జెయింట్స్ చేతిలో చెన్నై సూపర్‌కింగ్స్ చిత్తుగా ఓడింది. విజయంతో నాలుగో స్థానానికి ఎగబాకాలనుకున్న సీఎస్కే ఆశలకు లక్నో చెక్ పెట్టింది. 188 పరుగుల ఛేదనలో లక్నో ఓపెనర్లు దంచికొట్టారు. మిచెల్ మార్ష్ (90), ఇంప్యాక్ట్ సబ్ జోష్ ఇంగ్లిస్ (36) పోటాపోటీగా ఆడారు.

చెన్నై ప్రధాన పేసర్ అన్షుల్ కంబోజ్‌ను ఉతికేసిన మార్ష్ ఐదో ఓవర్లో నాలుగు సిక్సర్లు, ఫోర్‌తో 28 రన్స్ పిండుకున్నాడు. మార్ష్ 28 బంతుల్లోనే అర్ధ శతకం సాధించగా పవర్ ప్లేలోనే లక్నో స్కోర్ 80 దాటింది.

వీరబాదుడుతో లక్ష్యాన్ని కరిగిస్తున్న ఈ జోడీని ముకేశ్ చౌదరీ విడదీశాడు. ఇంగ్లిస్‌ను ఔట్ చేయడంతో 135 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ వెంటనే మార్ష్ రనౌటవ్వగా.. అబ్దుల్ సమద్ (7)ను బౌల్డ్ చేసిన స్పెన్సర్ సీఎస్కే శిబిరంలో ఆశలు రేపాడు. టపటపా మూడు వికెట్లు పడంతో లక్నో స్కోర్ వేగానికి బ్రేకులు పడ్డాయి. అప్పటికే అవసరమైన పరుగులు తక్కువే కావడంతో ముకుల్ చౌదరి (13 నాటౌట్), నికోలస్ పూరన్ (32 నాటౌట్) దంచేశారు. కంబోజ్ వేసిన 17వ ఓవర్లో తొలి నాలుగు బంతుల్ని స్టాండ్స్‌లోకి పంపిన పూరన్ లక్నోకు 7 వికెట్ల విజయాన్ని అందించాడు.

# వన్డే ప్రపంచకప్ ఆడాలని ఉంది: కోహ్లీ

### సెలెక్టర్లు ఏమంటారో..!



ఐపీఎల్‌లో తొమ్మిదో శతకంతో చెలరేగిన విరాట్ కోహ్లీ ఆట చూస్తుంటే మరో రెండేళ్లు తిరుగులేదని అనిపిస్తోంది. వరుసగా రెండు గోల్డెన్ డకౌట్‌ల నుంచి తేరుకుని సెంచరీతో విరుచుకుపడిన కోహ్లీ వన్డే వరల్డ్ కప్‌లో ఇలానే ఆడితే చూసి తరించాలని అభిమానులు అనుకుంటున్నారు. విరాట్ సైతం ప్రపంచకప్ ఆడాలనే ఉద్దేశంతోనే ఉన్నట్టుగా తెలుస్తోంది. ఆర్సీబీ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. 'దేశం తరపున వరల్డ్‌కప్ ఆడడం కంటే గొప్ప విషయం ఏముంటుంది' అని కోహ్లీ నవ్వుతూ బదులిచ్చాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో టన్నుల కొద్దీ పరుగులు, వన్డేల్లో శతకాల ఫిఫ్టీతో రికార్డులు నెలకొల్పిన విరాట్ కోహ్లీ తదుపరి లక్ష్యం? ఏంటో తెలుసా.. వన్డే ప్రపంచ కప్. ఐపీఎల్ పద్దెనిమిదో సీజన్‌తో ఆర్సీబీ కలను సాకారం చేసిన విరాట్ వచ్చే ఏడాది ప్రపంచ కప్ ఆడేందుకు సిద్ధమవుతున్నాడు. ఆస్ట్రేలియా పర్యటన, ఆపై స్వదేశంలో దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో శతకాలతో రెచ్చిపోయిన అతడు.. దేశవాళీ టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలోనూ దంచేశాడు. ఇప్పుడు ఐపీఎల్ 19లోనూ కుర్రాడిలా రెచ్చిపోతున్నాడు. అతడి ఫామ్ చూస్తుంటే వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ కప్ ఆడేలా ఉన్నాడు? అని అందరూ అనుకుంటున్నారు. ఇదే విషయంపై ఆర్సీబీ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. నాకు ప్రపంచకప్ ఆడాలనే ఉంది అని మనసులోని మాట చెప్పేశాడు.

'మైదానంలోకి దిగాక జట్టులో ఉత్సాహం నింపడం, విజయంలో భాగమవ్వడం మీదే నా దృష్టంతా ఉంటుంది. నన్ను నేను నిరూపించుకోవాలని ఆడను. నేను ఇప్పుడు ఆ పరిస్థితిలో లేను కూడా. ఎందుకంటే మ్యాచ్ సన్నద్ధత పట్ల, మైదానంలోకి దిగాక ఎలా ఆడాలి? అనే విషయాలపై నేను నిజాయితీగా ఉంటాను. అందుకని తల కిందకు వంచి.. నెట్స్‌లో కష్టపడతాను. నా క్రికెట్ కెరీర్‌లో అన్నీ ఇచ్చినందుకు ఆ దేవుడికి కృతజ్ఞతలు. నాకు అవకాశం వచ్చినందుకు ఎంతో గర్వపడతాను. ఇక ఆట విషయానికొస్తే.. వన్డేల్లో 40 ఓవర్ల పాటు బౌండరీ నుంచి అవతలి బౌండరీ వరకూ పరిగెత్తమని చెప్పినా.. నేను పరుగెడుతాను.

యాభై ఓవర్లకు తగ్గట్టుగా నేను సన్నద్ధమవుతా. నేను ఎదుర్కొనే ప్రతి బంతినీ ఇదే నా కెరీర్లో చివరి బంతి అనుకుంటూ బ్యాటింగ్ కొనసాగిస్తా. అంతేనా.. వికెట్ల మధ్యలో చకచకా పరుగు తీస్తా. జట్టుకు అవసరమైన ప్రతిదీ చేసేందుకు నేను ఎల్లప్పుడూ సిద్ధమే. విజయ్ హజారే ట్రోఫీలో గొప్పగా ఆడాను. వరల్డ్ కప్ గురించి అడిగితే.. నాకూ ఆడాలనే ఉంది. కానీ, అది నా ఒక్కడి నిర్ణయం సరిపోదు. జట్టుకు కూడా నా అసవరం ఉందని సెలెక్టర్లు అనుకోవాలి. అప్పుడే వరల్డ్ కప్ ఆడగలను' అని విరాట్ పేర్కొన్నాడు.

రెండేళ్ల క్రితం టీ20, టెస్టులకు వీడ్కోలు పలికిన విరాట్.. ప్రస్తుతం అంతర్జాతీయంగా వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. 2011లో ధోనీ సారథ్యంలో వరల్డ్‌కప్ గెలిచిన జట్టులో సభ్యుడైన విరాట్.. ఇటీవల రోహిత్ శర్మ కెప్టెన్సీలో ఛాంపియన్స్ ట్రోఫీ విజయంలోనూ కీలకమయ్యాడు. అదే ఉత్సాహంతో 2027 వన్డే ప్రపంచకప్ ఆడి దేశానికి మరో ఐసీసీ ట్రోఫీ కట్టబెట్టాలని అతడు ఆశపడుతున్నాడు. అయితే.. మన సెలెక్టర్లు ఏం చేస్తారో చూడాలి.

# చెన్నై గూటికి కుల్దీప్

### ఆర్సీబీ స్క్వాడ్‌లో ఇంగ్లండ్ పేసర్..!




పంతొమ్మిదో సీజన్ ప్లే ఆఫ్స్ పోటీ ఆసక్తికరంగా మారిన వేళ కొత్త వాళ్లతో స్క్వాడ్‌ను పటిష్టం చేసుకుంటున్నాయి ఫ్రాంచైజీలు. గాయంతో టోర్నీకి దూరమైన వారి స్థానాన్ని భర్తీ చేస్తున్నాయి. తాజాగా ఓవర్టన్ ప్లేస్‌లో దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ డియాన్ ఫొరెస్టర్‌ను తీసుకున్న చెన్నై.. పేసర్ ఖలీల్ అహ్మద్ స్థానంలో కుల్దీప్ యాదవ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ సైతం తమ స్క్వాడ్‌లోకి ఇంగ్లండ్ పేసర్ రిచర్డ్ గ్లీసన్‌కు చోటిచ్చింది. లీగ్ దశ ఆఖర్లో పుంజుకుని ప్లే ఆఫ్స్‌కు గట్టి పోటీదారుగా మారిన చెన్నై సూపర్ కింగ్స్ స్క్వాడ్‌లోకి కొత్త పేసర్‌ను తీసుకుంది. సీజన్ ఆరంభం మ్యాచ్‌ల్లోనే గాయపడిన సీనియర్ పేసర్ ఖలీల్ అహ్మద్ స్థానంలో కుల్దీప్ యాదవ్‌ను తీసుకుంది సీఎస్కే. రూ.30 లక్షలకు కుల్దీప్‌తో ఒప్పందం కుదిరినట్టు 'ఎక్స్' వేదికగా వెల్లడించింది.

# జూనియర్ హాకీ కోచ్‌గా సోయెజ్

### శ్రీజేష్ స్థానంలో నియామకం




భారత జూనియర్ పురుషుల హాకీ జట్టు హెడ్ కోచ్‌గా ఫ్రాన్స్‌కు చెందిన ఫ్రెడరిక్ సోయెజ్‌ను హాకీ ఇండియా అధికారికంగా నియమించింది. ఒలింపిక్ మెడలిస్ట్ పీఆర్ శ్రీజేష్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపడతారు. గతేడాది స్వదేశంలో జరిగిన ఎఫ్ఐహెచ్ జూనియర్ ప్రపంచ కప్‌లో భారత్‌కు కాంస్య పతకం అందించిన శ్రీజేష్ కాంట్రాక్ట్‌ను హెచ్ఐ రెన్యువల్ చేయలేదు. తన హయాంలో ఆడిన ఐదు టోర్నమెంట్లలో జూనియర్ జట్టు ఐదు పతకాలు అందుకున్నప్పటికీ తన పదవీ కాలాన్ని ముగించడంపై శ్రీజేష్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. కొత్త కోచ్ సోయెజ్‌కు అంతర్జాతీయ హాకీలో ఆటగాడిగా, కోచ్‌గా మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది.




# టీమిండియా టీ20 కెప్టెన్ రేసులో సంజూ శాంసన్

### - రవిశాస్త్రి కీలక వ్యాఖ్యలు

భారత క్రికెట్ జట్టు తదుపరి టీ20 కెప్టెన్‌గా సంజూ శాంసన్ అత్యుత్తమ అభ్యర్థి అని మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి అభిప్రాయపడ్డారు. సంజూకు జట్టును నడిపించే నాయకత్వ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.

నాయకత్వ అనుభవం: ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టును సంజూ విజయవంతంగా నడిపించిన తీరును రవిశాస్త్రి కొనియాడారు. ప్రస్తుతం ఆయన చెన్నై సూపర్‌కింగ్స్ (జూఖ) జట్టులో కీలక ఆటగాడిగా కొనసాగుతున్నారు.

ప్రపంచకప్ హీరో: ఇటీవల జరిగిన టీ20 ప్రపంచకప్‌లో భారత్ తరపున అత్యధిక పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ'గా నిలవడం ద్వారా సంజూ తన సత్తా చాటారని గుర్తు చేశారు.

విధ్వంసకర ఓపెనర్: ఓపెనర్‌గా బరిలోకి దిగి ప్రత్యర్థి బౌలింగ్‌ను చిన్నాభిన్నం చేయగల సామర్థ్యం సంజూ సొంతం. రాబోయే రెండేళ్లలో ఆయన నుంచి మరింత మెరుగైన ఆటతీరును చూడబోతున్నామని శాస్త్రి ధీమా వ్యక్తం చేశారు.

సంజూ బ్యాటింగ్‌లో స్థిరత్వం ఉండదనే విమర్శలకు ఇక స్వస్తి పలకాలని, ప్రపంచకప్ ఫైనల్ వంటి కీలక మ్యాచ్‌ల్లో ఒంటిచేత్తో గెలిపించి తననైపుణ్యాన్ని నిరూపించుకున్నారని రవిశాస్త్రి పేర్కొన్నారు.

# వరల్డ్ కప్ హీరో ఇషాన్ కిషన్‌కు రూ.కోటి నజరానా

### బిహార్ ముఖ్యమంత్రి ఘన సన్మానం




పాట్నా: టీమిండియా స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్, బీహార్ ముద్దుబిడ్డ ఇషాన్ కిషన్‌ను బిహార్ ప్రభుత్వం ఘనంగా గౌరవించింది. ఇటీవల జరిగిన 2026 టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో భారత్ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించినందుకు గాను ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి ఆయనకు రూ.కోటి నగదు బహుమతి అందజేశారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఇషాన్ కిషన్‌ను శాలువాతో సత్కరించి చెక్కు అందజేశారు. ఈ విషయాన్ని సామ్రాట్ చౌదరి సోషల్ మీడియా వేదికగా వెల్లడిస్తూ... ఇషాన్ కిషన్‌ను "బీహార్ బిడ్డ"గా అభివర్ణించారు.

ఫైనల్‌లో మెరుపు ఇన్నింగ్స్

న్యూజిలాండ్‌తో జరిగిన 2026 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ అద్భుత ప్రదర్శన చేశాడు. కేవలం 25 బంతుల్లోనే 4 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 54 పరుగులు రాబట్టి జట్టు భారీ స్కోరు సాధించడంలో దోహదపడ్డాడు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 9 మ్యాచుల్లో 317 పరుగులు సాధించిన ఇషాన్ అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో నాలుగో స్థానంలో నిలిచాడు.

విజయాన్ని సోదరికి అంకితం చేసిన ఇషాన్

ఈ విజయం ఇషాన్ కిషన్‌కు వ్యక్తిగతంగా ఎంతో భావోద్వేగంతో కూడుకున్నది. ఫైనల్ మ్యాచ్‌కు సరిగ్గా ఒక్కరోజు ముందు తన కజిన్ సిస్టర్ రోడ్డు ప్రమాదంలో మరణించారని ఆయన వెల్లడించాడు. తీవ్ర విషాదంలో ఉన్నప్పటికీ జట్టు ప్రయోజనాల కోసం మైదానంలోకి దిగి అద్భుతంగా ఆడాడు. మ్యాచ్ అనంతరం ఈ చారిత్రాత్మక విజయాన్ని తన సోదరికి అంకితం ఇస్తున్నట్టు ఇషాన్ కన్నీటి పర్యంతమయ్యాడు.

## పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో పూరి జగన్నాథ్ 'స్లమ్‌డాగ్'..

## త్వరలోనే థియేటర్లలోకి!



డ్యాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో రాబోతున్న పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్లమ్‌డాగ్ – 33 టెంపుల్ రోడ్'. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అయితే తాజాగా ఈ చిత్రానికి సంబంధించి పోస్ట్ ప్రొడక్షన్ శరవేగంగా జరుగుతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ప్రస్తుతం ఈక్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్, రీ–రికార్డింగ్ పనులు అత్యంత శరవేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే ఈ చిత్రం థియేటర్లలోకి రావడానికి సిద్ధమవుతోందని చిత్ర యూనిట్ తెలిపింది.

పూరి జగన్నాథ్ మార్క్ మేకింగ్‌కు తోడు రమీ అద్భుతమైన సంగీతం తోడవడంతో ఈ కాంబో థియేటర్లలో ఒక ఎక్స్‌ప్లోజివ్ విజువల్ ట్రీట్ ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ భారీ చిత్రాన్ని పూరి కనెక్ట్స్, జేబీ మోషన్ పిక్చర్స్ బ్యానర్లపై పూరిజగన్నాథ్, ఛార్మి కౌర్, జేబీ నారాయణరావు కొండ్రోళ్ల సంయుక్తంగా నిర్మిస్తుండగా... ఛార్మికౌర్ సమర్పకురాలిగా వ్యవహరిస్తున్నారు.

విజయ్ సేతుపతి సరసన సంయుక్త నటిస్తుండగా.. టబు, దునియా విజయ్, బ్రహ్మాజీ,వీటీవీ గణేష్,విష్ణురెడ్డి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పాన్ ఇండియా లెవెల్లో తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో ఈ చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది. విజయ్ సేతుపతిని పూరి జగన్నాథ్ తనదైన స్టైల్లో ఏ రేంజ్ ఊరమాస్ లుక్‌లో చూపించబోతున్నారో అని ఫ్యాన్స్, సినీ ప్రియులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు.

### 'పెద్ది' ప్రమోషన్లకు జాన్వీ దూరం

## ఇండస్ట్రీలో హాట్ టాపిక్!




బాలీవుడ్ స్టార్ హీరోయిన్ జాన్వీకపూర్ లెజెండరీ నటి శ్రీదేవి వారసురాలిగా సినీ రంగంలోకి అడుగుపెట్టి మంచి గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ ఇప్పటివరకు భారీ కమర్షియల్ విజయాన్ని మాత్రం అందుకోలేకపోయింది. బాలీవుడ్‌లో పలు చిత్రాల్లో నటించిన జాన్వీ, ఇప్పుడు తన ఫోకస్‌ను తెలుగు సినిమాలపై ఎక్కువగా కేంద్రీకరిస్తోంది. ప్రస్తుతం ఆమె నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ పెద్ది. మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న ఈ భారీ పాన్ ఇండియా స్పోర్ట్స్ డ్రామాలో జాన్వీ గ్రామీణ యువతిగా కనిపించనుంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్‌లలో ఆమె లుక్‌కు మంచి స్పందన లభించింది. అయితే ఇప్పుడు ఈ సినిమాకు సంబంధించిన మరో వార్త సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

తాజాగా ఓ ప్రముఖ దినపత్రిక ప్రచురించిన కథనం ప్రకారం... జాన్వీ కపూర్ 'పెద్ది' ప్రమోషన్లకు పూర్తిగా దూరంగా ఉండాలని నిర్ణయించుకుందనే ప్రచారం జరుగుతోంది. భారీ రెమ్యూనరేషన్ కారణంగానే ఆమె ఈ ప్రాజెక్ట్‌కు అంగీకరించిందని, సినిమాలో తన పాత్రకు అంత ప్రాధాన్యత లేదనే భావనతో ప్రమోషన్లలో పాల్గొనాలనే ఆసక్తి చూపడం లేదని ఆ కథనం పేర్కొంది. అయితే ఈ వార్తలపై చిత్ర యూనిట్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఒకవేళ ఈ ప్రచారం నిజమైతే... అది జాన్వీ కెరీర్‌పై ప్రభావం చూపే అవకాశముందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎందుకంటే 'పెద్ది' వంటి భారీ పాన్ ఇండియా చిత్రంతో ఆమెకు దక్షిణాదిలోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా మరింత గుర్తింపు దక్కే అవకాశం ఉంది.

### సీఎం అయినా 'దళపతి'గానే...

## 'జననాయగన్'లో విజయ్ టైటిల్‌పై క్లారిటీ!



తమిళ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన స్టార్ హీరో విజయ్ ఇప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. ఆయన స్థాపించిన ౹౦ఖ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించడంతో దక్షిణాది రాజకీయాల్లో భారీ చర్చకు దారితీసింది. ఇదే సమయంలో విజయ్ చివరి సినిమాగా తెరకెక్కుతున్న 'జననాయగన్'పై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. మొదట ఈ చిత్రాన్ని జనవరిలో విడుదల చేయాలని ప్లాన్ చేసినప్పటికీ సెన్సార్ సంబంధిత సమస్యల కారణంగా వాయిదా పడింది. ప్రస్తుతం ఈ అడ్డంకులను స్వయంగా విజయ్ పరిష్కరిస్తున్నారని, త్వరలోనే సినిమా విడుదలకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందని సమాచారం.

ఇక విజయ్ ముఖ్యమంత్రి అయిన తర్వాత సినిమాలో ఆయన పేరుకు ముందు ఉండే 'దళపతి' బిరుదును తొలగించి 'ముఖ్యమంత్రి విజయ్'గా చూపించబోతున్నారనే ప్రచారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ముఖ్యంగా ఇంట్రడక్షన్ సీన్స్‌లో మార్పులు చేస్తున్నారన్న వార్తలు అభిమానుల్లో చర్చనీయాంశమయ్యాయి. అయితే చిత్ర వర్గాలు ఈ వార్తలను పూర్తిగా ఖండించాయి. ఎన్నికల ఫలితాల తర్వాత కూడా సినిమాలో ఎలాంటి మార్పులు చేయలేదని... విజయ్ పేరుకు ముందు ఎప్పటిలాగే 'దళపతి' టైటిల్‌నే కొనసాగిస్తున్నట్టు స్పష్టం చేశాయి.

## వేసవి తాపానికి రాశీ ఖన్నా 'కూల్' సొల్యూషన్

టాలీవుడ్ అందాల భామ రాశీ ఖన్నా తన స్టైలిష్ లుక్స్‌తో నెటిజన్లను ఫిదా చేస్తోంది. భానుడు భగభగమంటున్న వేసవి కాలంలో తన లేటెస్ట్ ఫొటోషూట్‌తో అటు గ్లామర్‌ను, ఇటు కూల్ మెసేజ్‌ను అందిస్తోంది.

ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. వేసవి తాపానికి పాస్టెల్ రంగులే కరెక్ట్ అని రాశీ ఖన్నా చెబుతోంది. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన ఫొటోల్లో ఆమె ఎంతో ఉల్లాసంగా కనిపిస్తోంది. లేత పసుపు రంగు వన్–షోల్డర్ కో–ఆర్డ్ సెట్‌లో రాశీ చాలా గ్లామరస్‌గా కనిపిస్తోంది. ఈ డ్రెస్ డిజైన్ ఆమె అందాన్ని మరింత ఎలివేట్ చేస్తోంది. ఈ ఫొటోషూట్ కోసం రాశీ ధరించిన డ్రెస్ 'డిమ్ బై గాబ్రియెల్లా' అనే ప్రముఖ లగ్జరీ బ్రాండ్‌కు చెందింది. దీనికి సుకృతి గ్రోవర్ స్టైలింగ్ చేశారు. బాడీ సూట్ టాప్, లూజ్ ప్యాంట్ మోడల్‌లో ఉన్న ఈ డ్రెస్‌కు జతగా ఆమె ధరించిన గోల్డెన్ బ్యాంగిల్స్, ఇయర్ రింగ్స్ ఆమె లుక్‌కు రాజసాన్ని తెచ్చిపెట్టాయి.



## మెగాఫోన్ పట్టిన 'ఉస్తాద్'

### దర్శకుడిగా మారుతున్న ఎనర్జిటిక్ స్టార్ రామ్

టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన అభిమానులకు అదిరిపోయే బర్త్‌డే సర్ప్రైజ్ ఇచ్చారు. ఇన్నాళ్లూ తన నటనతో, డ్యాన్స్‌తో వెండితెరపై మ్యాజిక్ చేసిన రామ్ ఇప్పుడు సరికొత్త అవతారంలోకి మారబోతున్నారు. తన 23వ చిత్రం (RAPO23) ద్వారా రామ్ దర్శకుడిగా పరిచయం కాబోతున్నట్టు అధికారికంగా ప్రకటించాడు. ఈ వార్త ఇప్పుడు ఫిల్మ్ నగర్ వర్గాల్లో సంచలనంగా మారింది. ఎవరూ ఊహించని విధంగా ఒక ఉత్కంఠభరితమైన సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌తో రామ్ తనదర్శకత్వ ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి 'వీర' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారుచేసినట్టు సమాచారం. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ అత్యంత ఆసక్తికరంగా ఉంది. 'ది స్టోరీ ఆఫ్ ఏ లోన్ వోల్ఫ్' (The Story of a Lone Wolf) అనే ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ పోస్టర్ చూస్తుంటే... రామ్ ఒక ఇంటెన్స్ రోల్‌లో కనిపించబోతున్నారని స్పష్టమవుతోంది.




ఈ సినిమా కోసం రామ్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన సొంత నిర్మాణ సంస్థ అయిన 'స్రవంతి మూవీస్' ఉండగానే ప్రత్యేకంగా 'రాపో సినిమాటిక్స్' (RAPO Cinematics) అనే కొత్త ప్రొడక్షన్ హౌస్‌ను ప్రారంభించారు. తన కలల ప్రాజెక్ట్‌ను రామ్ సోదరుడు కృష్ణ పోతినేని ఈ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్నారు. దర్శకుడిగా తన నిర్ణయం గురించి రామ్ స్పందిస్తూ.. "ఇన్నాళ్లు వాళ్ల కథల్లో నా ముఖం చూశారు.. ఈ కథలో నా గొంతు వింటారు" అంటూ పవర్‌ఫుల్ కోట్‌ను షేర్ చేశారు. తనలోని మరో కోణాన్ని ఆవిష్కరించేందుకు రామ్ పూర్తిస్థాయిలో సిద్ధమైనట్లు ఈ మాటలు చెప్తున్నాయి. భారీఅంచనాలు నెలకొన్న ఈ #RAPO23 చిత్రం ఈ ఏడాది డిసెంబర్లో ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది.